# శ్రీ మహాలక్ష్మీ మాహాత్మ్యము

## శ్రీ మహాలక్ష్మీ దివ్య వైభవ నిత్య పారాయణ గ్రంథం



విశ్వపతి



క్షీరాంభోనిధి రత్న మండప మహాసౌవర్ణసింహాసనే
వామాంకస్థితయా హసద్వదనయా శ్రీకాంతయాలింగితమ్ ।
దోర్దండాంకిత శంఖ పంకజ గదా చక్రాసి ధారాశ్రయం
త్వా మిత్థం కలయామి జన్మ విభవం లక్ష్మీశ నారాయణమ్ ॥

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

# శ్రీ మహాలక్ష్మీ మాహాత్మ్యము

శ్రీ మహాలక్ష్మీ దివ్యవైభవ నిత్య పారాయణ గ్రంథము



## విశ్వపతి

శ్రీం


శ్రీ డిజైన్స్

**VEDIC LOGO DESIGNERS**
**www.lordofsevenhills.com**
**Cell: 98494 43752**

హైదరాబాదు
2021


## శ్రీ మహాలక్ష్మీ మాహాత్మ్యము

శ్రీ మహాలక్ష్మీ దివ్యవైభవ నిత్య పారాయణ గ్రంథము

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి


© సర్వహక్కులు రచయితవి.



First Edition : 2011
Fourth Re-print: 2021

వెల : అమూల్యం


ఈ పుస్తకం పూర్తి ఉచితం

ఈ పుస్తకం ఎవ్వరు అమ్మరాదు


Printed at:
**VIMAL PRINTERS**
1-1-776/3/1, SBI Colony,
Gandhinagar, Hyderabad.
Cell: 9849160301


తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి రచించిన వ్రత పుస్తకాలు
ఈ వెబ్‌సైట్‌ల నుంచి ప్రింట్ చేసుకొనవచ్చును.

**www.lordofsevenhills.com**


**T.V.R.K. MURTHY, M.Tech**
F-Block, Flat No. 903, Vertex Sadguru Krupa Apartments,
Nizampet Road, HYDERABAD - 500 085, India.
Cell : 98494 43752
Email : viswapathi@yahoo.com, shridesigns@gmail.com

# నివేదన

అజ్ఞాన తిమిరం హంతుం
శుద్ధజ్ఞాన ప్రకాశికా
సర్వైశ్వర్య ప్రదానేస్తు
త్వత్కలామయి సంస్థితా
– శ్రీ లక్ష్మీ హృదయం (అధర్వణ వేదం)

ఓ జగన్మాతా! జగజ్జననీ! జీవులందరిలోని అజ్ఞానమనే చీకటిని పారద్రోలే దివ్య కాంతి శక్తివి నీవే. నీవు ఎంతో దివ్య తేజస్సుతో ప్రకాశిస్తూ మమ్ములనందరిని అనుగ్రహిస్తున్నావు. మాయందు దయవుంచి నీలోని శతకోటి సూర్య సమానమైన తేజస్సునుండి ఒక కళను నాయందు ప్రసరింపవలసిందిగా ప్రార్థిస్తున్నాను. తద్వారా సర్వ ఐశ్వర్యాలను ప్రసాదించి నన్ను అనుగ్రహింపుము తల్లీ.

ఈ సృష్టిలోని సర్వ ప్రాణికోటికి పోషణ శక్తిని ఇచ్చుచున్నది ఆ జగన్మాతయే. సమస్త సంపదలకూ మూలకారకురాలైన ఆ జగన్మాత ఈ సృష్టిలో సర్వ మంగళ స్వరూపిణి. ధర్మం, సత్యం పరబ్రహ్మ యొక్క అనంత శక్తులన్నీ ఆ తల్లియందు వున్నవి. అందుకే ఆ తల్లిని నారాయణి అని అంటారు. నారాయణి అంటే సర్వ శక్తులకూ ప్రతీక అని అర్థం.

శ్రీలక్ష్మీ శ్రీనివాసుల అనుగ్రహముతో ఇప్పటిరకు నేను 24 పుస్తకాలు రచించడం జరిగింది. ఆ దివ్యదంపతుల అనుగ్రహంతో ఇవన్నీ కూడా భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి. వీటిలో రెండవదైన శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం ఎంతో ప్రజాదరణ పొంది దేశ విదేశాలలోని అనేక దేవాలయాలలో నిత్యం ఆచరింపబడుతోంది. లక్షలాదిమంది భక్తులు వారి వారి గృహాలలో ఈ వేంకటేశ్వర వ్రతాన్ని నిత్యం భక్తి శ్రద్ధలతో ఆచరిస్తూ ఆ స్వామివారి అనుగ్రహానికి పాత్రులవుతున్నారు. ఈ ప్రస్తుత రచన కూడా శ్రీలక్ష్మీ శ్రీనివాసుల అనుగ్రహమే తప్ప మరొకటి కాదు.

జగన్మాత శ్రీ మహాలక్ష్మీ లీలలను, ఆ తల్లి అమృతతత్వాన్ని వివరిస్తూ నిత్య పారాయణ గ్రంథాలు ఎక్కువగా వచ్చినట్లు తోచదు. తేలిక భాషలో భక్తులందరు నిత్యం పఠించేందుకు వీలుగా శ్రీ మహాలక్ష్మీ నిత్యపారాయణ గ్రంథం రచింపగలిగితే బాగుంటుందని నేను తలచేవాడిని. ఈ మధ్య అయిదు రోజులపాటు ఉదయాన్నే లేచేముందు శ్రీమహాలక్ష్మీ మాహాత్మ్యము అనే పుస్తకం కనులముందు కనిపించసాగింది. ఇది ఆ జగన్మాత అనుజ్ఞగా భావించి ఆ పుస్తకరచనకు పూనుకున్నాను. ఆ తల్లి అనుగ్రహంతో అతిత్వరలోనే ఈ పుస్తకం పూర్తయింది. ఆ జగన్మాత భక్తులందరికీ ఈ పుస్తకం ఎంతో ఆనందకరం కాగలదని తలుస్తున్నాను.

నా రచనలన్నీ వ్రాసింది నేనైనా నాచే వ్రాయించింది ఆ స్వామివారే... కేవలం కలం మాత్రం నేను పట్టుకున్నాను. అంతే... సాక్షాత్తూ స్వామివారే ప్రతి అక్షరానికి ప్రేరణ, ప్రతీ పదం ఆ శ్రీలక్ష్మీ శ్రీనివాసుల అనుగ్రహమే.

ఈ పుస్తకం రచిస్తున్నప్పుడు ఎందరో మహానుభావుల గ్రంథాలు, ఎంతగానో నాకు తోడ్పడ్డాయి. అలాగే ఈ పుస్తక ప్రచురణలో ఎంతోమంది సహకరించారు. వారందరికీ పేరుపేరున నా నమస్కారాలు. అలాగే ఈ గ్రంథ రచన ఆసాదాంతం నా సహధర్మచారిణి చి॥ల॥సౌ॥ శ్రీమతి వేంకట రుక్మిణీ వైదేహి, చిరంజీవులు సురేష్, ఆనంది, ఆముక్త, ఆదిత్య శ్రీనివాస్‌లు ఎంతో సహకరించారు. ఈ పుస్తకాల ప్రచురణలోనూ, అందరికీ చేరటంలోనూ ఎంతో సహాయ సహకారాలందిస్తున్న ఎంతోమంది మిత్రులకు, ఈ పుస్తకాన్ని, కవర్ చిత్రాలను ఎంతో అందంగా డి.టి.పి చేసిన శ్రీవాసవి ప్రింటర్స్, శ్రీమతి & శ్రీ పి జగదీష్‌కు ఎంతో అందంగా ముద్రించిన విమల్ ప్రింటర్స్ శ్రీమతి & శ్రీ జి. సత్యనారాయణకు శ్రీ లక్ష్మీశ్రీనివాసుల అనుగ్రహం ఎల్లప్పుడు ఉండాలని ప్రార్థిస్తున్నాను.

ఇంతటి భాగ్యాన్ని ఇచ్చిన ఆ పరబ్రహ్మ మూర్తికి ఇవే నా ప్రణామములు. ఎల్లప్పుడూ ఆ శ్రీవారి సేవలోనే గడుపుతాననీ, శ్రీ వేంకట తత్వాన్ని ప్రజలందరి హృదయాలకు చేరువగా తీసుకువెళ్లడమే నా జీవిత గమ్యం అని ఆ స్వామివారికి విన్నవించు కుంటున్నాను.

ఈ పుస్తక రచనకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించిన ప్రతి ఒక్కరికి సకల ఆయురారోగ్య సౌభాగ్యాలు కలగాలని ఆ శ్రీలక్ష్మీ శ్రీనివాసులను ప్రార్థిస్తున్నాను.

సర్వేజనా సుఖినోభవంతు ః
శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీ వేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళం

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

హైదరాబాద్.

# ఈ పుస్తకం ఎలా చదవాలి

భగవంతుడికి సంబంధించిన ఏ పుస్తకమైనా చదవడానికి ఎటువంటి నియమ నిబంధనలు వుండవని నా విశ్వాసం. వయస్సుతోగానీ, కులంతో గానీ, ఏ నిమిత్తమూ లేదు. మనస్సు నిర్మలంగానూ, శరీరం శుభ్రంగానూ ఉంటేచాలు. ఎవరైనా, ఏరీతిలోనైనా, ఏరోజైనా, ఏప్రదేశంలోనైనా చదువుకొనవచ్చును. ఆ శ్రీలక్ష్మీ శ్రీనివాసుల గురించిన పుస్తకం చదవడానికి కావలసినది నిర్మల భక్తి తప్ప మరొకటి కాదు. ఎటువంటి కఠోర నిష్ఠలు, ఉపవాసాలు అవసరం లేదు.

ఇకపోతే భగవంతునికి సంబంధించిన స్తోత్రాలకు, పారాయణ గ్రంథాలకి కొన్ని కొన్ని ప్రత్యేక పర్వ దినాలలోను, వైకుంఠ ఏకాదశి లాంటి పవిత్ర దినాలలోనూ చదివితే తప్పకుండా ఫలితం రెట్టింపుగా ఉంటుంది. ఈ విషయంలో ఏమాత్రం సందేహం లేదు.

**<u>ఆనందం కోసం చదవాలంటే :</u>**

కేవలం శ్రీ మహాలక్ష్మీ లీలలను గురించి తెలుసుకోవాలనే ఉత్సాహం వున్నవారు ఈ పుస్తకాన్ని, ఎప్పుడైనా ఏ రీతిలోనైనా చదువుకొనవచ్చును. ఏ అధ్యాయమైనా చదువుకొనవచ్చును. ఇన్ని పేజీలు చదివి తీరాలి అన్న నియమం లేదు. మీకు వీలున్నప్పుడు, వీలున్న రీతిలో చదువుకొనవచ్చును.

**<u>పారాయణలాగా చదవాలంటే :</u>**

ఈ పుస్తకం వారం రోజులపాటు పారాయణ చేస్తే ఎటువంటి సమస్య అయినా తొలగిపోతుంది. ఎటువంటి ఆర్థిక సమస్యలైనా వెంటనే తొలగిపోతాయి. చేతికి రావలసిన సొమ్ము ఆలస్యమైనప్పుడు ఈ పుస్తక పఠనంతో వెంటనే చేతికి అందగలదు. ఈ పుస్తకం పారాయణం చేయటం వలన మీరనుకున్న ఏ పనైనా దిగ్విజయంగా పూర్తవుతుంది. ఏ శుభకార్యం తలపెట్టినా నిర్విఘ్నంగా జరుగుతుంది. ఏ కోరిక కోరి పారాయణ చేసినా అది తప్పక నెరవేరుతుంది. కుటుంబంలో ఏ సమస్యలు ఉన్నా ఈ పుస్తకపారాయణతో తొలగిపోతాయి. ఏ కోరికలూ లేకుండా కూడా కేవలం జగన్మాత అనుగ్రహం కోసం కూడా వీలున్నప్పుడల్లా పారాయణ చేయవచ్చును. శుక్రవారం నాడు మొదటి అధ్యాయంతో ప్రారంభించి, రోజుకు ఒక అధ్యాయం చొప్పున చదవాలి. ప్రతిరోజు చదవటం పూర్తవగానే జగన్మాతకు ఏ ఫలమైనా నైవేద్యం పెట్టాలి. ఫలం దొరకని ఎడల చక్కెర నైవేద్యం పెట్టవచ్చును. శుక్రవారానికల్లా ఏడు అధ్యాయాల కథలూ పూర్తవుతాయి. శుక్రవారం నాడు ఏడవ అధ్యాయం మరలా చదువుకుని కొబ్బరికాయ కొట్టి మీకు వీలైన ఫలములు శ్రీమహాలక్ష్మికి నైవేద్యంగా సమర్పించి, మీరు, మీ బంధుమిత్రులు స్వీకరిస్తే తప్పక ఆ మహాలక్ష్మి అమ్మవారి అనుగ్రహం కలుగుతుంది. పారాయణ చేస్తున్న రోజులలో ఉపవాసం ఉండనవసరం లేదు. తిథి, వార, నక్షత్రాలతో సంబంధం లేకుండా ఏ శుక్రవారం నాడైనా మొదలుపెట్టి ఆ తరువాత శుక్రవారం వరకు పారాయణ చేయవచ్చును.

ఓపిక, శక్తి వున్నవారు ఏ శుక్రవారంనాడైనా పూర్తి పుస్తకం పారాయణ చేయవచ్చును. శుక్రవారం నాడే కాకుండా శ్రీలక్ష్మీశ్రీనివాసులకు ప్రీతికరమైన మాఘ, శ్రావణ, కార్తీక, మార్గశిర మాసములలో పారాయణ చేసినచో మిక్కిలి శుభప్రదము.

కుటుంబములలో ఎటువంటి శుభకార్యములు తలపెట్టినప్పుడైనా కుటుంబ సభ్యులలో ఎవరైనా ఈ పుస్తకాన్ని పఠించినచో ఆ శుభకార్యము నిర్విఘ్నముగా, శుభప్రదముగా జరుగగలదు.

ఈవిధంగా మీకు వీలున్న ఏ రోజైనా, ఏ రీతిలోనైనా చదివి శ్రీలక్ష్మీ శ్రీనివాసుల అనుగ్రహంతో సంపూర్ణ ఆరోగ్యంతో, సర్వ సంపదలతో కలకాలం సుఖముగా జీవించవచ్చును.

**శ్రీ లక్ష్మీ శ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు !**

– తిమ్మరాజు విశ్వపతిరామకృష్ణమూర్తి.

# అంకితము

నా తల్లిదండ్రులు కీ॥శే॥ బ్రహ్మశ్రీ తిమ్మరాజు లక్ష్మీ నరసింహారావు, తల్లి కీ॥శే॥ శ్రీమతి నాగరత్నాంబ గారల ప్రీత్యర్థముగా శ్రీలక్ష్మీశ్రీనివాసుల దివ్య చరణారవిందములకు నా ఈ 'శ్రీ మహాలక్ష్మీ మాహాత్మ్యము' గ్రంథమును భక్తితో సమర్పిస్తున్నాను.

**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి**

# మొదటి అధ్యాయము

ఈశానాం జగతోస్య వేంకటపతే ర్విష్ణోః పరాం ప్రేయసీం
తద్వక్షః స్థల నిత్యవాసరసికాం తత్క్షాంతి సంవర్ధినీమ్
పద్మాలంకృత పాణిపల్లవయుగాం పద్మాసనస్థాం శ్రియం
వాత్సల్యాది గుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరం

భూలోక వైకుంఠమైన తిరుమల క్షేత్రంలో వెలసిన శ్రీనివాసుని హృదయంలో నివసిస్తూ ఆ స్వామికి అత్యంత ప్రియురాలై అలరారుతూ, పద్మాసనంలో వేంచేసి సుకుమారమైన చేతులలో పద్మాలను అలంకారంగా ధరిస్తూ భక్తులందరినీ అనుగ్రహిస్తున్న శ్రీ మహాలక్ష్మికి ఇవే మా నమస్కారములు. సంపూర్ణ విశ్వంలో సకల శుభాలను అనుగ్రహించేది, సర్వ ఐశ్వర్యాలను ప్రసాదించేది, సర్వ భక్తుల కోర్కెలను తీర్చే అమృతమూర్తి శ్రీమన్నారాయణులవారి ప్రియ సఖియైన శ్రీ మహాలక్ష్మి. ఆ తల్లి ఉన్నచోట సర్వ సౌభాగ్యాలు నిలయమై వుంటాయి. దేనికీ కొరత వుండదు.



ఆ జగన్మాతను ఆరాధించేవారికి ఆ తల్లి సర్వసౌభాగ్యాలను, సర్వ ఐశ్వర్యాలను, అద్భుతమైన తేజస్సును ప్రసాదిస్తుంది. ఆ తల్లిని త్రికరణ శుద్ధిగా కొలిచేవారికి జీవితమంతా ఏ లోటూ లేకుండా శుభప్రదంగా జరుగుతుంది.

బ్రహ్మదేవుని మానస పుత్రులలో భృగు మహర్షి మొదటివాడు. ఆయన భార్య పేరు ఖ్యాతి. సకల విద్యా పారంగతుడైన భృగుమహర్షి ఒకసారి ఆది పరాశక్తి అనుగ్రహానికై తపస్సు చేశాడు. ఎంతో కఠోరంగా తపస్సు చేస్తున్న భృగు మహర్షి దృఢ సంకల్పానికి మెచ్చి ఆ తల్లి ప్రత్యక్షమైనది. అప్పుడు ఆ మహర్షి ఆదిశక్తియైన ఆ తల్లిని అనేక విధాల స్తుతించాడు. అందుకు జగన్మాత ఎంతో సంతోషించి ఏదైనా వరం కోరుకోమని ఆ మహర్షిని అనుగ్రహించినది. మహర్షి ఎంతో ఆనందపడి ఆ తల్లితో ఇలా అన్నాడు. తల్లీ! జగన్మాతా! నీవు ముల్లోకాలను ఏలే శక్తి స్వరూపిణివి. నీ అనుగ్రహం వల్లనే సమస్త జీవకోటి సుఖంగా జీవించగలుగుతున్నారు. మహాశక్తి స్వరూపిణివైన నీ అంశలతోనే పార్వతి, సరస్వతి, గాయత్రి అవతరించారు. నీలోని శక్తి స్వరూపమే పార్వతిగా, మహా శివుని అర్ధాంగిగా వెలుగొందుతున్నది. ఇక సర్వ విద్యలకూ అధిదేవతగా బ్రహ్మదేవుని ప్రియసఖిగా భాసిస్తున్నది నీలోని సరస్వతీ రూపమే కదా తల్లీ! ఇక మూడవదైన వైభవ కళ అగు శ్రీ మహాలక్ష్మీ స్వరూపాన్ని నాకు కుమార్తెగా అనుగ్రహించు తల్లీ! అని" అర్థించాడు. జగజ్జనని ఆ మహర్షిని అనుగ్రహించి ఆ విధంగానే జరుగుతుందని ఆశీర్వదించింది. భృగువు ఎంతో ఆనందపడి జగన్మాతను ఎన్నోవిధాల స్తుతించాడు. అంతట ఆ తల్లి అంతర్ధానమైనది. ఆ మహర్షికి వరమిచ్చినట్టుగా తన యందలి ఐశ్వర్య కళతో శ్రీ మహాలక్ష్మిగా అవతరించింది. కమలములవంటి కన్నులు, మన్మధుని విల్లువంటి కనుబొమ్మలు, మోదుగ చిగుళ్ళవలె ఎర్రనైన పెదవులు, అద్భుతమైన చెక్కిళ్ళతో దివ్యంగా ప్రకాశిస్తూ శ్రీ మహాలక్ష్మి ఆవిర్భవించింది. ఓ జగజ్జననీ! జగన్మాతా! శ్రీ మహాలక్ష్మీ నీకివే మా నమస్కారములు.

ఒకసారి నారాయణుడు ఘోర తపస్సును ఆచరించాడు. ఆ తపస్సును భంగపరచడానికై ఇంద్రుడు అప్సరసలను పంపించాడు. వారు ఎన్నో రకాలుగా

అభినయిస్తూ, ఎంతో అందమైన భంగిమలతో నాట్యం చేస్తూ నారాయణుని తపస్సు భంగం చేయడానికి ప్రయత్నించారు. నారాయణుడు ఏ మాత్రం చలించక తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. దివ్యమైన ఆ విశ్వరూప దర్శన తేజస్సుకి తట్టుకొనలేక అప్సరసలు దేవలోకానికి వెళ్ళిపోయారు. శ్రీమన్నారాయణుడు అప్సరసలకు విశ్వరూపంలో దర్శనమిచ్చాడని తెలుసుకున్న శ్రీ మహాలక్ష్మి ఆ స్వామిని భర్తగా పొందాలని తలచింది. ఆ స్వామినే ఆరాధిస్తూ కఠోరదీక్షతో తపస్సు ప్రారంభించింది. ఆ జగన్మాత తపస్సు ప్రభావంతో ముల్లోకాలు కంపించసాగాయి. అప్పుడు శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై శ్రీమహాలక్ష్మిని వివాహమాడటానికి అంగీకరించాడు. భృగువు శ్రీ లక్ష్మీ నారాయణుల వివాహం ఎంతో వైభవంగా జరిపించాడు.

స్వర్గలోకపు అధిపతియైన ఇంద్రుడు ఒకసారి అధికంగా సురాపానం సేవించి వెళుతుండగా దూర్వాస మహర్షి కనపడి పారిజాత పుష్పాన్ని ఇంద్రునికి బహూకరించాడు. సురాపాన ప్రభావంలో వున్న దేవేంద్రుడు ఆ పారిజాత పుష్పాన్ని ఐరావతంపై వుంచాడు. అక్కడితో ఆ పుష్ప దివ్య ప్రభావంచేత ఐరావతం ఎంతో దివ్యంగా నాట్యం చేస్తూ స్వర్గాన్ని విడిచి వెళ్ళిపోయింది. ఇది తెలుసుకున్న దూర్వాసుడు మహేంద్రుడు తనను అవమానించాడని తలచి అతడు సర్వ సంపదలూ కోల్పోతాడని శపించాడు. ఆ మహర్షి శాపంతో దేవేంద్రుడు సర్వసౌభాగ్యాలను కోల్పోయాడు. ఇంద్రలోకం కళావిహీనమైనది. అప్పుడు శ్రీమహాలక్ష్మి దేవలోకం విడిచిపెట్టి సముద్ర గర్భంలో దాగున్నది. సర్వం పోగొట్టుకున్న మహేంద్రుడు తాను చేసిన తప్పులు తెలుసుకుని ఎంతో చింతిస్తూ శ్రీమన్నారాయణులవారి వద్దకు వచ్చాడు.

శ్రీమన్నారాయణులవారిని ఇంద్రుడు ఈవిధంగా ప్రార్థించాడు. 'ఓ స్వామీ! కరుణామయా! జగన్నాథా! జగద్రక్షకా! నీకివే నా నమస్కారములు. ఇంద్రలోకపు భోగ భాగ్యాలను అనుభవిస్తూ అప్సరసల నాట్యాలతో సురాపానంతో ఒళ్ళు మరచి దూర్వాస మహర్షి ఆగ్రహానికి లోనైనాను. ఆ మహర్షి శాపంతో సర్వ సౌభాగ్యాలను కోల్పోయాను. ఇంద్రలోకం కళావిహీనంగా తయారైంది. దయచేసి నన్ను అనుగ్రహించి తిరిగి పూర్వ వైభవం వచ్చేలా కరుణించవలసింది. జనార్దనా!



జగత్ప్రభూ! నాకు నీవే దిక్కు, అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణం మమ అని వేడుకున్నాడు. అప్పుడు దయాసాగరుడైన శ్రీమన్నారాయణులవారు మహేంద్రుని దీన స్థితిని గ్రహించి అతడితో ఇలా అన్నారు. ఓ ఇంద్రా! నీవు చింతింపవలదు. శ్రీ మహాలక్ష్మి ప్రస్తుతం సముద్ర గర్భంలో వున్నది. కొంతకాలం తరువాత దేవదానవుల సముద్ర మధనంలో ఆమె నా చెంతకు రాగలదు. అప్పుడు నీ పూర్వ వైభవం తప్పక చేకూరుతుంది అని అన్నాడు. దేవేంద్రుడు శ్రీమన్నారాయణులవారికి నమస్కరించి శలవు తీసుకుని ఇంద్రలోకానికి వెళ్ళిపోయాడు.

కొంతకాలానికి దేవదానవులు అమృతం కోసమై సముద్రాన్ని చిలకడానికి సంకల్పించారు. వారందరూ కలిసి శ్రీమన్నారాయణులవారి వద్దకు వచ్చి సముద్ర మధనంలో తమకు సహకరించవలసినదిగా అర్థించారు. శ్రీమన్నారాయణులవారు వారితో సర్పరాజైన వాసుకిని తోడుగా చేసుకుని, మందర పర్వతంతో సముద్రాన్ని చిలకమని చెప్పాడు. దేవదానవులు ఆవిధంగానే చేసి సముద్రమథనాన్ని ప్రారంభించారు. అప్పుడు సముద్రం నుండి దివ్య తేజస్సుతో ప్రకాశిస్తూ కామధేనువు ఉద్భవించింది. కామధేనువును వశిష్ఠ మహర్షులవారు స్వీకరించారు. అటు తర్వాత సముద్రం నుండి దివ్యాశ్వం (ఉచ్చైశ్రవం) అవతరించింది. దానిని బలి చక్రవర్తి స్వీకరించాడు. దేవదానవులిద్దరూ ఇంకా తీవ్రంగా సముద్రాన్ని మథించగా అందునుండి ఐరావతం, కల్పవృక్షం, పారిజాతం ఉద్భవించాయి. వాటిని మహేంద్రుడు తీసుకున్నాడు.

అటు తర్వాత ఒక్కసారిగా వాతావరణం అంతా చల్లగా మారిపోయింది. సుగంధ పరిమళాలతో గాలి చల్లగా వీస్తున్నది. దేవకన్యలందరూ అద్భుతంగా గానం చేయసాగారు. ఆ శుభ సమయంలో సముద్ర గర్భం నుండి దివ్య తేజస్సుతో వెలిగిపోతూ శ్రీ మహాలక్ష్మి ఆవిర్భవించింది. ఆమె సౌందర్యానికి దేవదానవులందరూ ఆశ్చర్యపోయారు. ఎవరి నోట మాట రాలేదు. అప్పుడు క్షీర సముద్ర రాజ తనయ ఆ శ్రీ మహావిష్ణువును సమీపించి స్వామివారి మెడలో పూలమాల వేసింది. శ్రీమన్నారాయణులవారు శ్రీ మహాలక్ష్మిని అర్థాంగిగా స్వీకరించాడు. బ్రహ్మాది

దేవతలందరూ ఎంతో సంతోషించారు. ఆకాశం నుండి పూల వర్షం కురిసింది. శ్రీ లక్ష్మీ నారాయణులను దర్శించిన వారందరి భాగ్యం ఏమని చెప్పుదుము. సర్వ జీవుల హృదయాంతరాలలో అంతర్యామి స్వరూపంలో ఉంటూ సర్వ జీవుల శుభమునూ, సుఖమునూ చూసే నారాయణుడు, సర్వ జీవకోటిని ఆప్యాయంగా, అనురాగంతో అనుగ్రహించే జగన్మాత శ్రీ మహాలక్ష్మిల దర్శనభాగ్యంతో అందరూ ఎంతో సంతోషించారు.

పూర్వకాలంలో అవంతీ నగరంలో ధర్మయ్య, శ్యామల అనే దంపతులుండేవారు. ధర్మయ్య వడ్రంగి పని చేసుకుంటూ జీవితం గడిపేవాడు. ఆ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. ఒక సంవత్సరం కరువు కాటకాలు వచ్చి, ధర్మయ్యకు పని దొరకక ఇల్లు గడవటానికి చాలా కష్టపడ్డాడు. ఆ తరువాత సంవత్సరం కూడా కరువుతో దేశమంతా అల్లాడిపోయింది. ప్రజలందరూ తిండి గింజలు దొరకక నానా ఇబ్బందీ పడ్డారు. ధర్మయ్య పరిస్థితి మరీ దారుణంగా వున్నది. తినడానికి రెండు పూటలా భోజనం కూడా దొరకక మరమరాలు తింటూ కాలం గడుపుతున్నారు. కానీ ఆ దంపతులిద్దరూ ఇంత కష్టకాలంలో కూడా భగవంతుని మరువలేదు. వారింట్లో తరతరాల నుంచి వస్తున్న శ్రీ లక్ష్మీనారాయణుల విగ్రహం ఒకటి వున్నది. ఆ విగ్రహాన్ని రోజూ భక్తి శ్రద్ధలతో పూజించేవారు. రోజూ ఏదో ఒక పదార్థం తప్పక నైవేద్యం పెట్టేవారు. అయితే రెండు సంవత్సరాలనుండి కరువల్ల ఇంట్లో ఏ పదార్థమూ లేకపోవటం చేత ఇంటి ఆవరణలోని తులసి మొక్కనుంచి ఒక దళాన్ని శ్రీలక్ష్మీనారాయణులకు భక్తితో కనులకద్దుకుని సమర్పించేవారు.

రోజులు ఇలా గడుస్తుండగా ఒకరోజు రాత్రి పది గంటల సమయంలో తలుపు తట్టిన శబ్దమైంది. ఈ వేళలో ఎవరు వచ్చి వుంటారా అని ఆలోచిస్తూ తలుపు తీసిన ధర్మయ్య దంపతులకు మధ్య వయస్కురాలైన ఒక ముత్తైదువ కనిపించింది. ఆమెలో ఏదో దివ్య తేజస్సు గోచరించింది. ఇంత రాత్రివేళ ఇలా ఒంటరిగా వచ్చిన ఈమె ఎవరై వుంటుందా అని తలుస్తుండగా ఆమె వీరితో ఇలా అన్నది. నాయనా! నేను పొరుగు వూరినుండి మావూరు వెళుతూ దారి తప్పి ఇటుగా వచ్చాను. రాత్రి



కావటంతో త్రోవ సరిగా తెలియటం లేదు. ఈ రాత్రి మీ ఇంటనే విశ్రమించి తిరిగి ఉదయాన్నే వెళ్ళిపోతాను అన్నది. అప్పుడు ఆ దంపతులిద్దరూ ఆమెను లోపలికి రమ్మని ఆహ్వానించారు. అతిథి భగవంతుడితో సమానమంటారు కదా! కానీ ఆమెకివ్వడానికి ఇంట్లో ఏమీ కనిపించలేదు. కాసిని మంచి నీళ్ళు మాత్రమే ఇచ్చారు. ఇంట్లో పడుకొనడానికి ఒక చాప మాత్రమే వుంది. ఆ చాపనే ఆమెకు ఇచ్చారు. ఆ రాత్రి ఆమె ఆ చాపపైననే నిద్రించింది. తెల్లవారగానే లేచి, తిరిగి వెళ్ళడానికి సిద్ధమైంది. అప్పుడు ఆ దంపతులు ఆమెతో ఇలా అన్నారు. తల్లీ! నీవు తేజస్సులో సాక్షాత్తూ జగన్మాత శ్రీ మహాలక్ష్మిలా వున్నావు. నిన్ను వట్టి చేతులతో పంపుతున్నందుకు ఎంతో బాధగా వున్నది అని అన్నారు. అప్పుడు ఆమె “ఓ దంపతులారా! మీరు చింతింపవలదు, మీ ఇంట వుండటానికి ఒప్పుకున్నారు అదే చాలు” అని అన్నది. అప్పుడు శ్యామలమ్మ ఆమెకు బొట్టు పెట్టి పంపింది.

ఆమె వెళ్ళిన తరువాత కాసేపటికి ఇంట్లో ఏదో చప్పుడు వినిపించింది. ఏమిటా అని ఇల్లంతా చూడగా శ్రీలక్ష్మీ నారాయణుల విగ్రహం వద్దనుంచి శబ్దం వస్తున్నట్లుగా వారు గమనించారు. అక్కడ కొన్ని బంగారు నాణేలు పడి వున్నాయి. అప్పుడు వారికి జరిగినదంతా అర్థమైంది. రాత్రి తమ ఇంటికి వచ్చింది మరెవరో కాదు సాక్షాత్తూ జగన్మాత శ్రీ మహాలక్ష్మియే. ఆ తల్లికి తామేమీ ఇవ్వలేకపోయామే, కనీసం తగిన వసతి కూడా కల్పించలేకపోయామే అని బాధ పడ్డారు. ఆ తల్లిని అనేక విధాల స్తుతించారు. శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కలిగిన ఆ కుటుంబం ఆ ధనంతో పిల్లల పెళ్ళిళ్ళు ఘనంగా జరిపించారు. జీవించినంతకాలం సుఖంగా జీవించి, ఎన్నో సత్కార్యాలు చేసి చివరికి ముక్తిని పొందారు.

దీపం లక్ష్మీ స్వరూపం. ధర్మయ్య దంపతులు రోజూ శ్రీ లక్ష్మీ నారాయణుల విగ్రహం వద్ద దీపం వెలిగించేవారు. ఎంతటి కష్ట సమయంలోనైనా దీపారాధన మాత్రం మానలేదు. అందువలననే శ్రీ మహాలక్ష్మీ ఎంతో సంతోషించి వారిని అనుగ్రహించింది. దీపం జ్ఞాన స్వరూపం. దీపం ఐశ్వర్యస్వరూపం. దీపం వున్నచోట శ్రీ మహాలక్ష్మీ చిరునవ్వుతో వుంటుంది. ఎవరైతే నిత్యం దీపారాధన చేస్తారో వారు

సిరిసంపదలతో తులతూగుతారు. దేనికీ లోటు వుండదు. ధన ధాన్యాలు సమృద్ధిగా వుంటాయి. ఆ తల్లి అనుగ్రహం వున్నవారికి సర్వసౌభాగ్యాలూ లభిస్తాయి. ఓ జగజ్జననీ! జగన్మాతా! శ్రీ మహాలక్ష్మీ! నీకివే మా నమస్కారములు. ఓ మంగళ ప్రదాయినీ! నీకివే మా ప్రణామములు. ఓ లోకేశ్వరీ నీకివే మా నమస్కారములు. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లివి. శ్రీ మన్నారాయణుని ఇష్ట సఖివి. కమలముల వంటి కనులు కలదానివి. సమస్త శుభములు ప్రసాదించుదానివి. నీకు జయమగు గాక.

శ్రీ లక్ష్మీ కటాక్షం వున్నవారికి సర్వ సౌభాగ్యములు సమకూరుతాయి. దేనికీ లోటు లేకుండా జీవితమంతా ఆనందంగా గడుస్తుంది. శ్రీ మహాలక్ష్మీ కటాక్షం లేనివారు బానిసత్వం, దారిద్ర్యం, యాచన, అప్పులు, భార్యా వియోగం, ముసలితనం, అనారోగ్యం, దుస్సంతానం అనే అష్టకష్టాలపాలౌతారు. సర్వ మంగళ ప్రదాయిని అయిన జగన్మాత శ్రీ మహాలక్ష్మిని అర్చించినవారికి దాసదాసీ జనం, పుత్రులు, మిత్రులు, బంధువులు, ఆరోగ్యం, ధనం, ధాన్యం, వాహనం అనే అష్ట ఐశ్వర్యాలు లభిస్తాయి. శ్రీ లక్ష్మీ నారాయణులను ఎవరైతే ఎప్పుడూ మనస్సులో ప్రార్థిస్తూ వుంటారో వారికి సర్వ సౌభాగ్యాలూ కలుగుతాయి. వారికి ఎటువంటి ఆపదలు దరి చేరవు. శ్రీ లక్ష్మీ నారాయణులు అన్యోన్యమైన జంట. మత్స్యావతారంలో శ్రీలక్ష్మిగాను, కూర్మావతారంలో కూర్మవతిగాను, నరసింహావతారంలో శ్రీ మహాలక్ష్మిగాను, వరాహ అవతారంలో భూలక్ష్మిగాను, శ్రీరామావతారంలో సీతగాను, శ్రీకృష్ణావతారంలో రుక్మిణిగాను, ఆ మహాలక్ష్మి తన పెనిమిటి శ్రీమన్నారాయణులవారితో కలిసి అవతరించింది. శ్రీలక్ష్మీ నారాయణుల అన్యోన్యత, ఆప్యాయత, లోకంలోని దంపతులందరికీ ఆదర్శం.

పూర్వకాలంలో రామాపురం అనే గ్రామంలో కృష్ణశర్మ అనే మహాపండితుడు వుండేవాడు. అతను పౌరోహిత్యం నిర్వర్తిస్తూ ప్రతీనెల ఊరి దేవాలయంలో కళ్యాణోత్సవం జరిపించేవాడు. ఊరివారు ఇచ్చే కట్న కానుకలతో జీవితం సాఫీగా



గడిచిపోతున్నది. కృష్ణశర్మ ప్రతిరోజు ఉదయం రెండు గంటలసేపు ఎన్నో స్తోత్రాలు చదివేవాడు. శ్రీలక్ష్మీ నారాయణులను నిత్యం శ్రద్ధతో అర్చించేవాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు. విజయ, వనజ. కొంతకాలానికి విజయకు వివాహ వయస్సు వచ్చి వరునికోసం ప్రయత్నం మొదలుపెట్టాడు. కానీ ఎంత ప్రయత్నించినా మంచి సంబంధం దొరకడం కష్టమైంది. ఇలా వుండగా ఒకనాడు కృష్ణశర్మ పౌరోహిత్యానికి వెళ్ళి తిరిగి ఇంటికి వస్తుండగా కాలు రాయికి తగిలి కింద పడటంతో కాలు విరిగింది. వైద్యులు కనీసం ఆరు నెలలు విశ్రాంతి తీసుకోవాలని మంచం దిగరాదని చెప్పారు. ఒక ప్రక్కన కుమార్తె వివాహం కాలేదన్న బాధతో వున్న కృష్ణశర్మకు ఈవిధంగా అనుకోని కష్టం ఎదురైంది. అంతేకాక ఏకంగా ఆరు నెలలు ఏ కార్యక్రమాలకు వెళ్ళకపోతే ఇల్లు ఎలా గడుస్తుందని విచారం పట్టుకున్నది. అయినా చేసేదేమున్నది, ఇదంతా పూర్వజన్మ ప్రారబ్ధం అని తలచాడు.

ఈవిధంగా రెండు నెలలు గడిచాయి. ఈ రెండు నెలలు ఎటూ వెళ్ళకపోయేసరికి తాను కూడబెట్టుకున్న సొమ్ములో చాలా భాగం ఖర్చయిపోయింది. ఇక మిగిలిన సొమ్ముతో ఎన్నో రోజులు గడిచేలా లేదు. ఆ రోజు సాయంత్రం పొరుగు వూరైన వెంకటాపురం నుంచి వెంకటశెట్టి అనే వర్తకుడు వచ్చి తన ఇంటిలో బారసాల కార్యక్రమం వుందని ఎలాగైనా కృష్ణశర్మ ఆ కార్యక్రమం నిర్వహించాలన్నాడు. కృష్ణశర్మకు వెళదామని అనిపించినా వైద్యుడు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. తాను ఎటూ కదిలే పరిస్థితిలో లేనని వెంకటశెట్టితో చెప్పాడు. అందుకు వెంకటశెట్టి కృష్ణశర్మపై తనకెంతో నమ్మకమని తానే ఈ నామకరణ కార్యక్రమం జరిపించాలని అన్నాడు. అంతేకాక ఇంటివద్దకు బండి పంపుతానని ఏ మాత్రం శ్రమ పడకుండా వచ్చి ఆ శుభకార్యం నిర్వర్తించి తిరిగి రావచ్చునని అన్నాడు. కృష్ణశర్మకు ఇది బాగానే ఉందని అనిపించింది. ఇలా ఎంతకాలం మంచాన పడి వుంటాను? కొంచెం లేచి తిరగడం ప్రారంభిస్తే కానీ లాభం లేదని తలచాడు.

ఆ రోజు ఉదయాన్నే లేచి ఊరు బయలుదేరడానికి సిద్ధమయ్యాడు. వెంకటశెట్టి మాట ఇచ్చినట్లుగానే బండి పంపించాడు. కానీ బండి కొంచెం ఎత్తుగా ఉండటంతో

ఎక్కటం కృష్ణశర్మకు కష్టమైంది. ఇంటిలోనుంచి చెక్కబల్ల తెప్పించి ఆ బల్ల ఎక్కి జాగ్రత్తగా బండిపై కూర్చున్నాడు. నెమ్మదిగా తోలమని బండి వాడికి చెప్పాడు. అలాగే నెమ్మదిగా కృష్ణశర్మకు ఏ కష్టం తెలీకుండా జాగ్రత్తగా తీసుకువెళ్ళాడు. అక్కడ కార్యక్రమం పూర్తయిన వెంటనే తిరిగి రామాపురం బండిలో బయలుదేరాడు. చాలా రోజుల తరువాత బయటకు వచ్చి, కార్యక్రమం నిర్వర్తించటం వలన కృష్ణశర్మకు శరీరం చాలా అలసటగా అనిపించింది. దారి కూడా సరిగా లేకపోవటంచేత బండి పైకి, క్రిందికి ఊగుతున్నది. ఆ కుదుపుకు కృష్ణశర్మకు ఒళ్ళంతా నొప్పులుగా అనిపించింది. ఇంతలో బండికి ఎదురుగా ఒక్కసారిగా కొన్ని కుక్కలు భీకరంగా అరుచుకుంటూ, ఒకదానినొకటి తరుముకుంటూ ఒకదానిపై ఒకటి పడి అరుస్తూ రాసాగాయి. ఒక్కసారిగా జరిగిన ఈ పరిణామానికి ఎడ్లు బెదిరి, పరిగెత్తడంతో బండి అదుపు తప్పింది. దానిలో కూర్చున్న కృష్ణశర్మ ఒక్క ఉదుటున బండి నుండి కింద పడ్డాడు. ఆ పడటంతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న కాలికి తిరిగి దెబ్బ తగిలి బాధతో విలవిలలాడిపోయాడు. ఒక్కసారిగా జరిగిన ఈ పరిణామానికి బండి వాడు కూడా నివ్వెరపోయాడు. ఎడ్లను నెమ్మదిగా వీపుపై దువ్వి, బండిని ఒక ప్రక్కగా ఆపి, కృష్ణశర్మ వద్దకు వచ్చాడు. విపరీతమైన నొప్పితో బాధపడుతున్న కృష్ణశర్మను తిరిగి బండిలో కూర్చోబెట్టడానికి ప్రయత్నించాడు. కానీ కృష్ణశర్మ ఎంతో నొప్పితో విలవిలాడిపోతూ ఏ మాత్రం కదిలే పరిస్థితిలో లేడు. బండివాడికి ఏమీ పాలు పోవట్లేదు.

ఇంతలో సన్నగా వాన జల్లు ప్రారంభమైంది. కృష్ణశర్మ బాధ వర్ణనాతీతం. అదృష్టంకొద్దీ అటుగా ఇద్దరు రైతులు వచ్చారు. వారి సహాయంతో బండివాడు కృష్ణశర్మను నెమ్మదిగా బండిలోపల కూర్చోబెట్టాడు. భూలోకంలో జరుగుతున్న ఇదంతా వైకుంఠంలోని శ్రీ లక్ష్మీనారాయణులు గమనిస్తున్నారు. కృష్ణశర్మ పడుతున్న కష్టాలు చూసి జగన్మాత శ్రీ మహాలక్ష్మీ తల్లి హృదయం ద్రవించిపోయింది. తన ప్రియవల్లభుడు శ్రీమన్నారాయణులవారితో ఇలా అన్నది. స్వామీ! ఆ కృష్ణశర్మ దీన పరిస్థితి చూడండి. ఎందుకు ఇన్ని బాధలు పడుతున్నాడు. నిత్యం మనల్నే



సేవిస్తున్నాడు కదా. ఇంకా ఎంతకాలం ఈ బాధలు? అతని పరిస్థితి చూస్తుంటే జాలి వేస్తున్నది అని అన్నది. అప్పుడు శ్రీమన్నారాయణులవారు తన ప్రియసఖితో ఇలా అన్నాడు. ప్రియసఖీ, మానవులు తమ తమ పూర్వజన్మ పాప, పుణ్యాల ఫలంగా సుఖదుఃఖాలను అనుభవిస్తారు. పూర్వజన్మ కర్మ ఫలం పూర్తవగానే కృష్ణశర్మకు తప్పక మంచి రోజులు వస్తాయి. సమస్యలన్నీ తీరి సుఖంగా జీవిస్తాడు అని అన్నాడు. అప్పుడు ఆ తల్లి ఇలా అన్నది. ఏమి సుఖం స్వామీ! కుమార్తెల వివాహం ఇంకా కాలేదు. వారికి యుక్తవయస్సు దాటిపోతున్నది. కాలినెప్పి పూర్తిగా తగ్గకముందే తిరిగి ఇప్పుడిలా జరిగింది. ఎప్పటికి పూర్తిగా కోలుకుంటాడో కదా అని అన్నది. ఓ దేవీ! త్వరలోనే అతని కష్టాలన్నీ తీరి పోగలవు. నీవు చింతింపవలదు. నీ మనస్సు నేనెరిగితిని. నీ బిడ్డల బాధ నీవు చూడలేకపోతున్నావు, ఆ సంగతి నాకు తెలియనిది కాదు, కానీ కృష్ణశర్మ పూర్వజన్మ కర్మఫలం ఇంకా పూర్తి కాలేదు. కొన్ని రోజులలో ఇది పూర్తయి అతనికి మంచి రోజులు రానున్నాయి" అని అన్నాడు.

ఇక్కడ భూలోకంలో కృష్ణశర్మను బండిలో జాగ్రత్తగా కూర్చోబెట్టి ఆ బండివాడు అతడిని రామాపురం తీసుకునివచ్చి ఇంటివద్ద జాగ్రత్తగా దింపాడు. జరిగినదంతా తెలుసుకుని కృష్ణశర్మ భార్యా, కుమార్తెలు ఎంతో బాధ పడ్డారు. నిత్యం ఆ లక్ష్మీ నారాయణులను కొలిచే తమ కుటుంబానికి ఈ కష్టాలేమిటి అని ఎంతో చింతించారు. అటు తరువాత వైద్యుడు వచ్చి, కృష్ణశర్మను పరీక్షించి, కొద్ది కొద్దిగా కోలుకుంటున్న కాలు మరలా విరిగిందని ఇంక ఎటువంటి పరిస్థితులలోను ఇల్లు కదలవద్దని చెప్పి వెళ్ళాడు. కృష్ణశర్మ ఎంతో బాధపడి, ఈ కష్టాలనుండి తనకు ఎప్పుడు విముక్తి కలిగి, తిరిగి మునుపటి వలెనే తిరుగ గలుగుతానా అని తలచాడు.

ఇలా కొన్ని రోజులు జరుగగా కృష్ణశర్మ భార్య ఇందుమతి ఏదో తెలీని అనారోగ్యంతో మంచం పట్టింది. తల్లితండ్రులిద్దరూ మంచాల పాలవడంతో ఆ కుమార్తెల పరిస్థితి వర్ణనాతీతం. లోకంలోని కష్టాలన్నీ తమకే వచ్చాయని తలచారు. వైకుంఠంలో శ్రీమన్నారాయణులవారికి సపర్యలు చేస్తున్న శ్రీ మహాలక్ష్మి ఒకింత కోపం తెచ్చుకుని తన పెనిమిటితో ఇలా అన్నది. ఓ నాథా! ఏమిటీ వైపరీత్యం.

కృష్ణశర్మ మంచంపట్టి బాధపడుతుండగా భార్య ఇందుమతికి కూడా అనారోగ్యం రావటం ఏమిటి. ఎందుకు వీరికి ఇన్ని బాధలు. ఆ కుటుంబం పడుతున్న బాధలు నేను చూడలేకపోతున్నాను. మనమంటే వారికి అపరిమితమైన భక్తి కదా. ఇకనైనా వారిని కరుణించరాదా అని అన్నది. అప్పుడు శ్రీమన్నారాయణులవారు శ్రీ మహాలక్ష్మితో ఇలా అన్నారు. ఓ దేవీ! నీ కోపం నేను అర్థం చేసుకొనగలను. వారు మన ప్రియభక్తులన్నది నిజమే. కానీ, వారి పూర్వజన్మ కర్మఫలం ఇంకా పూర్తి కాలేదు. అది అయిన తరువాత వారు సుఖంగా జీవించే రోజులు వస్తాయి అని అన్నాడు. ఆ మాటలకు జగన్మాత, స్వామీ! మీరు చెప్పినది బాగానే వున్నది. కానీ, ఆ రోజులు వచ్చేదాకా, అసలు ఈ కుటుంబం బతికుంటుందా అని అనిపిస్తున్నది. మీరు వెంటనే వారిని కరుణించవలసినది అని అన్నది. అందుకు శ్రీమన్నారాయణుడు కృష్ణశర్మ కుటుంబంలోని కష్టాలన్నీ త్వరలోనే తొలగిపోతాయని అన్నాడు.

రోజులు ఇలా గడుస్తుండగా గోరుచుట్టుపై రోకటిపోటువలె ఒకనాడు కృష్ణశర్మ ఇంటిలో దొంగలు పడి చిన్న చిన్న వస్తువులతో సహా అన్ని వస్తువులని దోచుకున్నారు. ఆ కుటుంబం బాధ ఇంతా, అంతా అని చెప్పలేము. ఇదంతా గమనించిన శ్రీమహాలక్ష్మి హృదయం బాధతో నిండిపోయింది. ఆ తల్లికి తన భక్తులంటే అంతటి ప్రేమ. అంతటి అనురాగం. ఈ సృష్టిలో ఆ జగన్మాత చూపే అనురాగం ఎవరూ చూపరు. తన బిడ్డలు కష్టపడుతుంటే ఆ తల్లి ఏమాత్రం సహించలేదు. కృష్ణశర్మ కుటుంబం పడుతున్న కష్టాలు చూసి ఆ తల్లి హృదయం ద్రవించింది. వెంటనే శ్రీమన్నారాయణులవారితో ఇలా అన్నది. స్వామీ! ఇది చాలా అన్యాయం, మీరు ఆ కుటుంబంపై ఏమాత్రం కరుణ చూపటం లేదు. ఇక నేను ఏ మాత్రం ఉపేక్షించను. మీరు రక్షించకపోతే నేనే వెళ్ళి రక్షిస్తాను అని కోపంగా అన్నది. అప్పుడు శ్రీమన్నారాయణుడు, దేవీ! నీ బాధ నేను అర్థం చేసుకొనగలను, ఒక్కరోజు ఓపిక పట్టు. ఈ రోజుతో వారి కర్మఫలం పూర్తయినది. రేపటినుంచి మంచిరోజులు వస్తాయి అని అన్నాడు. అప్పుడు జగన్మాత శ్రీమన్నారాయణులవారితో ఇలా అన్నది. స్వామీ! ఇంక ఏమాత్రం నేను ఉపేక్షించలేను, వారి బాధలు చూడలేకున్నాను.



మీరన్నట్లు రేపు ఒక్కరోజు చూస్తాను. లేని యెడల నేనే స్వయంగా రేపు వారింటికి వెళతాను.

ఆ మరునాడు ఆ దేశపు రాజుగారినుండి కృష్ణశర్మకి ఆస్థానపండితునిగా నియమిస్తూ ఆహ్వానపత్రం వచ్చింది. ఆ నియామక పత్రం తీసుకువచ్చిన భటులు ఎన్నో కట్నకానుకలు తెచ్చారు. ఇవన్నీ చూసిన ఆ కుటుంబం ఆనందానికి అంతు లేదు. ఇన్ని రోజులకు తమ కష్టాలు తీరాయని సంతోషించారు. శ్రీ లక్ష్మీనారాయణులను ఎన్నో విధాల స్తుతించారు. వైకుంఠంలోని శ్రీ మహాలక్ష్మి కూడా ఎంతో సంతోషించింది. కొంతకాలానికల్లా ఆ కుటుంబం ఆర్థికంగా ఎంతో ఎదిగి కృష్ణశర్మ కుమార్తెలిద్దరి వివాహం మంచి వరులతో జరిగింది. కృష్ణశర్మ దంపతులిద్దరూ జీవించినంత కాలం సుఖంగా జీవించి చివరన ముక్తిని పొందారు.

వందే లక్ష్మీం పరశివమయీం సర్వభూతాంతరస్థాం
తేజోరూపాం కనకవసనాం సర్వ భూషోజ్వ లాంగీమ్
బీజాపూరం కనకకలశం హేమపద్మం దధానామ్
ఆద్యాం శక్తిం సకల జననీం విష్ణు వామాంక సంస్థామ్

– శ్రీ లక్ష్మీ హృదయం (అధర్వణ వేదం)

ఓ జగన్మాతా, శ్రీ మహాలక్ష్మీ సర్వమంగళ స్వరూపంతో విరాజిల్లుతున్న తల్లీ నీకివే మా నమస్కారములు. అనేక రకాలైన దివ్య ఆభరణాలు ధరించి నీవు ప్రకాశిస్తున్నావు. అత్యంత తేజస్సుతో, ఈ సృష్టిలో దేనికీ సాటిరాని అద్భుత సౌందర్యంతో ప్రకాశిస్తున్న నీకివే మా నమస్కారములు. చేతులలో నిండుగా వున్న బంగారు కలశాన్ని, బంగారు పద్మాలను ధరించి, శ్రీమన్నారాయణులవారి ఎడమ భాగంలో ఆసీనురాలై మమ్ములనందరినీ అనుగ్రహిస్తున్న ఆదిశక్తివి నీవే. నీకివే మా నమస్కారములు. ఎల్లవేళలా మమ్ములను రక్షించి నీ దివ్యానుగ్రహమునకు మమ్ములను పాత్రులను చేయవలసింది తల్లి. ఓ జగన్మాతా! నీకివే మా నమస్కారములు, ఓ శ్రీ మహాలక్ష్మీ! నీకివే మా ప్రణామములు, ఓ జగజ్జననీ! నీకివే మా నమస్కారములు.

# రెండవ అధ్యాయము

'శ్రీ' అంటే సిరులు కురిపించే శ్రీ మహాలక్ష్మి అని అర్థం. లక్ష్మి అనగా గుర్తు అని అర్థం. సర్వ ఐశ్వర్యాలకు ఆ తల్లియే కదా సంకేతం. సర్వ విద్యలకూ కూడా విద్యాలక్ష్మి రూపంలో ఆ తల్లియే సంకేతం. సర్వ శుభాలకు సంకేతం ఆ జగన్మాత. సర్వ విజయాలకు గుర్తు ఆ తల్లియే. సర్వ శక్తులకు ఆ తల్లియే సంకేతం. జగన్మాత శ్రీ మహాలక్ష్మీ తత్వాన్ని అర్థం చేసుకున్నవారికి సర్వ సంపదలూ కలుగుతాయి. సర్వ ఐశ్వర్యాలూ లభిస్తాయి. ఎటువంటి అనారోగ్యం దరిచేరదు. సర్వ కార్యాలయందు విజయం లభిస్తుంది.

ఇంతటి మహోన్నత మూర్తియైన శ్రీ మహాలక్ష్మిని అలక్ష్యం చేసేవారు ఎన్నో కష్టాలపాలౌతారు. ఆమెను నిర్లక్ష్యం చేసినవారు ఎంతటివారైనా అష్ట కష్టాలు అనుభవించక తప్పదు. సర్వ ప్రాణికోటిని తన సంతానంగా భావిస్తూ ఎల్లవేళలా కాపాడే అమృతమూర్తిని ఏ మాత్రం అలక్ష్యం చేయకూడదు. ఆమె పాలిట చిన్న అపచారం చేసినా అనేక కష్టాలపాలౌతారు. పూర్వకాలంలో కృష్ణాపురంలో రామయ్య,



సుశీల అనే దంపతులు వుండేవారు. రామయ్యది వ్యవసాయ కుటుంబం. ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. ఉన్న కొద్దిపాటి పొలాన్ని సాగు చేస్తూ దానిపై వచ్చే ఆదాయంతో ఆ కుటుంబం జీవిస్తున్నారు. పిల్లల వయస్సు పెరుగుతున్న కొద్దీ ఇంటిఖర్చులు పెరగసాగాయి. మగ పిల్లలిద్దరు పాఠశాలకు వెళ్ళేవారు. ఆడపిల్లలు చిన్నవారు. ఆదాయం పెరగకపోవటంతో ఇల్లు గడవడం కష్టంగా వుండేది. అలాగని ఏదైనా వ్యాపారం చేసి మరికొంత సొమ్ము సంపాదించుదామంటే రామయ్యకు ఏ వ్యాపారమూ రాదు. వచ్చే ఆ కొద్దిపాటి సొమ్ముతో ఎలాగో అలాగ నెట్టుకు వస్తున్నాడు.

సుశీల ప్రతినిత్యం క్రమం తప్పకుండా శ్రీ మహాలక్ష్మీ అష్టోత్తరాన్ని పఠించేది. అలాగే రామయ్య కూడా వీలున్నప్పుడల్లా ఆ ఊరిలోని శ్రీ లక్ష్మీనారాయణ ఆలయానికి వెళ్ళి స్వామి, అమ్మవార్లను దర్శించి వచ్చేవారు. రోజులు ఇలా గడుస్తుండగా ఒకనాడు వారింటికి ఒక దూరపు బంధువు వచ్చాడు. అతడు వీరింట ఒకరోజు వుండి తిరిగి వెళుతూ రామయ్యతో ఇలా అన్నాడు. రామయ్యా, నిన్ను చూస్తే నాకెంతో బాధ వేస్తున్నది. ఈ గంపెడు సంసారాన్ని ఎలా నెట్టుకొస్తున్నావో కదా, ఇంక ఈ పిల్లలు పెద్దవారై వారికి యుక్త వయస్సు వచ్చాక వారి వివాహాలు ఎలా చేయగలుగుతావు. నీవు ఆ శుభకార్యాలు ఎలా చేయగలుగుతావు. నీ సంపాదన చూస్తే చాలా తక్కువగా వుంది. ఇల్లు గడవటమే కష్టంగా వుంది. నీకొక విషయం చెప్తాను విను. మా ఊరిదగ్గర అష్టలక్ష్మీ దేవాలయం వున్నది. అక్కడ శ్రీ మహాలక్ష్మి అష్ట లక్ష్ములుగా వెలసి భక్తుల పూజలందుకుంటున్నది. ఆ తల్లి మహా మహిమాన్విత మైనదిగా ప్రజలందరి నమ్మకం. మీ దంపతులిద్దరూ ఒకసారి మా ఊరు వచ్చి ఆ దేవాలయానికి వెళ్ళి అష్టలక్ష్ములను దర్శించండి. ఆ తల్లి అనుగ్రహంతో మీకు మంచి రోజులు వచ్చి జీవితం సుఖప్రదంగా గడుస్తుంది అని అన్నాడు. ఇది విని ఆ దంపతులు ఎంతో సంతోషించి త్వరలోనే తప్పక వస్తామని చెప్పారు. ఆ బంధువు వారి వద్ద శెలవు తీసుకుని ఊరు వెళ్ళిపోయాడు.

ఆ మరునాడు ఉదయం లేవగానే ఆ దంపతులిద్దరూ స్నానం ఆచరించి, పూజ గదిలో నుంచుని శ్రీ లక్ష్మీనారాయణులకు నమస్కరించారు. రామయ్య ఇలా

అన్నాడు. స్వామీ! శ్రీమన్నారాయణా ఆర్త జన రక్షకుడవు, ఆపద్బాంధవుడవు, నిన్ను నమ్మినవారిని రక్షించే అమృతమూర్తివి. మమ్ములను ఈ కష్టములనుండి బయట పడవేసే భారం నీదే తండ్రి. ఓ శ్రీమన్నారాయణా! నీకివే మా నమస్కారములు. ఓ మహాలక్ష్మీ! జగన్మాతా! మిక్కిలి దయతో కూడి వున్న నీ చూపులతో మమ్ము కరుణించు తల్లీ! ఆశ్రయించిన వారిని ఎల్లవేళలా రక్షించే అమృతమూర్తివి నీవే తల్లీ! దయచేసి మా కుటుంబాన్ని కరుణించి, నీ అనుగ్రహాన్ని ప్రసాదించు తల్లీ! వీలైనంత త్వరలోనే నీ దర్శనం చేసుకుంటాము తల్లీ! ఓ జగన్మాతా! నీకివే మా నమస్కారములు అని ప్రార్థించి ఆ దంపతులిద్దరూ పదకొండు రూపాయలు పసుపు గుడ్డలో ముడుపు కట్టి పెట్టారు.

సమస్త చరాచర విశ్వమంతా శ్రీ మహాలక్ష్మి స్వరూపమే. కైలాసంలో రుద్రుని వద్ద పార్వతిగాను, స్వర్గంలో ఇంద్రుని వద్ద శచీదేవిగాను, సత్యలోకంలో బ్రహ్మదేవుని వద్ద సరస్వతిగాను, అగ్నిదేవునికి స్వాహా దేవిగాను, నాగలోకంలో నాగలక్ష్మిగాను, రాజుల వద్ద రాజ్యలక్ష్మిగాను, ధనికుల ఇంట ధనలక్ష్మిగాను, గృహములలో గృహలక్ష్మిగాను, ఉన్నది ఆ మహాలక్ష్మియే. విద్యా, వినయం, తేజస్సు, శక్తి అన్నీ కూడా ఆ మహాలక్ష్మి అనుగ్రహంతోనే ఒనగూరుతాయి. ఆ జగన్మాత ఎంతో దయాసముద్రురాలు. ఆమెను నమ్మి కొలిచేవారిని సర్వ ఐశ్వర్యాలతో, సర్వ శుభాలతో అనుగ్రహిస్తుంది. మంచి ఆరోగ్యంతో వుండటం కూడా ఐశ్వర్యమే. చక్కటి ఆరోగ్యాన్ని కూడా అనుగ్రహించేది ఆ శ్రీ మహాలక్ష్మియే.

కొంతకాలానికి రామయ్య, సుశీల దంపతులు ముడుపు తీసుకుని అష్టలక్ష్మి దేవాలయం దర్శించడానికై బంధువుల వూరు బయలుదేరి వెళ్లారు. వూరు చేరే సరికి సాయంకాలం అయింది. రాత్రి బంధువుల ఇంట నిద్రించి ఉదయాన్నే నిత్య కృత్యాలు తీర్చుకుని అష్టలక్ష్మీ దేవాలయానికి చేరుకున్నారు. సాక్షాత్తూ శ్రీ మహాలక్ష్మికి నిలయమై వున్నందువలన ఆ ఆలయం ఎంతో సుందరంగా వుంది. అద్భుతమైన ఆ దేవాలయ సౌందర్యం చూసి ఆ దంపతులిద్దరూ ఎంతో ఆనందపడ్డారు. అఖిల లోక సౌందర్యవతి, సుమనోహరి, శ్రీమన్నారాయణుని ప్రియసఖియైన శ్రీ మహాలక్ష్మి



అష్టలక్ష్ముల రూపంలో కొలువున్న ఆ దేవాలయం ఎంతో దివ్యమైన శోభను సంతరించుకోవటంలో ఆశ్చర్యమేమున్నది. శ్రీ లక్ష్మీ నారాయణులను ప్రార్థిస్తూ ఆ దంపతులు ఆలయంలోకి ప్రవేశించారు. ఆ రోజు ఆ జగన్మాత జన్మ నక్షత్రం కూడా కావటంచేత ఆలయమంతా ఎంతో దివ్యంగా అలంకరింపబడింది. ఆలయ స్తంభాలకు అద్భుతమైన పుష్పాలు చక్కగా అలంకరింపబడ్డాయి. మామిడాకుల తోరణాలు ఎంతో చక్కటి శోభను తీసుకు వస్తున్నాయి. ఎటు చూసినా రంగు రంగుల పుష్పాలతో కంటికి ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తూ ఉన్నది. అందమైన పుష్పములన్నీ శ్రీ మహాలక్ష్మి స్వరూపాలే. అందుకే పువ్వులను ఎప్పుడూ కాలితో తొక్కరాదు. చేతితో నలుపరాదు. పరిశుభ్రంగా లేని ప్రదేశాలలో వేయకూడదు. పుష్పం సాక్షాత్తూ శ్రీ మహాలక్ష్మి స్వరూపం. అందుకే శ్రీమన్నారాయణుడు పుష్పాలంకారప్రియుడు. ఎవరైతే తనను దివ్య పుష్పాలతో అలంకరిస్తారో వారియెడల ఆ స్వామి ఎంతో ప్రసన్నుడౌతాడు.

ఆ ఆలయ అద్భుత శిల్పకళా సౌందర్యానికి రామయ్య, సుశీల దంపతులిద్దరూ ఎంతో మురిసిపోయారు. తనివితీరా ఆ ఆనందాన్ని ఆస్వాదిస్తున్నారు. ఆలయ మండపంలో ఒక మహా పండితుడు శ్రీ మహాలక్ష్మీ వైభవాన్ని ఇలా దివ్యంగా వర్ణిస్తున్నాడు. ఓ భక్తజనులారా, ముల్లోకాలను ఎల్లవేళలా రక్షించే శ్రీ మహాలక్ష్మి బ్రహ్మదేవుని వద్ద సరస్వతిగా, శ్రీమన్నారాయణుని వద్ద శ్రీమహాలక్ష్మిగా, పరమేశ్వరుని వద్ద పార్వతిగా భాసిల్లుతున్నది. ఆ తల్లిని కొలిచినవారికి సర్వ సంపదలూ కలుగుతాయి. సర్వ ఐశ్వర్యాలూ లభిస్తాయి. దేనికీ కొదువ వుండదు. సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుంది. ప్రతీ నిత్యం ఆ తల్లిని స్మరించినా, కీర్తించినా సర్వ శుభాలూ కలుగుతాయి. ఆ రోజంతా జయప్రదంగా గడుస్తుంది అని చెప్తున్నాడు.

రామయ్య దంపతులు ఆ పండితుడు చెప్పిన విశేషాలన్నీ విని అక్కడినుండి బయలుదేరి ముందుగా ఆదిలక్ష్మి ఆలయం వద్దకు వచ్చారు. అద్భుత తేజస్సుతో ప్రకాశిస్తున్న ఆ తల్లికి నమస్కరించి, అటు తరువాత ధాన్యలక్ష్మి వద్దకు వచ్చారు. ధాన్యలక్ష్మిని ఎన్నో విధాల స్తుతించి, తరువాత ధైర్యలక్ష్మి, గజలక్ష్మి, సంతానలక్ష్మి, విజయలక్ష్మి, విద్యాలక్ష్మి, ధనలక్ష్మిలను దర్శించారు. ఎంతో దివ్యమైన తేజస్సుతో,

అద్భుతమైన పట్టు వస్త్రాలతోను, రకరకాల దివ్య ఆభరణాలతోను, అష్టలక్ష్ములందరు ఎంతో అద్భుతంగా దర్శనం ఇచ్చారు. రామయ్య దంపతులు అష్టలక్ష్ములను ఎన్నో విధాల స్తుతించి, తమను కరుణించవలసినదిగా ప్రార్థించారు. ఆలయంనుండి వెలుపలకు వచ్చే ముందు రామయ్య ఒకసారి కనులు మూసుకుని శ్రీ మహాలక్ష్మిని ప్రార్థిస్తూ మనస్సులో ఇలా అనుకున్నాడు. ఓ జగన్మాతా! శ్రీ మహాలక్ష్మీ! నీవు నన్ను కరుణించి, అంతులేని ఐశ్వర్యం అనుగ్రహిస్తే నేను మా ఊరిలో తప్పకుండా నీ అష్టలక్ష్మీ స్వరూపాలతో అద్భుతమైన ఆలయాన్ని నిర్మిస్తాను తల్లీ అని అనుకున్నాడు. అటు తరువాత దంపతులిద్దరూ తిరిగి తమ ఊరు చేరుకున్నారు. శ్రీ మహాలక్ష్మి తల్లి అనుగ్రహం వలన రామయ్య కుటుంబం మంచి అభివృద్ధిని సాధించింది. కుమారులిద్దరికీ మంచి చదువులు కలిగి ఉన్నత ఉద్యోగాలు లభించాయి. కుమార్తెలకు మంచి వరులతో వివాహాలు జరిగాయి. స్నేహితులు కొంతమంది సహాయం చేయగా రామయ్య రెండు, మూడు వ్యాపారాలు ప్రారంభించాడు. ఆ శ్రీ మహాలక్ష్మీ తల్లి అనుగ్రహం వలన ఆ వ్యాపారాలన్నీ ఎంతో అభివృద్ధి చెందాయి. ఎన్నో లాభాలు వచ్చాయి. చుట్టు ప్రక్కల గ్రామాలలో రామయ్య అంతటి ధనవంతుడు లేడని ప్రజలు చెప్పుకునేవారు. ఇంత సంపద రావటంతో తాను ఆ రోజున శ్రీ అష్టలక్ష్మీ దేవాలయం కట్టిస్తానని ఆ జగన్మాతకు ఇచ్చిన మాట మరచాడు. ధన సంపాదనలో పడి భగవంతుని స్మరించడం కూడా మరచాడు.

తమకిచ్చిన మాట తప్పినందుకు అష్టలక్ష్ములకు ఆగ్రహం కలిగింది. అంతే ఎంతో వెలిగిపోతున్న ఆ కుటుంబంలో ఎన్నో సమస్యలు రాసాగాయి. ఆదిలక్ష్మి అనుగ్రహం కోల్పోవటంతోనే రామయ్యకు వ్యాపారంమీద పట్టు సడలింది. తన సరుకు అమ్ముడుపోవటం కష్టంగా మారింది. తాను ఎంత నాణ్యమైన సరుకు విక్రయించినా, కొనేవారు లేక వ్యాపారంలో నష్టం రావటం మొదలైంది. వ్యాపారాలు ఇలా వుండగా ధాన్యలక్ష్మి అనుగ్రహం కోల్పోవటంతో పంట సరిగా రాలేదు. అకాల వర్షాలు వచ్చి అంతా నీటిలో కొట్టుకుపోయింది. అటు వ్యాపారం సరిగా లేక ఇటు పంట కూడా చేతికి రాక రామయ్య నానా కష్టాలు పడసాగాడు. ఇదిలా వుండగా



ధైర్యలక్ష్మి కూడా ఆగ్రహించటం చేత తనలో ఇన్ని రోజుల నుండి వున్న ధైర్యం కూడా సన్నగిల్లింది. వ్యాపారం దెబ్బ తిన్నప్పటికి, పంట కోల్పోయినప్పటికి మరలా వచ్చే సంవత్సరం పుంజుకొనవచ్చునని అనుకున్నాడు. కానీ ఎప్పుడైతే ధైర్యలక్ష్మి కూడా ఆగ్రహించిందో రామయ్య ధైర్యం మొత్తం కోల్పోయాడు. ఏ పనీ చెయ్యలేకపోయాడు. ఏదో తెలియని నీరసం రామయ్యను ఆవహించింది.

కొన్ని రోజులకు గజలక్ష్మికి కూడా రామయ్యపై ఆగ్రహం కలిగింది. అక్కడతో రామయ్య అప్పులపాలయ్యాడు. తాను ఉన్న ఇంటిని కూడా తాకట్టు పెట్టవలసి వచ్చింది. ఆ విధంగా అష్టలక్ష్ములైన ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, ధైర్యలక్ష్మి, గజలక్ష్మి, సంతానలక్ష్మి, విజయలక్ష్మి, విద్యాలక్ష్మి, ధాన్యలక్ష్ముల ఆగ్రహానికి గురైన వాడై రామయ్య అనేక కష్టాలు పడ్డాడు. చివరికి ఒకనాడు ఇల్లు కూడా అప్పులవారి పరమై ఒక అద్దె ఇంట్లో నివసింపసాగాడు. ఎంతో వైభవంగా బతికిన ఆ ఊరిలో తాను ఎందుకూ కొరగాని బికారివానిలాగా బతకవలసి వచ్చిందని చింతించాడు. ఇదంతా తన పూర్వజన్మ కర్మఫలం అని తలచాడు. అంతే తప్ప తాను అష్టలక్ష్ములకు ఇచ్చిన మాట నిలబెట్టుకోనందు వలననే ఇది జరిగిందని గ్రహించలేకపోయాడు.

కాలం ఇలా గడుస్తుండగా ఒకసారి ఆ ఊరికి ఒక సాధువు వచ్చాడు. అతడు ఎంతో మహిమ గలవాడని, ఎవ్వరి జాతకమైనా ఎంతో నిక్కచ్చిగా చెప్పగలడని ఊరంతా చెప్పుకున్నారు. ఆ మాట విన్న రామయ్య దంపతులు ఒకనాడు ఆ సాధువు వద్దకు వెళ్ళి తమ పరిస్థితిని విన్నవించారు. వీరి మాటలన్నీ సావధానంగా విన్న ఆ సాధువు కనులు మూసుకుని కొద్దిసేపు ధ్యానం చేసి ఏదో స్ఫురించిన వాడై కనులు తెరిచి రామయ్య దంపతులతో ఇలా అన్నాడు. నాయనలారా! శ్రీమహాలక్ష్మీ అనుగ్రహం కోల్పోవడం వలననే మీకీ గతి పట్టింది. నీవు ఒక్కసారి నీ బంధువు వూరు వెళ్ళినప్పుడు అక్కడ వున్న అష్టలక్ష్మీ ఆలయానికి వెళ్ళి ఆ తల్లులందరినీ దర్శించి, వారికి ఒక అద్భుత ఆలయం మీ ఊరిలో కూడా కట్టిస్తానని మ్రొక్కుకున్నావు. కానీ ఎంతో ధనం సంపాదించిన తరువాత నీవు కాలక్రమేణా ఆ మాట మరిచిపోయావు. ఆ తల్లులందరూ నిన్ను అనుగ్రహించడం వలననే నీవు వ్యాపారంలో ఎంతో లాభాలు

ఆర్జించడం జరిగింది. నీ పంటలన్నీ ఎంతో ఎక్కువ దిగుబడిని ఇచ్చాయి. కానీ నీవు ఈ విషయం గ్రహించక ఆ అష్టలక్ష్ముల ఆగ్రహానికి గురైనావు. ఆడిన మాట తప్పటం వలన నీకీ దుస్థితి పట్టింది అని అన్నాడు.

అప్పుడు రామయ్య ఆ సాధువుతో 'స్వామీ! ఇప్పుడు నాకు గుర్తుకు వచ్చింది. నేను మా ఊరిలో అష్టలక్ష్మీ దేవాలయం కట్టిస్తానని అన్నమాట నిజమే. కానీ నాకు ఐస్వర్యం కలుగగానే కానరాని అహంకారంలో పడి ఆ తల్లులకు ఇచ్చిన మాట మరిచాను. ఇప్పుడు ఉన్న పరిస్థితిలో ఎలా తీర్చగలను. ఈ పరిస్థితి నుంచి బయట పడితే ఈ సారి తప్పక నెరవేరుస్తాను. ఈ దుర్భర కష్టాల నుండి బయట పడే ఉపాయం చెప్పి మమ్ములను అనుగ్రహింపవలసింది' అని ప్రార్థించాడు. అప్పుడు ఆ సాధువు వారితో ఇలా అన్నాడు. 'ఓ దంపతులారా! మీరు ఆ దేవాలయానికి వెళ్ళి అక్కడే పదకొండు రోజులు నిద్రించి రోజూ ఉదయాన్నే ఆలయ ఆవరణమంతా మీ చేతులతోనే శుభ్రం చేసి ఆ అష్టలక్ష్ములను సేవించండి. అప్పుడు మీకు ఆ తల్లుల అనుగ్రహం కలిగి తిరిగి మీ పూర్వ వైభవం మీకు కలుగుతుంది' అని అన్నాడు. ఈ మాటలు విన్న రామయ్య దంపతులు అలాగే చేస్తామని చెప్పి ఆ సాధువుకు నమస్కరించి, అతని వద్ద సెలవు తీసుకుని తమ ఇంటికి వెళ్లారు.

రామయ్య దంపతులిద్దరూ మరునాడే బయలుదేరి ఆ ఊరికి వెళ్లి అక్కడ ఆలయం పక్కన వున్న ధర్మసత్రంలో బస చేసారు. ఆ ధర్మసత్రంలోనే పదకొండు రోజులు వుండి రోజూ ఉదయాన్నే లేచి త్వరత్వరగా కాలకృత్యాలు తీర్చుకుని ఆలయప్రాంగణమంతా చీపురు తీసుకుని శుభ్రంగా ఊడ్చేవారు. అటు తరువాత నీళ్ళు చల్లి సుశీల మంచి ముగ్గులు పెట్టేది. ఈ విధంగా ఆ అష్టలక్ష్ములను పదకొండు రోజులు సేవించిన వారవటంచేత తిరిగి అమ్మవారి అనుగ్రహం పొందారు. అటు తరువాత తమ ఊరు వచ్చారు. ఆ మరునాడే ఎప్పుడో దేశాంతరాలు వెళ్ళిన ఒక పాత స్నేహితుడు కలిసి రామయ్య దీన పరిస్థితిని తెలుసుకుని ఎంతో బాధపడి తిరిగి ఏదైనా వ్యాపారం ప్రారంభింపవలసినదిగా కొంత సొమ్ము ఇచ్చాడు. ఇది శ్రీ మహాలక్ష్మీ అనుగ్రహం తప్ప మరొకటి కాదని ఆ దంపతులు తలచారు. ఆ



జగన్మాత అనుగ్రహంతో కొద్దిరోజులలో వ్యాపారం ఎంతో అభివృద్ధి చెందింది. ఆ లాభాలతో మరొక వ్యాపారం ప్రారంభించి దానిలోనూ ఎన్నో లాభాలు గడించాడు. వచ్చిన సొమ్ముతో తిరిగి సొంత ఇల్లు కట్టుకున్నాడు. రెండు ఎకరాలు పొలం కూడా కొన్నాడు. ఆ అష్టలక్ష్ముల అనుగ్రహంతో ఆ సంవత్సరం పంటలు బాగా పండి ఎంతో ఆదాయం లభించింది. రెండు సంవత్సరాలలో పోగొట్టుకున్నదానికంటే ఎక్కువ సంపాదించాడు. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకూడదని తలచి పండితులను పిలిచి, శ్రీ అష్టలక్ష్మీ ఆలయం శంకుస్థాపనకై శుభముహూర్తం నిశ్చయించాడు. శ్రీమహాలక్ష్మి అనుగ్రహంతో ఆ ఆలయం కొద్ది కాలంలోనే ఎంతో అద్భుతంగా నిర్మితమైనది. చుట్టు ప్రక్కల వున్న వూళ్ళలో ఇంత దివ్యమైన ఆలయం ఎక్కడా లేదని పేరు వచ్చింది. రోజూ ఎందరో భక్తులు వచ్చి, అష్టలక్ష్ములను దర్శించి, ఆనందపడి వెళ్ళేవారు. రామయ్య దంపతులు బ్రతికినంతకాలం సుఖంగా జీవించి, చివరన ముక్తిని పొందారు. శ్రీ మహాలక్ష్మీని నమ్మి కొలిచేవారికి ఎటువంటి కష్టాలు దరి చేరవు. సర్వ సౌభాగ్యాలూ కలుగుతాయి.

ఓ జగన్మాతా! శ్రీ మహాలక్ష్మీ! ఓ జగజ్జననీ! మేము చేసే పాపాలను క్షమించి, మమ్ములను అనుగ్రహించే తల్లీ! సర్వ మంగళ మనోహరియైన నీకు జయమగుగాక. పద్మజుడైన బ్రహ్మదేవునిచే కీర్తింపబడుతూ ఉండే ఓ పద్మాలయా! నీకు జయమగుగాక. నిన్ను నమ్మి కొలిచేవారికి సమస్త సంపదలను సమృద్ధిగా అనుగ్రహించే ఓ శ్రీదేవీ! నీకు జయమగుగాక. వెయ్యి విధాలుగా, వెయి వెలుగులతో, పద్మపీఠంపై సుమనోహరంగా అలరారుతున్న ఓ పద్మావతీ నీకు జయమగుగాక. సర్వ శుభ లక్షణాలతో శ్రీమన్నారాయణుని దివ్య హృదయంలో వెలుగొందుతున్న శ్రీ మహాలక్ష్మీ నీకివే మా నమస్కారములు. భద్ర అని పిలువబడుతున్న భృగు పుత్రికవైన శ్రీ మహాలక్ష్మీ నీకివే మా ప్రణామములు. నిత్య అని పిలువబడుతున్న నిర్మల జ్ఞాన వేద్యురాలైన ఓ జగన్మాతా! నీకివే మా నమస్కారములు. అమ్మా! జగన్మాతా! ఆ శ్రీమన్నారాయణుని హృదయంలో నీవు కొలువై ఉన్నావు! నీ హృదయంలో జగన్నాథుడైన ఆ స్వామి కొలువై వున్నాడు. మీరిద్దరూ కలిసి నా హృదయంలో కొలువై నన్ను అనుగ్రహించండి. మీరిరువురికీ నా నమస్కారములు.

ఓ జగన్మాతా! శ్రీ మహాలక్ష్మీ! నీవు సాక్షాత్తూ బ్రహ్మను కన్న తల్లివి! మన్మధుని కన్న తల్లివి కూడా నీవే. అంతే కాదు, దేవతలను కన్న తల్లివి కూడా నీవే. సర్వ కోర్కెలను నెరవేర్చే కామధేనువు, కల్పవృక్షము, మీ తోబుట్టువులే కదా తల్లీ. ఈ విశ్వానికంతటికీ తన చల్లని కిరణాలతో సేద తీర్చే చంద్రుడు నీ సోదరుడే కదా తల్లీ! నీ విభుడు పాలసముద్రంలో శేషసాయిగా వుంటాడు. నీవేమో సముద్రరాజుకు గారాల పట్టివి. ఓ జగన్మాతా! నీకివే మా నమస్కారములు. ఓ శ్రీమన్నారాయణా నీకివే నా ప్రణామములు. జగత్కళ్యాణ కారకులైన మీరిద్దరూ నన్ను అనుగ్రహించి మీ దయకు నన్ను పాత్రులను చేయవలసిందిగా నా ప్రార్థన.

పూర్వకాలంలో కళింగదేశంలో వేంకటాచారి అనే కంసాలి వుండేవాడు. అతడు పనిలో ఎంతో నైపుణ్యం చెందినవాడిగా పేరు గాంచాడు. వేంకటాచారి, అతని భార్య సుమతి ఎంతో దైవభక్తులు. ఆ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. శారద, నీరజ. వారు చక్కగా చదువుకుంటూ తల్లికి చేదోడు, వాదోడుగా వుండేవారు. వేంకటాచారి నైపుణ్యం కలవాడే కానీ, ఏ మాత్రం కల్తీకి పాల్పడకుండా ఎంతో నిజాయితీగా పని చేసేవాడు. మిగిలిన తోటి కంసాలులు కక్కుర్తిపడి కల్తీ చేసి తక్కువ సొమ్ముకే పనులు ఒప్పుకుని చేసేవారు. దీనివలన వేంకటాచారికి ఆదాయం అంత ఎక్కువగా వుండేది కాదు. ఏదో వచ్చిన సొమ్ముతో కాలం గడుపుకుంటూ వస్తున్నాడు. రోజులు ఇలా గడుస్తుండగా పెద్దకూతురికి వివాహ వయస్సు వచ్చింది. నెమ్మదిగా సంబంధాలు వెతకటం మొదలు పెట్టాడు. కానీ ఎక్కడా, ఏదీ కుదరలేదు.

వేంకటాచారి పక్క ఇంట్లో కృష్ణశర్మ అనే పురోహిత కుటుంబం ఉంటుంది. కృష్ణశర్మ భార్య రుక్మిణి, సుమతి ఎంతో స్నేహితులుగా వుండేవారు. కృష్ణశర్మ, రుక్మిణీ దంపతులకు పద్మప్రియ అనే కుమార్తె వుండేది. ఆమె వయస్సు సుమారు ఏడు సంవత్సరాలు. ప్రతిరోజూ వారింట్లో పూలు కోసుకుని, సుమతికి తెచ్చి ఇచ్చేది. అంతేకాక రోజు ఒక గంటయినా వీరింట్లో గడిపి వెళ్ళేది. వేంకటాచారి పెద్ద కుమార్తె శారద పెళ్ళి ఎంతకూ నిశ్చయం కాకపోవటంతో ఆ దంపతులకు ఎంతో



బెంగగా వుండేది. ఒకనాడు కృష్ణశర్మ భార్య రుక్మిణి సుమతితో ఒక వారం రోజులపాటు రుక్మిణీ కళ్యాణం పారాయణ చేయమని చెప్పింది. ఆవిధంగానే శారద పారాయణం చేయగానే ఆ మరునాడే మంచి వరునితో వివాహం నిశ్చయమైంది.

ఇక వివాహానికి కావలసిన సొమ్ము సేకరించి పెట్టుకోవటం అనే పనిలో పడ్డాడు వేంకటాచారి. ఇన్నేళ్ళుగా కంసాలి వృత్తి చేస్తున్నా కూడా కూతుళ్ళకు కనీసం బంగారు గాజులు కూడా చేయించలేకపోయానే అని బాధపడ్డాడు. సుమతి రోజు ఉదయాన్నే పూజ చేసేటప్పుడు శ్రీమహాలక్ష్మిని అనేక స్తోత్రాలతో పూజించేది. వివాహం దగ్గర పడుతున్నదని దయచేసి వివాహానికి కావలసిన సొమ్ము సమయానికి అంది వచ్చేలా అనుగ్రహించమని ఆ తల్లిని ప్రార్థించేది.

రోజులు ఇలా గడుస్తుండగా ఒకనాడు పద్మప్రియ రోజులాగా పూలు తీసుకుని ఉదయం పూజసమయానికి రాలేదు. రోజు తప్పకుండా వచ్చే పిల్ల ఈ రోజు ఇంకా రాలేదేమిటా అని సుమతి ఆలోచిస్తుండగా గుమ్మంలో గజ్జెల చప్పుడయ్యింది. పద్మప్రియ చెంగు చెంగున రానే వచ్చింది. రావటానికి ఆలస్యమైందని చెపుతూ పూలు తీసి సుమతి చేతిలో పెట్టింది. ఆ రోజు పద్మప్రియ రోజుకంటే అందంగా, ఎంతో తేజస్సుతో కనిపించింది. సుమతి పద్మప్రియను ఈ రోజు నీ పుట్టినరోజా? ఇంత చక్కగా అలంకరించుకున్నావు అని అడిగింది. లేదు అత్తయ్యా! రోజులాగానే తయారయ్యాను. స్నానం చెయ్యటం కాస్త ఆలస్యం కావటంతో పూలు తీసుకురావటం ఆలస్యమైంది. అది సరేకానీ, ఈ జత బంగారు గాజులు అమ్మ నీకు చూపించమని చెప్పింది, కొత్తగా కొనుక్కుందట. నిన్ను చూడమని అన్నది.

అప్పుడు సుమతి ఆ గాజులు తన చేతిలోనికి తీసుకుని చూస్తుండగా పద్మప్రియ ఇప్పుడే వస్తాను అని చెంగున బయటకు వెళ్ళింది. సుమతి ఆ గాజులను దేవుడి దగ్గర వుంచింది. కాసేపయిన తరువాత పద్మప్రియ రాగానే ఇచ్చేద్దామని అనుకుంది. వంట ఇంటిలోనికి నైవేద్యం తీసుకురావడానికి వెళ్ళి పాయసం పూర్తవగానే తీసుకువచ్చి

పూజగదిలో కూర్చుంది. ఎదురుగా రెండు జతల బంగారు గాజులు కనపడ్డాయి. ఇవేమిటి? ఇవి ఎక్కడినుంచి వచ్చాయి? తాను ఇక్కడ పెట్టినది ఒక జతే కదా. లేదా నేను పరధ్యానంలో వుండి గమనించలేదా. పద్మప్రియ నా చేతికి రెండు జతలు ఇచ్చిందా అని తలుస్తూ పూజ పూర్తి చేసి దేవునికి నైవేద్యం పెట్టింది. ఈ రెండు జతల గాజులను తీసుకుని రుక్మిణికి ఇవ్వాలని వారింటికి వెళ్లింది.

ఆమెను చూసిన రుక్మిణి ఏమిటి వదినా? చేతిలో ఆ బంగారు గాజులు ఎక్కడివి? పిల్లలిద్దరికీ చేయించావా? అని అడిగింది. ఇది విన్న సుమతి నోట మాట రాలేదు. అదేమిటి వదినా, ఇందాక పద్మప్రియ వచ్చి ఇచ్చింది కదా. నీవు కొనుక్కున్నావని నాకు చూపించమని చెప్పింది కదా అని అన్నది. అప్పుడు రుక్మిణి అదేమిటి వదినా, పద్మప్రియ మీ ఇంటికి రావడమేమిటి, నిన్నటినుంచి పిల్లకి ఒక్కటే జ్వరం, మంచం దిగనే లేదు. ఎక్కడికీ వెళ్ళలేదు. అసలు ఆమె మీ ఇంటికే రానప్పుడు ఈ గాజులు ఎలా తెస్తుంది. అయినా నేను ఈ మధ్య అసలు గాజులే కొనుక్కోలేదు అని అన్నది. ఇది విన్న సుమతికి ఎంతో ఆశ్చర్యం కలిగింది. మరి ఇందాక వచ్చినది ఎవరు, ఆ గాజులు ఇచ్చినది ఎవరు, అని ఆలోచిస్తుండగా ఆ వచ్చినది సాక్షాత్తూ శ్రీ మహాలక్ష్మియే అని తోచింది. ఈ విషయమే రుక్మిణితో అన్నది. వారిద్దరూ ఎంతో ఆశ్చర్యపోయారు. మరెంతో ఆనందపడ్డారు. జరిగిన విషయమంతా వారి భర్తలకు చెప్పారు. వేంకటాచారి దంపతుల సంతోషానికి అంతు లేదు. వచ్చినది సాక్షాత్తూ శ్రీ మహాలక్ష్మియేనని గ్రహించారు. తమను అనుగ్రహించిన ఆ జగన్మాతను ఎన్నో విధాల స్తుతించారు. తమ కుమార్తెలకు సాక్షాత్తూ ఆ శ్రీ మహాలక్ష్మియే బంగారు గాజులను అనుగ్రహించిందని ఎంతో ఆనందపడ్డారు. ఇద్దరూ పూజగదిలోనుంచుని ఆ జగన్మాతను నమస్కరిస్తూ ఇలా అన్నారు. ఓ లోక జననీ, దారిద్ర్య దుఃఖాన్ని, పాపాంధకారాలను పారద్రోలే అమృతమూర్తివి నీవే తల్లీ. దీనులైన వారి బాధలను అన్నింటిని నశింపజేసే నీ కరుణా కటాక్షములు మాపై ప్రసరింపుము తల్లీ! నీకివే మా నమస్కారములు. అమ్మా! మిక్కిలి దయగలిగిన నీ కడగంటి చూపులతో నీ కరుణామృతాన్ని మాపై కురిపించు



తల్లీ. నీవు సర్వ మంగళ ప్రదాయినివి. సకల చరాచర జగత్తుయందు నీవే వ్యాపించి ఉన్నావు తల్లీ! నీకివే మా ప్రణామములు. నిన్ను నమ్మినవారికి సర్వ శుభములనూ అనుగ్రహించే లోకపావనీ! నీకివే మా నమస్కారములు అని పరి పరివిధాల ప్రార్థించారు.

శ్రీ మహాలక్ష్మిని ప్రార్థించినవారికి సర్వసౌభాగ్యాలూ సమకూరుతాయి. ఎటువంటి అనారోగ్యమూ దరిచేరదు. శ్రీ మహాలక్ష్మీ ఆరాధన వలన అణిమా, మహిమా, గరిమా, లఘిమా, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశిత్వము, వశిత్వము అనే అష్ట సిద్ధులు లభిస్తాయి. మానవునికి ఆధ్యాత్మికంగా కూడా ఉన్నత శిఖరాలకు ఎదగడానికి శ్రీ మహాలక్ష్మి అర్చన ఎంతో ఉపయోగపడుతుంది. గత జన్మలలో చేసిన పాపమే దారిద్ర్యంగా పిలవబడుతుంది. ఈ జన్మలో పుణ్యకార్యాలు చేయటంవలన ఇది నశించి, ఐశ్వర్యం లభిస్తుంది. ఓ జగన్మాతా! నీకివే మా నమస్కారములు, ఓ మహాలక్ష్మీ! నీకివే మా ప్రణామములు. ఓ జగజ్జననీ! నీకివే మా నమస్కారములు.

# మూడవ అధ్యాయము

అజ్ఞాన తిమిరం హంతుం
శుద్ధజ్ఞాన ప్రకాశికా
సర్వైశ్వర్య ప్రదానేస్తు
త్వత్కలామయి సంస్థితా
– శ్రీ లక్ష్మీ హృదయం (అధర్వణ వేదం)

ఓ జగన్మాతా! జగజ్జననీ! జీవులందరిలోని అజ్ఞానమనే చీకటిని పారద్రోలే దివ్య కాంతి శక్తివి నీవే. నీవు ఎంతో దివ్య తేజస్సుతో ప్రకాశిస్తూ మమ్ములనందరిని అనుగ్రహిస్తున్నావు. మాయందు దయవుంచి నీలోని శతకోటి సూర్య సమానమైన తేజస్సునుండి ఒక కళను నాయందు ప్రసరింపవలసిందిగా ప్రార్థిస్తున్నాను. తద్వారా సర్వ ఐశ్వర్యాలను ప్రసాదించి నన్ను అనుగ్రహింపుము తల్లీ.

సర్వోన్నతురాలైన శ్రీ మహాలక్ష్మి అత్యంత ప్రధానమైన ఆరు లక్షణాలతో భాసిస్తూ



వుంటుంది. సర్వ లోకాలలోను, సర్వ ప్రదేశాలలోను, సర్వావస్థలయందును, ఇతరులు అందరిచేత ఆ తల్లి ఆశ్రయింపబడి వుంటుంది. జగత్కళ్యాణ చక్రవర్తియైన శ్రీమన్నారాయణులవారిని ఎల్లప్పుడూ ఆశ్రయించి వుంటుంది. ఆ తల్లిని మనసారా కొలిచిన వారికి సర్వ సౌభాగ్యాలూ లభిస్తాయి. జగన్మాతా! నీకు అనేక నమస్కారములు. మాకు కావలసినది జగజ్జనని అయిన నీకు తెలిసినట్టుగా మరెవరికి తెలుస్తుంది తల్లీ! నీవు, ఆ శ్రీమన్నారాయణుడు, ఇద్దరూ మీ అనుగ్రహాన్ని మాపై ప్రసరింప వలసింది తల్లీ! తెలిసీ తెలియక మేము జన్మ జన్మలలో చేసిన పాపాలను క్షమింపవలసింది తల్లీ!

నీ అనుగ్రహం వుంటే ఎన్ని జన్మల పాపాలైనా ఇట్టే పోగలవంటారు. నిన్ను ఆశ్రయించినవారికి దేనికీ లోటుండదని అంటారు. సర్వ ధర్మ స్వరూపిణివైన నీకివే మా నమస్కారములు. మాకు ముందు ముందు ఏకష్టాలూ కలుగకుండా ప్రస్తుతం పడుతున్న కష్టాలన్నీ తొలగిపోయి జీవితం సుఖంగా గడిచేలా అనుగ్రహించు తల్లీ. నీ అనుగ్రహం ఉంటే మనస్సు కూడా నిర్మలంగా వుంటుందని అంటారు. నా మనస్సు ఎల్లవేళలా ప్రశాంతంగా, సంతోషంగా ఎటువంటి దురాలోచనలకు లోనవకుండా ఉండేలా అనుగ్రహించు తల్లీ.

తిరుచానూరులో అర్చామూర్తిగా కొలువై తిరుమల కొండపై ఆనందనిలయంలో శ్రీమన్నారాయణుని హృదయంలో వ్యూహలక్ష్మిగా ప్రకాశిస్తూ భక్తులను రక్షిస్తున్న ఓ జగన్మాతా నీకివే మా నమస్కారములు. సర్వ లోకములను రక్షిస్తున్న ఓ జగజ్జననీ నీకివే మా నమస్కారములు. సర్వాభీష్ట ప్రదాయినివైన ఓ తల్లీ నీకు ఇవే మా నమస్కారములు.

పూర్వకాలంలో ధర్మధ్వజుడు, మాధవి అనే దంపతులకు ఒక శుభ ముహూర్తమున తులసి అనే పుత్రిక జన్మించింది. ఆమె ఎంతో దివ్య తేజస్సుతో వెలిగిపోతూ దినదిన ప్రవర్ధమానంగా పెరగసాగింది. తల్లిదండ్రులు ఆమెను ఎంతో గారాబంగా పెంచి పెద్ద చేశారు. ఆమె తన ఆట పాటలతో వారిని ఎంతో

మురిపించేది. కొంతకాలానికి ఆమెకు యుక్త వయస్సు వచ్చింది. అతిలోక సౌందర్యవతిగా రూపొందిన ఆమెకు తగిన వరుని కోసం ఆ తల్లిదండ్రులు ప్రయత్నించసాగారు. తల్లిదండ్రుల ప్రయత్నం తెలుసుకున్న తులసి తాను సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుని తప్ప వేరొకరిని వివాహం చేసుకోనని తెలిపింది. ఆమెయొక్క ధృఢ సంకల్పానికి ఆ దంపతులిద్దరూ ఆశ్చర్యపోయారు. సాక్షాత్తూ ఆ శ్రీమహా విష్ణువునే వివాహమాడటం అంత తేలిక కాదని ఆమెకు నచ్చచెప్ప చూశారు. కానీ ఆమె ఏ మాత్రం చలించలేదు. తాను తప్పక ఆ స్వామినే పరిణయమాడతానని చెప్పి అడవికి వెళ్ళి ఘోర తపస్సు చేయసాగింది.

అకుంఠిత దీక్షతో తులసి చేస్తున్న ఆ తపస్సుకు ముల్లోకాలు తల్లడిల్లాయి. దేవతలందరూ భయకంపితులైనారు. వారందరూ బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి స్వామీ భూలోకంలో తులసి చేస్తున్న తపస్సు వలన సర్వ లోకాలూ కంపిస్తున్నాయి. తమరు దయ తలచి ఆమె అభీష్టం అడిగి ఆ కోరిక తీర్చి ఆమె తపస్సు విరమించేలా చూడవలసినది అని వేడుకున్నారు.

అప్పుడు బ్రహ్మదేవుడు తులసికి ప్రత్యక్షమై నీకు ఏ వరము కావాలో కోరుకోమని అన్నాడు. తులసి ఆ చతుర్ముఖునితో ఇలా అన్నది. తండ్రీ సర్వ లోకాలను సృష్టించే నీ దర్శనంతో నా జన్మ ధన్యమైంది. నాకు శ్రీమన్నారాయణుడే భర్త అయ్యేలాగా అనుగ్రహింపవలసినది. ఆ శ్రీమహావిష్ణువును తప్ప వేరొకరిని నేను వివాహమాడను. నా యందు దయవుంచి నన్ను కరుణింపవలసినది అని అన్నది. అప్పుడు బ్రహ్మదేవుడు ఆమె కోరిక త్వరలోనే నెరవేరగలదని శ్రీ మహావిష్ణువు అంశతో శంఖచూడుడనే వరుడు జన్మించాడని అతడే తులసిని వివాహమాడగలడని చెప్పి అంతర్ధానమయ్యాడు. బ్రహ్మ వరమిచ్చినట్లుగానే కొన్ని రోజులలోనే తులసి, శంఖచూడుల వివాహం జరిగినది. వారిద్దరూ సుఖంగా జీవింపసాగారు.

శంఖచూడుడు ఎంతో దివ్య తపస్సును ఆచరించి అనేక వరాలను పొంది ఇష్టం వచ్చినట్లు ప్రవర్తింపసాగాడు. అప్పుడు దేవతలందరూ శ్రీమన్నారాయణుల



వారి వద్దకు వెళ్ళి ఆ పరబ్రహ్మమూర్తిని శంఖచూడుని బారినుండి తమను రక్షింపవలసిందిగా ప్రార్థించారు.

అప్పుడు దయామయుడైన స్వామి వారితో ఇలా అన్నాడు. ఓ దేవతలారా! మీ బాధ నాకు అర్థమయ్యింది. శంఖచూడుడు ఎన్నో దివ్య వరాలను సంపాదించి ఈవిధంగా మితిమీరిన గర్వంతో, అహంకారంతో ప్రవర్తిస్తున్నాడు. మిమ్ములనందరిని అనేక బాధలకు గురి చేస్తున్నాడు. అతడు త్వరలోనే తనువు చాలించి నాలో ఐక్యమయ్యే సమయం ఆసన్నమైనది. తులసి ఎవరో కాదు, సాక్షాత్తూ నా ప్రియ సఖియైన శ్రీ మహాలక్ష్మి అంశయే! శాపవశాన భూలోకంలో తులసిగా జన్మించింది. ఆమె ముందు ముందు యుగాలన్నిటిలో అన్ని లోకాలలోను అతిపవిత్రమైన మొక్కగా జన్మించి, అందరిచేత ఆరాధింపబడుతుంది. అనేక యుగాలపాటు ఆవిధంగా ఆరాధింపబడి చివరికి ప్రళయ కాలంలో నన్ను చేరుతుంది. అయితే ప్రస్తుతం శంఖచూడుడు జన్మ చాలించి నాలో ఐక్యమొందాలంటే తులసి పాతివ్రత్యభంగం జరగాలి. అది నేనే త్వరలో నిర్వర్తించగలను. అక్కడితో మీ కష్టాలన్నీ తొలగిపోతాయి అని అన్నాడు. శ్రీమన్నారాయణులవారు ఆవిధంగా చెప్పిన పిమ్మట దేవతలందరూ ధైర్యం తెచ్చుకుని వారి వారి లోకాలకు వెళ్ళిపోయారు.

కొంతకాలానికి ఒకనాడు శంఖచూడుడు ఇంట్లో లేని సమయంలో శ్రీమన్నారాయణులవారు శంఖచూడుని రూపంలో వచ్చాడు. ఆ స్వామిని చూసి తన భర్త శంఖచూడుడే అనుకుని తులసి ఆ స్వామితో కలిసి ఆనందడోలికలలో తేలి ఆడింది. శ్రీ మహావిష్ణువు సంగమంతో తులసి పాతివ్రత్య భంగమయినది. జరిగిన విషయం గ్రహించిన తులసి శ్రీమన్నారాయణులవారిని శిలగా మారమని శపించింది. ఆ శాపం విని శ్రీమన్నారాయణులవారు చిరునవ్వుతో తులసితో ఇలా అన్నారు.

ఓ తులసీ! ఈ సృష్టి ఆదిలోని నా విరాట్ స్వరూపంలో నీవు శ్రీ మహాలక్ష్మియే. శాపవశాన నీవు ఈవిధంగా భూలోకంలో తులసిగా జన్మించావు. నన్ను ఎప్పుడూ విడిచి వుండనని నన్ను తప్ప వేరెవరినీ వివాహమాడనని ప్రతిజ్ఞ చేశావు. అందుకే

నా అంశతో జన్మించిన శంఖచూడుడు నీకు భర్త అయినాడు. ఇక శంఖచూడుడు నాలో ఐక్యమయ్యే సమయం ఆసన్నమయినది. నీవు తులసిగా జన్మించినప్పటికి నా ప్రియసఖివే కనుక నా సంగమంతో నీ పాతివ్రత్య భంగం కలుగలేదు. నీ శాప ప్రభావాన నేను గండకీ నదిలో సాలగ్రామంగా శిలారూపం పొందుతాను. నీవు నన్ను దాచుకునే గండకీ నదివి కాగలవు. నన్ను సాలగ్రామరూపంలో ఎవరైతే అర్చిస్తారో వారికి సర్వ శుభములు కలుగగలవు. సాలగ్రామ ఆరాధన నాకు అత్యంత ప్రీతికరం కాగలదు అని అన్నాడు. అప్పుడు శ్రీమన్నారాయణులవారు చెప్పినట్లుగానే శంఖచూడుడు ఆ స్వామిలో ఐక్యమైనాడు. తులసి మొక్కగా రూపాంతరం చెందింది.

సాక్షాత్తూ శ్రీ మహాలక్ష్మీ అంశమైన తులసిమొక్క ఎంతో మహిమాన్వితమైనది. తులసి ఆరాధనతో సర్వసౌభాగ్యాలూ లభిస్తాయి. సర్వ ఐశ్వర్యాలూ సిద్ధిస్తాయి. ప్రాతఃకాలమున నిద్ర లేచినవెంటనే తులసిమొక్కను దర్శిస్తే ముల్లోకములందలి పుణ్య తీర్థములలో స్నానమాచరించిన ఫలం దక్కుతుంది. ఎవరైతే ఉదయాన్నే తులసిమొక్కకు నమస్కరిస్తారో వారికి సాక్షాత్తూ ఆ లక్ష్మీ నారాయణులకు నమస్కరించిన ఫలం దక్కుతుంది.

యన్మూలే సర్వతీర్థాని యన్మధ్యే సర్వదేవతా

యదగ్రే సర్వవేదాశ్చ తులసీం త్వాం నమామ్యహమ్

తులసియొక్క మొదలు నందు సర్వ తీర్థములు, మధ్య భాగమున సర్వ దేవతలూ అగ్రభాగాన సర్వ వేదాలూ ఉన్నాయని శాస్త్రం చెబుతున్నది. అంతే కాకుండా తులసి యొక్క అగ్రభాగంతో సాక్షాత్తూ బ్రహ్మదేవుడు, మధ్యభాగంలో శ్రీ మహా విష్ణువు, కాండమునందు మహేశ్వరుడు, శాఖలలో అష్ట దిక్పాలకులైన ఇంద్రుడు, వరుణుడు, యముడు, అగ్ని, వాయువు, కుబేరుడు, నిరుతి, ఈశానుడు నివసిస్తారు.

తులసి మహిమ అపారమైనది. తులసిమొక్క వున్న ఇంట్లో సర్వసౌభాగ్యాలూ వుంటాయి. సర్వ ఐశ్వర్యాలు సమకూరుతాయి. తులసి దళాలతో ఎవరైతే రోజూ



శ్రీమన్నారాయణులవారిని పూజిస్తారో వారికి సర్వ పాపములూ తొలగిపోతాయి. తులసి దళాలను రోజూ ఉదయం పూజా సమయంలోనే కోయవలెను. మిగిలిన ఏ వేళలయందునూ తులసీ దళములను తుంచరాదు. తులసీ దళాలను పురుషులు మాత్రమే త్రుంచవలెను. స్త్రీలు కోయరాదు. మంగళ, బుధ, శుక్రవారాలలో తులసిని త్రుంచరాదు. అమావాస్య, పౌర్ణమి తిథులయందును, గ్రహణ సమయమునందు, సంక్రమణ సమయములయందు తులసి పత్రములు కోయరాదు. తులసిని స్త్రీలు తలలో ధరించరాదు. అతి పవిత్రమైన తులసి సాక్షాత్తూ శ్రీ మహాలక్ష్మి అవతారం కనుక తులసి దళాలను శ్రీమన్నారాయణులవారి పాదాలవద్దనే వుంచాలి కానీ, తలపై పెట్టకూడదు. తులసికి ప్రతిరోజూ నమస్కరించుట వలన సంతాన ప్రాప్తి, రోగ నివారణ, దాస్య విముక్తి సంఘంలో గౌరవం కలుగుతాయి.

తులసి, బృంద, బృందావని, విశ్వపూజిత, విశ్వపావని, పుష్పసార, నందిని తులసి, కృష్ణసేవిత, అనే తులసి నామాష్టకాన్ని నిత్యం పఠించినవారికి అశ్వమేధయాగ చేసిన పుణ్యం లభిస్తుంది. ఉదయం లేవగానే శ్రీమన్నారాయణులవారిని, తులసిని ఎవరు స్మరిస్తారో వారికి సర్వ సంపదలూ లభిస్తాయి. ఎన్నో జన్మల పాపాలు నశిస్తాయి. సర్వ సౌభాగ్యాలూ కలుగుతాయి. ఎటువంటి ఆపద దరిచేరదు. రోజంతా అన్ని పనులలో విజయం చేకూరుతుంది.

నమస్తులసి కళ్యాణి నమో విష్ణుప్రియే శుభే

నమో మోక్ష ప్రదే దేవి నమస్తే మంగళ ప్రదే !

సమస్త సౌభాగ్యాలనూ ప్రసాదించే తులసిమాత! నీకివే మా నమస్కారములు. ఓ విష్ణుప్రియా! నీకివే మా ప్రణామములు. సమస్త ఐశ్వర్యాలను ప్రసాదించే తులసిమాతా! నీకివే మా నమస్కారములు. ఎటువంటి ఆపదలూ కలుగకుండా రక్షించే శ్రీ లక్ష్మీ స్వరూపిణీ! నీకివే మా నమస్కారములు.

అమ్మా జగజ్జననీ! శ్రీ మహాలక్ష్మీ! లోక పావనీ! పాలసముద్రము మధ్యలో గల

కమలవనములందు దివ్యమైన మణులతో అలంకరింపబడిన మండప మధ్యభాగమున జ్ఞానులచేత సేవింపబడుతున్న తల్లీ నీకివే మా నమస్కారములు. చక్కగా స్నానమాచరించిన శిరోజములు, పూల పరిమళములు వెదజల్లుతుండగా నిండు చంద్రబింబం వంటి ముఖముతో, దివ్య తేజస్సుతో ప్రకాశిస్తూ భక్తులను అలరారిస్తున్న ఓ జగన్మాతా! నీకివే మా నమస్కారములు.

శ్రీ మహాలక్ష్మి ధనానికి సంకేతం, ధనం అంటే సొమ్ము మాత్రమే కాదని గ్రహించాలి. ధైర్యం, శౌర్యం, విద్య, జ్ఞానం, వివేకం, మొదలైనవన్నీ ఐశ్వర్యాలే. శ్రీ మహాలక్ష్మి విభూతి స్వరూపిణి. విభూతి అనగా ఐశ్వర్యం. అలాగే ఆ మహాతల్లి అత్యంత దయామయురాలు. మహోన్నతమైన ఓర్పు గలది. అందువలననే భూదేవి అంశలో ఈ జగత్తు మొత్తాన్ని భరిస్తున్నది. ఈ సృష్టిలో అత్యంత ఓర్పు, సహనం, శాంతం శ్రీ మహాలక్ష్మికి మాత్రమే చెందుతాయి.

ఈ సృష్టిలోని సర్వ ప్రాణకోటికి పోషణ శక్తిని ఇచ్చుచున్నది ఆ జగన్మాతయే. సమస్త సంపదలకూ మూలకారకురాలైన ఆ జగన్మాత ఈ సృష్టిలో సర్వ మంగళ స్వరూపిణి. ధర్మం, సత్యం పరబ్రహ్మ యొక్క అనంత శక్తులన్నీ ఆ తల్లియందు వున్నవి. అందుకే ఆ తల్లిని నారాయణి అని అంటారు. నారాయణి అంటే సర్వ శక్తులకూ ప్రతీక అని అర్థం.

స్త్రీలకు ఆ జగన్మాత శ్రీ మహాలక్ష్మి సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుంది. వాక్కు, బుద్ధి, జ్ఞాన , చైతన్య శక్తిస్వరూపిణి సరస్వతి, ఐశ్వర్య, పోషణ, శక్తి స్వరూపిణి శ్రీ మహాలక్ష్మి. విజ్ఞాన, క్రియాశక్తి దుర్గ. వాత్సల్య, ప్రేమ, అనురాగ శక్తి రాధ. శక్తిస్వరూపులైన లక్ష్మి, సరస్వతి, దుర్గ, గాయత్రి, రాధలలో ఎవరిని ఉపాసించినా ఆ జగన్మాత వారియందు కరుణించి తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తుంది.

ధర్మంతో జీవితం గడిపేవారింట శ్రీ మహాలక్ష్మి వుంటుంది. సమస్త జీవకోటియందు కరుణ చూపేవారి ఇంట శ్రీ మహాలక్ష్మి చిరునవ్వుతో నివసిస్తుంది.



తల్లితండ్రులను ప్రేమతో చూసే వారి ఇంట శ్రీ మహాలక్ష్మి ఎల్లప్పుడూ ఐశ్వర్యం కురిపిస్తూ వుంటుంది. ఎటువంటి దుర్భాషలాడకుండా పరుషపదాలతో ఎదుటివారిని నిందించకుండా అత్యంత సౌశీల్యంతో వుండే వారింట ఆ జగన్మాత ఎంతో ఆనందంతో నివసిస్తుంది. గోవులు, గోశాలలు, ఫల పుష్ప గుచ్ఛాలు, సువాసన ద్రవ్యాలు, సమస్త శుభప్రదమైన, మంగళ ప్రదమైన వస్తువులందు ఆ శ్రీ మహాలక్ష్మి చిరునవ్వుతో ప్రకాశిస్తుంది. ఎల్లవేళలా తన ప్రియవల్లభుడు శ్రీమన్నారాయణులవారిని స్మరించేవారింట శ్రీ మహాలక్ష్మి ఎంతో ఆనందంగా నివసిస్తుంది.

శ్రీ మహాలక్ష్మి సత్వ గుణంతో లక్ష్మిగాను, రజోగుణంతో కృష్ణగాను, తమోగుణంతో బ్రాహ్మిగాను, ఆయా సందర్భాలలో జన్మించింది. అంతేకాక ఆ జగన్మాత శ్రీ మహాలక్ష్మి, శ్రీ కామేశ్వరి, కాంతి, ప్రియ, శక్తి, విభూతీ, ఇచ్ఛా, ప్రీతి, రతి, మాయ, ధీ, మరియు మహిమా అనే పన్నెండు అవతారాలలో ఆవిర్భవించిందని లక్ష్మీ తంత్రం అనే గ్రంథం పేర్కొన్నది.

ప్రతి దినము ఎవరైతే గోవును పూజిస్తారో, వారింట శ్రీ మహాలక్ష్మి నివసిస్తుంది. గోవు పేడను కరీషిణి అంటారు. అంటే లక్ష్మి అని అర్థం. గోవుయొక్క ఉదరంలో భూదేవి వుండటం వలన గోప్రదక్షిణ చేస్తే ఈ భూప్రదక్షిణచేసిన పుణ్యం వస్తుంది. పూర్వకాలంలో ఒకనాడు గోలోకంలో విహరిస్తున్న శ్రీ మహావిష్ణువుల వారికి బృందావనంలో సంచరించాలనే కోరిక కలిగింది. వెంటనే ఆ స్వామి బృందావనం చేరుకుని అక్కడి అంద చందాలకు ముగ్ధుడై ఆడుతూ తిరిగాడు. కాసేపటికి అలసిపోయాడు. అప్పుడు శ్రీమన్నారాయణుని సంకల్పంతో స్వామి ఎడమచేతినుండి అందమైన ఆవు, ముచ్చటైన దూడ ఆవిర్భవించాయి. ఆ గోవుకు సురభి అనే నామకరణం చేశాడు. అప్పుడు శ్రీమన్నారాయణులవారు సురభి పాలను త్రాగారు. ఎంతో కమ్మగా అనిపించడంతో సురభిని ప్రేమతో నిమిరాడు. అప్పుడు ఆ సురభి రోమ కూపాలనుండి కోటానుకోట్ల గోసంపద ఉద్భవించింది. శ్రీమన్నారాయణుడు సురభిని భక్తితో పూజించాడు. సాక్షాత్తూ ఆ పరబ్రహ్మమూర్తియే పూజించిన గోవు

ఎంతో పవిత్రమైనది. గణేశ, గోవు, గంగ, గోవిందుడు, గీత, గాయత్రి అనే సప్త పవిత్రములు, 'గ' అనే అక్షరంతో ప్రారంభమవుతాయి. వీటిలో ఒక్క గోవుకు నమస్కరించిన మాత్రముననే మిగిలిన ఆరుగురికి కూడా పూజ చేసిన ఫలం దక్కుతుందని పద్మపురాణం చెప్తున్నది.

శ్రీ మహాలక్ష్మిని నమ్మి కొలచేవారు ఆ తల్లి ఎల్లవేళలా రక్షిస్తుంది. జీవితంలో దేనికీ లోటు లేకుండా సుఖప్రదంగా జరుగుతుంది. ఏ అవసరం కలిగినా, సమయానికి సొమ్ము చేతికి వచ్చేలా ఆ తల్లి అనుగ్రహిస్తుంది. మమ్ములనందరినీ నీ సంతానంగా భావిస్తూ, ఎల్లప్పుడూ మాకు ఎటువంటి కష్టాలూ లేకుండా కాపాడే నీవుండగా మాకింక చింతలేల తల్లి. ఓ జగన్మాతా! నీకివే మా నమస్కారములు. ఓ జగజ్జననీ నీకివే మా ప్రణామములు. ఓ విష్ణుప్రియా! నీకివే మా నమస్కారములు.

శ్రీ మహాలక్ష్మీ వైశిష్ట్యాన్ని 'శ్రీ' అనే అక్షరం తెలియపరుస్తుంది. శ్రీ అంటే సంపద, భూమి, భాగ్యం, జయం, జ్ఞానం, తేజస్సు అనే అర్థాలు ఉన్నాయి. శ్రీతో మొదలుపెట్టే ఏ పదానికైనా ఎంతో శక్తి వస్తుంది. శ్రీ ముందు చేర్చే సరికి ఆ పదం శుభప్రదంగా మారుతుంది. శ, ర, ఈ, అనే మూడు అక్షరాల స్వరూపమే ఎంతో దివ్యమైన శ్రీ అక్షరం. శ అంటే శుభప్రదం అని అర్థం. ర అక్షరం తేజస్సుకు ప్రతీక. ఇ అక్షరం శక్తిని సూచిస్తుంది. జ్ఞానానందస్వరూపమై శక్తియుతమైన బ్రహ్మమే శ్రీ అక్షరం. ఆశ్రితులను గుణములలో వృద్ధి పరచి, వారి దోషములను నశింపచేసి వారి ప్రార్థనలను తాను తెలుసుకుని వీటినన్నింటిని తన ప్రియవల్లభుడైన శ్రీమన్నారాయణులవారికి వినిపించి వారిపై ఆ పరబ్రహ్మమూర్తి సర్వ భాగ్యాలను అనుగ్రహించేలా చేసే శక్తి ఆ జగన్మాత శ్రీ మహాలక్ష్మికి మాత్రమే కలదు. అందుకే ఆ తల్లిని శరణు వేడితే సర్వసౌభాగ్యాలూ చేకూరుతాయి. సర్వ సంపదలూ కలుగుతాయి. సంపూర్ణ ఆరోగ్యం ఒనగూరుతుంది.

శ్రీ లక్ష్మీనారాయణుల అన్యోన్యత వర్ణింపనలవి కానిది. ఒకరిపై నొకరికి పంచప్రాణాలు. ఆ జగన్మాత ఏ విషయానికీ నొచ్చుకోకుండా, ఏ మాత్రం



కష్టపడకుండా వుండేలా శ్రీ మన్నారాయణులవారు తన ప్రియసఖిని ఎప్పుడూ కనిపెట్టుకుని వుంటాడు. ఆ తల్లి భక్తులకు ఎటువంటి కష్టం కలగకుండా శ్రీ మన్నారాయణుడు ఎల్లప్పుడు కాపాడుతూ వుంటాడు. ఆ జగన్మాత కూడా స్వామి హృదయంలోనే నివసిస్తూ ఆ పరబ్రహ్మ మూర్తిని వెన్నంటే వుంటుంది. తన నాథునికి ఎల్లవేళలా సపర్యలు చేస్తూ స్వామితోనే ఉంటుంది. వారి అన్యోన్యత లోకానికే ఆదర్శం. శ్రీమన్నారాయణుడు తనను ఉపేక్షించినా సహిస్తాడు కాని, తన ముద్దుల సఖి శ్రీమహాలక్ష్మిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా సహించడు. ఆ తల్లికి అపచారం చేసినవారు ఎంతటివారినైనా ఉపేక్షించడు. శ్రీ లక్ష్మీనారాయణులను నిత్యం తలచేవారికి సర్వ సౌభాగ్యాలూ లభిస్తాయి. ఎటువంటి ఆపదా దరి చేరదు. సర్వ ఐశ్వర్యాలూ లభిస్తాయి.

అన్ని అవతారముల యందును శ్రీ మహాలక్ష్మి శ్రీమన్నారాయణులవారిని ఆశ్రయించి వున్నది. మత్స్యావతారమున దృష్టియందును, కూర్మావతారమున వీపునందును, వరాహ, నారసింహ, బౌద్ధ అవతారములందు వక్షస్థలమందును, పరశురామావతారమున గండ్రగొడ్డలియందును ఆశ్రయించి యున్నది. రామావతారమున సీతగాను, కృష్ణావతారమున రుక్మిణిగాను, బలరామావతారమున రేవతిగాను, శ్రీమన్నారాయణులవారిని అనుసరించి వున్నది జగన్మాత శ్రీ మహాలక్ష్మియే. వామనావతారమున శ్రీ మహాలక్ష్మి ఆ వామనుడు ధరించిన కృష్ణాజినమునందు ఆశ్రయించి యున్నది. సూర్యనారాయణ అవతారమున ఆ తల్లి పద్మ అనే రూపంలో అనుసరించి ఉన్నది.

భూలోకంలోని ప్రతీ ఇంట గృహిణిలు అయిన పుణ్యస్త్రీల రూపంలోను, యజమానులకు సంపద రూపంలోను, గృహములోని మనోహరమైన మంగళ కరమైన, శుభకరమైన వస్తువులయందును ప్రకాశిస్తూ మమ్ములను అందరినీ అనుగ్రహిస్తున్న ఓ జగన్మాత! నీకివే మా నమస్కారములు. ఓ జగజ్జననీ! నీకివే ప్రణామములు. ఓ విష్ణుప్రియా! నీకివే మా నమస్కారములు.

# నాలుగవ అధ్యాయము

పరబ్రహ్మమూర్తి శ్రీమన్నారాయణులవారి అనుగ్రహంతో నాలుగు వేదాలు ఉద్భవించాయి. ఆ వేదాలనుండే పంచసూక్తాలు జనించాయి. విష్ణు సూక్తానికి ఆకాశతత్వం, పురుష సూక్తానికి వాయుతత్వం, శ్రీ సూక్తానికి అగ్నితత్వం, భూ సూక్తానికి భూతత్వం, నీళా సూక్తానికి జలతత్వం చిహ్నములు. శ్రీ సూక్తమును అగ్నిసూక్తం అని కూడా అంటారు. 'హిరణ్యవర్ణాం' అంటే కాల్చిన బంగారం వంటి పసుపు, ఎరుపు రంగుల మిశ్రమం అని అర్థం. సూర్యకిరణాల వన్నె కలది. శ్రీ అంటే అగ్ని స్వరూపం అని అర్థం. ఆ శ్రీలక్ష్మియే ప్రకృతి మొత్తం వ్యాపించి, తన తేజస్సుతో ప్రకాశింపచేస్తున్నది. ఆ తల్లియే పద్మాలయగా పద్మహస్తగా, పద్మాక్షిగా, పద్మసంభవిగా, పద్మప్రియగా, పద్మినిగా, భగవతిగా, భార్గవిగా, సర్వమంగళ స్వరూపిణిగా భాసిస్తున్నది.



పూర్వకాలంలో అవంతీనగరంలో సుబ్బిశెట్టి అనే వర్తకుడు ఉండేవాడు. స్వతహాగా లోభత్వం కలిగిన సుబ్బిశెట్టి ఎవరికీ ఏ సహాయం చేసేవాడుకాదు. వారు ఎంతటి ఆప్తులైనా వారెంతటి కష్టంలో వున్నా ఏ మాత్రం ధన సహాయం చేసేవాడు కాదు. అతని లోభత్వాన్ని చూసి అందరూ అతనిని ఈసడించుకునేవారు. ఆ ఊరి దేవాలయంలో ఉత్సవాలు జరిగినప్పుడు వర్తకులందరూ ఎంతో సొమ్ము దానంగా ఇచ్చేవారు. కానీ సుబ్బిశెట్టి మాత్రం చాలా కొద్దిసొమ్ము మాత్రమే అది కూడా వారిని విసుక్కుంటూ ఇచ్చేవాడు. అతని లోభత్వం భార్యా, వారికి గల ఇద్దరు కుమార్తెలకు కూడా బాధ కలిగించేది. కొంతకాలానికి వారి కుమార్తెలకు వివాహాలు జరిగి వారి దారిన వారు వెళ్ళిపోయారు. వయస్సు మీద పడుతున్నది కదా, ఇక తీర్థయాత్రలకు తీసుకువెళ్ళమని భార్య సుమతి సుబ్బిశెట్టిని ఎంతో ప్రాధేయపడేది. అది అంతా చాలా వ్యయప్రయాసలతో కూడిన పని, ఇక్కడనుంచే నమస్కరిస్తే సరిపోతుంది అని భార్యను కసురుకునేవాడు.

రోజులు ఇలా గడుస్తుండగా భార్య సుమతికి ఏదో తెలియని వింత రోగం వచ్చింది. పగలంతా చక్కగా వుండే మనిషి, సాయంత్రం కాగానే విపరీతమైన కాళ్ళ నొప్పులు వచ్చి కదలలేక పోయేది. బాధతో విల విలలాడేది. భార్య ఇంత బాధపడుతున్నా సుబ్బిశెట్టి మాత్రం ఆమెను ఏ వైద్యుడి వద్దకు తీసుకువెళ్ళలేదు. మందులకు చాలా వ్యయం అవుతుందని ఆమెను కసురుకునేవాడు. రోజు రోజుకు సుమతి బాధ ఎక్కువ కాసాగింది. ఇదివరకు సాయంత్రానికి వచ్చే కాళ్ళనొప్పులు ఇప్పుడు మధ్యాహ్న సమయానికే రాసాగాయి. అంతేకాక చేతులు కూడా విపరీతంగా నొప్పి చేయసాగాయి. ఏ వస్తువూ ఇటు తీసి అటు పెట్టే ఓపిక లేకపోయింది. భార్య ఇంత బాధపడుతున్నా సుబ్బిశెట్టి తనకు ఏమీ పట్టనట్టు ఉండేవాడు. వైద్యుని వద్దకు తీసుకువెళ్ళేవాడు కాదు. తల్లికి ఈవిధంగా వున్నదని కనీసం కుమార్తెలకు కబురు కూడా చేయలేదు. చెబితే వారందరు కుటుంబాలతో సహా వచ్చి ఇంట్లో తిష్ట వేస్తారని, దానివలన ఎంతో సొమ్ము వ్యయం అవుతుందని భార్య సుమతిని ఈసడించుకునేవాడు.

ఏ మందులూ వాడకపోవటంచేత సుమతి ఆరోగ్యం నానాటికీ క్షీణింపసాగింది. మంచం మీదనుంచి కదిలే ఓపిక కూడా నశించింది. చూపు మందగించింది. ఆవిధంగా ఎన్నో బాధలు పడి, చివరికి ఒకనాడు మరణించింది. ఈ కబురు వూరివాళ్ల ద్వారా తెలుసుకున్న కుమార్తెలు హుటాహుటిన వచ్చారు. తండ్రి పిసినారితనం వలన తల్లికి సరిగా వైద్యం కూడా చేయించలేదని తెలుసుకుని ఎంతో బాధ పడ్డారు. తండ్రిని ఎంతో ఈసడించుకున్నారు. భార్య చనిపోవటంతో సుబ్బిశెట్టిలో కొంతమార్పు వచ్చింది. చేసిన పాపాల వలన వ్యాపారం బాగా దెబ్బ తింది. కానీ లోభత్వం మాత్రం ఏమాత్రం తగ్గలేదు.

కొన్ని నెలలు వ్యాపారం సరిగా లేక చాలా నష్టం వచ్చి, చివరకు ఉన్న ఇల్లు కూడా అమ్మవలసి వచ్చింది. ఊరివారెవరూ ఎటువంటి సహాయం చేయడానికి ముందుకు రాలేదు. చివరికి తినడానికి లేక, పూట గడవక చాలా కష్టాలు పడ్డాడు. ఎంతో దర్జాగా బతికిన ఆ వూరిలో ఇక వుండలేనని తలచి ఒకనాడు అర్ధరాత్రి వూరు విడిచి బయలుదేరాడు. ఒంట్లో ఏమాత్రం ఓపిక లేదు. అయినా అలాగే చేతికర్ర సహాయంతో అడవిదారి బట్టి వెళ్లాడు. ఉదయానికి మరో ఊరు చేరాడు. అక్కడ రెండు రోజులు వుండి ఆ ఊరివారు కూడా తనను గుర్తించటం చేత అవమాన భారం భరించలేక అక్కడనుండి ఒకనాడు అర్ధరాత్రి ఊరు విడిచి బయలుదేరాడు.

కొంతదూరం వెళ్ళగానే అడవి వచ్చింది. అంతా చీకటిగా వుంది. సరిగా తిండి కూడా లేకపోవటం చేత నడక కూడా సరిగా రావటం లేదు. ఇంతలో ఒక్కసారిగా ఎదురుగా ఎలుగుబంటి కనిపించింది. సుబ్బిశెట్టి పై ప్రాణాలు పైనే పోయాయి. ఎలుగబంటి భీకరంగా అరుస్తూ సుబ్బిశెట్టిపై దూకబోయింది. ఒక్కసారిగా జరిగిన ఈ పరిణామానికి సుబ్బిశెట్టి ఒళ్ళు జలదరించింది. ప్రాణాలు అరచేత పట్టుకుని పరుగు లంఘించుకున్నాడు. కాళ్ళకి ముళ్ళు గుచ్చుకుంటున్నా లెక్కచేయక ఒంట్లో లేని ఓపిక తెచ్చుకుని పరిగెత్తసాగాడు. ఎలుగుబంటి కూడా భీకరంగా అరుస్తూ అతని వెనుకనే రాసాగింది. ఇలా కొంతదూరం వెళ్లిన తరువాత సుబ్బిశెట్టికి ఒక పాడు పడిన భవనం కనిపించింది. ఒక్కసారిగా లోపలికి పరిగెత్తి ఏమాత్రం శబ్దం చేయకుండా దాక్కున్నాడు. లోపలంతా కటిక చీకటిగా వున్నది. అయినా కిక్కురుమనకుండా దాక్కున్నాడు. ఎలుగుబంటి కాసేపు చుట్టుపక్కల తిరిగి తన దారిన తాను వెళ్ళిపోయింది.



ఆ చీకట్లో సుబ్బిశెట్టి దాక్కున్నది ఒక పురాతన ఆలయం. ఇంతకు మునుపు ఎలుగుబంటి భయంచేత ఇక వేరే భయం తోచలేదు. కానీ ఇప్పుడు ఈ కటిక చీకటిలో కూర్చోవాలంటే సుబ్బిశెట్టికి విపరీతమైన భయం వేసింది. నెమ్మదిగా అటు ఇటు తడుముతూ రెండు చెకుముకి రాళ్ళు సంపాదించి వాటితో కొంత వెలుగు రాగానే ఎదురుగా చూసిన దృశ్యానికి అతడికి ఆశ్చర్యం వేసింది. ఆ వెలుగులో శ్రీ మహాలక్ష్మీ విగ్రహం కనిపించింది. తాను వున్నది మహాలక్ష్మీ ఆలయం అని అర్థమైంది. పాడుబడి ఎవరూ పట్టించుకొనక శిథిలావస్థలో వున్నదని గమనించాడు. ఎంతో బూజు పట్టి వున్నది. చీకటిగా వుండటంచేత అమ్మవారి విగ్రహాన్ని చూసి భయపడ్డాడు. నిత్య ధూప, దీప నైవేద్యాలు లేకపోవటం వలన విగ్రహం చూపరులను భయపెట్టేలా వున్నది. ఏవిధంగానైనా ఇక్కడ దీపం వెలిగించుకోకపోతే తాను వుండేలా అనిపించలేదు, అలాగని బయటకు వెళదామంటే ఎలుగుబంటి భయం. అటు, ఇటు చూసిన సుబ్బిశెట్టికి అదృష్టం కొద్దీ ఒక పాత నూనె సీసా కనబడింది. దానిని తీసి పక్కనే వున్న ఒక పాత గుడ్డతో దీపం వలె వెలిగించాడు. హమ్మయ్య అనుకున్నాడు ఆ కాంతివలన సుబ్బిశెట్టికి కొంత ధైర్యం వచ్చింది.

పరుగెత్తి అలిసి వుండటం వలన గోడకు ఆనుకుని కూర్చుని వున్న సుబ్బిశెట్టికి వెంటనే గాఢ నిద్ర పట్టింది. నిద్రలో సుబ్బిశెట్టికి కలలో శ్రీ మహాలక్ష్మీ దర్శనం ఇచ్చింది. ఆ తల్లి సుబ్బిశెట్టితో ఇలా అన్నది. ఓయీ! నీవు జీవితంలో ఎన్నో పాపాలు చేశావు. మితిమీరిన లోభత్వంతో చివరకు కట్టుకున్న భార్యను కూడా పోగొట్టుకున్నావు. ఎవరికీ గుప్పెడు బియ్యం కూడా దానం చేయలేదు. కానీ ఈరోజు నీవు నా దేవాలయంలో దీపం వెలిగించటంతో నీ పాపాలన్నీ నశించాయి. ఎన్నో సంవత్సరాలుగా ఈ దేవాలయం ఎవరూ పట్టించుకోలేదు. ఇన్నాళ్ళ తరువాత నీవు ఇక్కడ దీపం వెలిగించటంతో నిన్ను నేను అనుగ్రహించాను. ఈ పుణ్యకార్యంతో

నీ పాపాలన్నీ తీరిపోయాయి. ఇవిగో ఈ బంగారు నాణేలు తీసుకో. వీటితో ఇకముందు సంతోషంగా ధర్మపథంలో జీవిస్తూ కాలం గడపవలసింది అని అన్నది.

తెల్లవారగానే సుబ్బిశెట్టికి మెలకువ వచ్చింది. ఒక్కసారిగా ఆ రాత్రి తనకు వచ్చిన కల గుర్తుకు వచ్చింది. ఆ తల్లి కలలో దర్శనం ఇచ్చినందుకు ఎంతో ఆనందం కలిగింది. సుబ్బిశెట్టి తాను చేసిన తప్పులకు ఎంతో పశ్చాత్తాప పడ్డాడు. తన భార్యను చేజేతులా పోగొట్టుకున్నందుకు ఎంతో బాధ పడ్డాడు. ఇలా పశ్చాత్తాపపడుతుండగా ఎదురుగా ఒక పళ్ళెంలో బంగారు నాణేలు కనబడ్డాయి. తనకు వచ్చిన కల నిజమేనన్నమాట. ఆహా తన భాగ్యమేమని చెప్పుదును. శ్రీమహాలక్ష్మి తనను అనుగ్రహించిందని గ్రహించి ఆ నాణేలను కనులకద్దుకుని తీసుకుని మరునాడే తన ఊరికి బయలుదేరి వెళ్ళాడు. కొంత సొమ్ముతో మళ్ళీ వ్యాపారం మొదలుపెట్టి కొద్ది కాలంలోనే ఎన్నో లాభాలు గడించాడు. తనను అనుగ్రహించిన ఆ శ్రీమహాలక్ష్మి ఆలయాన్ని ఎంతో అద్భుతంగా పునర్నిర్మించాడు. శ్రీ మహాలక్ష్మికి ఎన్నో దివ్యమైన ఆభరణాలు చేయించాడు. నిత్యపూజలకు, ధూప దీప నైవేద్యాలకు కొంత సొమ్ము కేటాయించి ఆచార్యులను నియోగించాడు. బ్రతికినంతకాలం తోటివారికి సహాయపడుతూ దాన ధర్మాలు చేస్తూ జీవించి చివరన ముక్తిని పొందాడు.

శ్రీ లక్ష్మీ నారాయణుల అన్యోన్యత వర్ణింపనలవి కానిది. ఒకరిపై ఒకరికి పంచప్రాణాలు. ఆ జగన్మాత ఏ విషయానికీ నొచ్చు కోకుండా, ఏమాత్రం కష్టపడకుండా ఉండేలా శ్రీమన్నారాయణుడు ఆ తల్లిని ఎప్పుడూ కనిపెట్టుకునే ఉంటాడు. ఆ జగన్మాత కూడా స్వామి హృదయంలోనే నివసిస్తూ ఎప్పుడూ స్వామిని వెన్నంటే ఉంటుంది. తన నాథుడికి ఎల్లవేళలా సపర్యలు చేస్తూ స్వామితోనే ఉంటుంది. వారి అన్యోన్యత లోకానికే ఆదర్శం.

పూర్వకాలంలో త్రిలింగ దేశంలో కృష్ణవర్మ అనే మహారాజు వుండేవాడు. కృష్ణవర్మ భార్య సుకన్యాదేవి ఎంతో సాత్వికురాలు. ఇద్దరూ పరమ విష్ణు భక్తులు.



కృష్ణవర్మ దేశాన్ని ప్రజారంజకంగా పాలిస్తూ ప్రజల సంక్షేమమే తన సంక్షేమంగా భావించేవాడు. ప్రతీ రెండు సంవత్సరాలకొకసారి తిరుమల యాత్ర చేసి కొండపై శ్రీనివాసుని దర్శించి, అటు తరువాత తిరుచానూరు అలివేలు మంగమ్మను దర్శించుకునేవాడు. మందీ, మార్బలం వెంట రాగా ఆ యాత్ర నెలరోజుల పాటు సాగేది.

ఇలా జరుగుతుండగా ఆ సంవత్సరం కూడా కృష్ణవర్మ ఎంతో వైభవంగా బయలుదేరి తిరుమల చేరాడు. ఆనంద నిలయంలో స్వామిని దర్శించి కొండపై నాలుగు రోజులు వున్నాడు. ఇక కొండ దిగి తిరుచానూరు వెళ్ళి అలివేలుమంగమ్మను దర్శించుకోవలసి వుండగా తన పొరుగు రాజు ఒకవారం రోజులపాటు తన దేశంలో అతిథిగా గడపటానికి వస్తున్నాడని భటుల ద్వారా వర్తమానం అందింది. అందిన వెంటనే బయలుదేరడానికి సన్నద్ధమై తిరుచానూరు అమ్మవారిని మరోమారు దర్శించుకొనవచ్చని తలచాడు.

ఈ విషయం తెలుసుకున్న భార్య సుకన్యాదేవి మహారాజుతో ఇలా అన్నది. 'ఓ మహారాజా! ఆ జగన్మాత అనుగ్రహంతోనే మనం ఇలా సంతోషంగా వుండగలుగుతున్నాము. ఆమె అనుగ్రహం వలననే మనకు సర్వసౌభాగ్యాలూ, సర్వ ఐశ్వర్యాలూ లభించాయి. ఎలాగైనా ఆ తల్లిని దర్శించుకుని వెళదాము' అన్నది. అందుకు మహారాజు 'సుకన్యా నీ మనస్సు నేనెరుగుదును. కానీ అవతల పొరుగురాజు వచ్చేటప్పటికి మనం నగరంలో లేకపోతే బాగుండదు. మనం వెంటనే వెళ్ళాలి' అని అన్నాడు. అంతటితో ఆగక చిరునవ్వు నవ్వుతూ ఆ జగన్మాత మన ఇంట వుండనే వున్నదిగా అని అన్నాడు. ఆ మాటలు అసంకల్పితంగా అన్నవే అయినప్పటికి ఆనందనిలయంలోని శ్రీనివాసునికి ఆగ్రహం కలిగింది.

మహారాజు చెప్పిన మాట కాదనలేక ఎదురుచెప్పే ధైర్యం లేక సుకన్య మరి మాట్లాడలేదు. వెంటనే తిరిగి బయలుదేరి నగరం చేరుకున్నారు. తన ప్రియసఖియైన శ్రీదేవిని ఉపేక్షించినందుకు కృష్ణవర్మపై శ్రీమన్నారాయణులవారికి ఎంతో ఆగ్రహం

కలిగింది. ఆ ఆగ్రహం ఫలితంగా మహారాజు సర్వ ఐశ్వర్యాలను కోల్పోయాడు. కొందరు పొరుగు రాజులు దండెత్తి త్రిలింగదేశాన్ని ఆక్రమించుకున్నారు. కృష్ణవర్మ భార్యతో సహా తప్పించుకుని అడవులలోకి పారిపోయాడు. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన ఆ రాజ దంపతులు అడవులలో కందమూలాలను భుజిస్తూ చాలా దీనస్థితిలో జీవితం గడపసాగారు. ఈ విధంగా ఎందుకు జరిగిందో వారికి అర్థం కాలేదు.

ఒకనాడు వారికి ఒక మునీశ్వరుడు ఎదురు పడ్డాడు. అప్పుడు ఆ దంపతులు ఆ మునీశ్వరునికి తమ దీన పరిస్థితిని వివరించారు. ఈ కష్టాలనుండి బయటపడే మార్గం అనుగ్రహించవలసిందని ప్రార్థించారు.

అప్పుడా మునీశ్వరుడు కనులు మూసుకుని ఆ దంపతులతో ఇలా అన్నాడు. మహారాజా! మీరు ఒకనాడు అనాలోచితంగా అన్నమాటే మిమ్ములను, మీ భార్యను, ఈ స్థితికి తీసుకువచ్చింది. ఆ రోజు మీరు తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారిని దర్శించకుండా వెను తిరిగారు. అంతేకాక ఆ తల్లి మా ఇంటనే వుండగా ఇక ప్రత్యేకంగా కొలిచేదేమున్నది అన్న భావన వచ్చేలా మీరు అన్నారు. ఈ మాటలకు ఆమె ప్రియవల్లభుడైన శ్రీమన్నారాయణులవారికి ఆగ్రహం కలిగింది. తన ప్రియసఖిని నిర్లక్ష్యం చేసినందుకు మీపై ఆగ్రహం కలిగింది. అందువలననే మీరు సర్వం కోల్పోయి ఈ పరిస్థితికి వచ్చారు. మీకు తిరిగి మంచి రోజులు రావాలంటే ఒకే ఒక మార్గం వున్నది. అదేమిటంటే మీరు తిరుచానూరు వెళ్లి నలభై రోజులపాటు ఆ జగన్మాతను సేవిస్తూ అక్కడే గడపాలి. అప్పుడు ఆ తల్లి అనుగ్రహించి, శ్రీమన్నారాయణులవారు కూడా సంతోషించి మీకు మునుపటి వైభవాన్ని కలుగజేస్తారని అన్నాడు.

ఇది విన్న ఆ రాజ దంపతులు ఆ మునీశ్వరునికి నమస్కరించి ఆ మరునాడే బయలుదేరి తిరుచానూరు చేరుకున్నారు. జుట్టు బాగా పెరిగి బట్టలు కూడా సరిగా లేకపోవటంచేత అక్కడివారెవరూ రాజ దంపతులను గుర్తు పట్టలేదు. వీరు వేరే



దేశం నుండి వచ్చిన భక్తులని తలచారు. రాజ దంపతులిద్దరూ నలభై రోజులు అక్కడే వుండి రోజూ ఆలయంలో జగన్మాతను సేవిస్తూ గడిపారు. వీరి కఠోర దీక్షకు శ్రీ లక్ష్మీ నారాయణులు ఎంతో సంతోషించారు. వారి అనుగ్రహంతో తిరిగి వారికి రాజ్యాధికారం వచ్చి సర్వ సౌభాగ్యాలూ చేకూరాయి.

ఓ జగన్మాతా నీవు జ్ఞాన స్వరూపిణివి, నీవు వున్న చోట సర్వ సౌభాగ్యాలు వుంటాయి. సమస్త సంపదలకూ మూల కారకురాలివైన తల్లీ నీకివే నా నమస్కారములు. కైలాసంలో పార్వతీదేవిగా, పాలసముద్రంలో పుట్టిన సింధూకన్యగా, స్వర్గంలో స్వర్గలక్ష్మిగా, భూలోకంలో లక్ష్మీదేవిగా, వైకుంఠంలో శ్రీ మహాలక్ష్మిగా, బ్రహ్మలోకంలో వాగ్దేవి రూపంలో సరస్వతిగా, గంగగా, తులసిగా భాసిస్తున్న ఓ జగన్మాతా నీకివే మా నమస్కారములు. ఓ నారాయణీ! నీకివే మా ప్రణామములు. ఓ హరిప్రియా నీకివే మా నమస్కారములు.

# అయిదవ అధ్యాయము

సూర్యస్యరశ్మియో యదృత
ఊర్మయో శ్వాంబుధోరివ
సర్వైశ్వర్య ప్రభావేన
కమలా శ్రీపతేతథా

సూర్యునికి, సూర్యకిరణాలను ఎలా విడదీయరాని సంబంధం ఉందో, సముద్రానికీ, అలలకు ఎలా విడదీయరాని సంబంధం కలదో, ఆ విధంగానే శ్రీ లక్ష్మీనారాయణుల బంధం కూడా విడదీయరానిది. వారిరువురినీ విడివిడిగా ఊహించలేము. శ్రీమహాలక్ష్మీనారాయణులలో ఇరువురిలో ఎవరిని తలచినా వెంటనే రెండవ వారు మెదలుతారు. అంతటి అన్యోన్యత వారిది. అందుకే శ్రీమన్నారాయణుల వారి ప్రతీ అవతారంలోను శ్రీ మహాలక్ష్మి ఆ స్వామివారికి వెన్నంటే ఉన్నది.

కలియుగంలో ఎక్కడ చూసిననూ రాక్షస కృత్యములే జరుగుచున్నవి. ధర్మము



ఏ మాత్రము పాటింపబడుట లేదు. ఇది గమనించిన మహర్షులు గంగా తీరమున నైమిశారణ్యమున మహాయజ్ఞము చేయవలెనని సంకల్పించిరి. ఆ యజ్ఞఫలమునకు దేవతలలో ఎవరు అర్హులు కాగలరని పెద్ద చర్చ జరిగింది. సృష్టి, స్థితి, లయ కారకులైన త్రిమూర్తులే దీనికి అర్హులని నిర్ణయించారు. కాని ముగ్గురిలో ఎవరు యజ్ఞఫలానికి అర్హులా అని ఆలోచనలో పడ్డారు. ఇంతలో అక్కడకు వచ్చిన నారద మునీంద్రుడు ఈ విషయం తెలుసుకుని మీలో ఎవరైనా త్రిలోకములు పర్యటించి త్రిమూర్తులలో యజ్ఞఫలానికి ఎవ్వరు అర్హులా అని మీరే నిర్ణయించుకొనవలసింది అని చెప్పాడు. వెంటనే ఆ కార్యమునకు భృగుమహర్షి తాను వెళ్ళగలనని అన్నాడు. ఆవిధంగా నిశ్చయించుకున్న భృగువు తొలుతగా చతుర్ముఖునికి నివాసమైన బ్రహ్మలోకానికి వెళ్ళాడు. అక్కడ బ్రహ్మదేవుడు సరస్వతి అద్భుతంగా వీణ మీటుతుండగా ఆ ఆనందంలో మునిగియున్నారు. భృగువు రాకను గమనించలేదు. దీనితో భృగువు బ్రహ్మదేవునిపై ఆగ్రహించి అతడు పూజార్హుడు కాడని, భూలోకంలో బ్రహ్మదేవునికి ఎక్కడా ఆలయం వుండదని శపించి అక్కడినుంచి వెళ్ళాడు.

బ్రహ్మలోకం నుండి బయలుదేరిన భృగువు పరమేశ్వరుని నివాస స్థలమైన కైలాసమునకు చేరాడు. భృగువు వచ్చిన సమయంలో ఆ ఆదిదంపతులిద్దరూ సరస సల్లాపాలలో తేలుతున్నారు. తమ ఏకాంతమునకు భంగం కలిగెనని పరమేశ్వరుడు భృగుమహర్షి వంక ఒకింత కోపంతో చూశాడు. అది అవమానముగా భావించిన మహర్షి అక్కడినుండి వెడలి వైకుంఠమున ప్రవేశించెను.

ఆ వైకుంఠ వైభోగము ఇంతా, అంతా అని చెప్పనలవి కానిది. ఎక్కడ చూసినా, శ్రీమన్నారాయణులవారి పూజలు, భజనలు, సంకీర్తనలు వినబడుతున్నాయి. దేవతలు శ్రీలక్ష్మీనారాయణులను అనేక స్తోత్రములతో ప్రార్థిస్తున్నారు. భృగువు వచ్చేటప్పటికి శ్రీమన్నారాయణులవారు ఆదిశేషునిపై పవళించియుండగా ప్రియసఖి శ్రీ మహాలక్ష్మి స్వామివారి పాదములను వత్తుచుండెను. తన రాకను గమనించనట్టే ఉన్నాడని తలచి శ్రీ మహావిష్ణువుపై ఆగ్రహంపై తీవ్ర ఆవేశంతో ఊగిపోతూ భృగువు

ఒక్క ఉదుటున ఆ పరబ్రహ్మమూర్తి వక్షస్థలమున తన ఎడమకాలితో తన్నెను. వెంటనే శ్రీమన్నారాయణుడు ఉలిక్కిపడినట్లు నటించి స్వామీ తమ రాకను గమనించనేలేదు. నా హృదయానికి తగిలిన తమ పాదములు ఎంత నొప్పి పెడుతున్నవో కదా, నన్ను మన్నింపవలసింది అని అంటూ ముని పాదములను చేతితో నిమురుతున్నట్లుగా వత్తుతూ పాదములందు గల నేత్రమును అణచివేసెను. అహంకారం తొలగిపోయిన భృగుమహర్షి ఎంతో సాత్వికుడైనాడు. శ్రీమన్నారాయణులవారిని అనేక విధముల స్తుతించి తిరిగి యజ్ఞస్థలం చేరి అక్కడవున్న మునులతో జరిగిన విశేషములన్నీ వివరించి శ్రీమన్నారాయణుడే యజ్ఞఫలమునకు అర్హుడని తెలిపెను.

శ్రీమన్నారాయణులవారియొక్క హృదయస్థానమునందు భృగువు తన్నుటచేత శ్రీమహాలక్ష్మి ఎంతో బాధపడి వైకుంఠమునుండి భూలోకమున కొల్హాపురం చేరి ఘోర తపస్సును ఆరంభించెను. సర్వ ఐశ్వర్యాలకు ప్రతీక అయిన శ్రీమహాలక్ష్మి విడిచిపోవుటచే వైకుంఠం కళావిహీనమయ్యెను. తన ప్రియసఖి తనను వదిలి వెళ్ళుటచే శ్రీమన్నారాయణుడు ఎంతో బాధపడ్డాడు. శ్రీ మహాలక్ష్మిని వెతుకుతూ భూలోకమును చేరాడు. కొండలు, గుట్టలు, వనములు తిరుగుతూ ఓ ప్రియసఖీ నీవెక్కడ వున్నావు అంటూ ఎన్నో ప్రదేశాలు తిరిగాడు.

ఆవిధంగా తిరిగి, తిరిగి అలసిపోయి గంగానదికి దక్షిణమున మూడు వందల యోజనముల దూరమున గల సువర్ణముఖీనదికి ఉత్తరమున క్రోసు దూరమున ఉన్నట్టియు మూడు యోజనముల వెడల్పును, ముప్పది యోజనముల పొడవును కలిగి శిరస్సు నందు వేంకటాద్రిని, మధ్య భాగమున నృసింహాద్రిని, చివరన శ్రీశైలమును కలిగినట్టి వేంకటాద్రిని చేరి అచ్చటనొక పుట్టలో వీనుడై వుండెను. తన ప్రియసఖి శ్రీమహాలక్ష్మి కొరకై ఘోర తపస్సును ప్రారంభించెను.

ఆవిధంగా లక్ష్మీనారయణులిద్దరూ వైకుంఠమును వీడి వెళ్ళిన తరువాత వైకుంఠము కళావిహీనమైనది. దేవతలందరూ జరిగినది తెలుసుకుని శ్రీమన్నారాయణుడు ప్రస్తుతము వేంకటాద్రిపై ఒక పుట్టలో వున్నాడని గ్రహించారు.



ఆ ప్రదేశమును అప్పుడు ఒక చోళరాజు పరిపాలిస్తుండేవాడు. శ్రీమన్నారాయణుడు రోజు రోజుకు అన్న పానీయాలు లేక కృశించిపోవటం గమనించి బ్రహ్మ రుద్రులు ఏదైనా చేయాలని తలంచారు. వెంటనే బ్రహ్మ గోరూపమును, రుద్రుడు లేగదూడ రూపమును పొంది లక్ష్మీదేవి గోపాలిక రూపమును ధరించి, ఆ ఆవుదూడలను చోళరాజు వద్దకు తీసుకువెళ్ళి ఈ ఆవుదూడలు ఎంతో మహిమాన్వితమైనవని చెప్పి ఆ మహారాజుకు విక్రయించెను. అప్పుడు ఆవుదూడల రూపములో వున్న ఆ బ్రహ్మరుద్రులిద్దరూ ఆ మహారాజు వద్ద వున్న గోశాలకు చేరారు. ప్రతి నిత్యమూ గోపాలుడు గోవులన్నిటినీ తోలుకుని వేంకటాచలమునకు పోవుచుండెను. ఈ ఆవు ఎంతో తేజస్సుతో వుండి ఎక్కువ పాలు ఇవ్వటంతో మహారాణి ఎంతో సంతోషించెడిది.

ఈవిధంగా కొన్ని రోజులు గడిచిన తరువాత బ్రహ్మరుద్రులు తాను ఈ రూపము ధరించిన కార్యమును ఆచరింపదలచారు. ఇన్ని రోజులనుండి ఎంతో ఎక్కువ పాలిస్తున్న ఆ ఆవు మునుపటివలె పాలు ఇచ్చుట మానివేయటం గోపాలుడు గమనించాడు. దూడ కూడా పాలు లేక చిక్కిపోవుతున్నదని గ్రహించాడు. ఇందుకు కారణమేమై ఉంటుందా అని ఎలాగైనా కనిపెట్టవలెనని అనుకున్నాడు. ఎంతో జాగరూకుడై రోజూ ఆ ఆవు ఎక్కడెక్కడ తిరుగుతున్నదో అని దూరం నుంచే గమనించేవాడు. ఆ రోజు గోపాలుడు ఒక అద్భుత దృశ్యమును చూశాడు. గోవు ఒక పుట్టవద్ద నిలుచుని ఆ పుట్ట రంధ్రమున నుండి తన పొదుగులోని పాలని పుట్టలోనికి స్రవింపచేయుట చూసి గోపాలుడు ఎంతో కోపం తెచ్చుకుని తన చేతిలో వున్న గొడ్డలితో ఒక్క ఉదుటున ఆవును చంపటానికి ప్రయత్నించాడు. ఇది గమనించిన శ్రీనివాసుడు ఆ గోవును రక్షించడానికై ఒక్కసారిగా పుట్టలోనుంచి పైకి లేచాడు. ఆ గోవుకు అడ్డం రావడంతో గోపాలుని గొడ్డలి ఒక్కసారిగా శ్రీనివాసుని శిరముపై పడినది. పెద్ద గాయమై రక్త ప్రవాహం వచ్చుట చూసి ఆ గోపాలుడు భయపడి ప్రాణములు విడిచాడు.

జరిగిన విషయమంతా తెలుసుకుని చోళరాజు ఆ ప్రదేశానికి వచ్చాడు. శ్రీనివాసుడు ఈ పాపఫలమునకు చోళరాజును పిశాచము కావలసిందని శపించాడు. అందుకు

చోళరాజు ఎంతో విచారించి, అతడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే అని గ్రహించి, అనేక విధముల స్తుతించి, తన పొరపాటుకు క్షమింపమని కోరెను. తన శాప నివృత్తి కొరకు అర్థించెను. శ్రీనివాసుడు అనుగ్రహించి, శాపనివృత్తి అనుగ్రహించటంతో చోళరాజు కొంతకాలమునకు తిరిగి నిజరూపము లభించినవాడాయెను.

శ్రీమన్నారాయణుడు దేవ గురువైన బృహస్పతిని పిలిపించి తన గాయమునకు మూలికా చికిత్స గావించుకొనెను. ద్వాపరయుగంలోని యశోద వకుళమాతగా జన్మించి అక్కడ సమీపంలో వున్న వనము నందు నివసించుచుండెను. వకుళమాత శ్రీనివాసుని గురించి తెలుసుకుని అతనిని శ్రీకృష్ణునిగానే భావించి తన ఆశ్రమమునకు ఆహ్వానించి, నిత్యము సపర్యలు చేయుచుండెను.

చోళరాజైన ఆకాశరాజు, ధరణీదేవి దంపతులకు సంతానము లేకుండెను. సంతానము కొరకు వారు ఆచరించని వ్రతము లేదు. చేయని పూజ లేదు. దర్శించని పుణ్యక్షేత్రం లేదు. సేవించని దేవత లేదు. అయిననూ ఏమాత్రమూ ఫలితం లేకుండెను. అప్పుడు చోళరాజు తన ఆస్థానములోనున్న జ్యోతిష్కులను, మహాపండితులను పిలిపించి, వారి ఆనతిపై యాగము చేయడానికి నిశ్చయించెను. శుభలగ్నమున వేద పండితులు వేద మంత్రములు ఉచ్చరించుచుండగా యాగస్థలము దున్నుటకు ఉపక్రమించెను. ఒక ప్రదేశమున త్రవ్వుచుండగా చంద్రబింబము వలె దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్న ఒక బాలికను కనుగొని మిక్కిలి ఆశ్చర్యపరుడయ్యెను. ఆమెను సాక్షాత్తూ శ్రీ మహాలక్ష్మిగా భావించి, తనను దేవతలు కరుణించారని తలచి, ఆమెను తన అంతఃపురమునకు తీసుకునిపోయెను.

ఆకాశరాజు, ధరణీదేవి దంపతులిద్దరూ ఆ బాలికకు పద్మావతి అని నామకరణము చేసి ఎంతో అల్లారుముద్దుగా పెంచుచుండిరి. కొంతకాలమునకు యాగఫలితమున ధరణీ దేవి గర్భము దాల్చి ఒకానొక శుభముహూర్తమున ఎంతో తేజోవంతుడైన కుమారుని కన్నది. అతనికి వసునాయకుడని పేరు పెట్టిరి. పద్మావతియు, వసునాయకుడు ఇద్దరూ సోదర సోదరీమణి వాత్సల్యముతో ఆడుచుండెడివారు.



పద్మావతి సాక్షాత్తూ ఆ వైకుంఠనాథుడైన శ్రీమన్నారాయణులవారి ప్రియసఖి శ్రీ మహాలక్ష్మియే అని అంతఃపురంలో అందరూ అనుచుండెడివారు. పద్మావతి ఎంతో అద్భుత సౌందర్యంతో అలరారుతూ చెలికత్తెలతో ఆడుతూ, పాడుతూ తిరిగేది. ఒకనాడు ఆమెకు నారద మునీంద్రుడు వృద్ధ మునీశ్వరుని రూపంలో కనబడి నీవు సాక్షాత్తూ ఆ జగన్మాతవే అని చెప్పి త్వరలోనే నీకు ఆ శ్రీమన్నారాయణులవారితో వివాహం కాగలదని చెప్పెను.

ఒకనాడు శ్రీనివాసుడు వేంకటాద్రిపై క్రూరమృగాలను వేటాడుతూ ఒక అద్భుతమైన గజమును చూశాడు. అది ఎంతకీ దొరకక కనబడినట్లే కనబడి తిరిగి మాయమవుతున్నది. ఆ గజమును వెతుకుతూ శ్రీనివాసుడు చాలా దూరం వెళ్ళగా అక్కడ ఒక అద్భుత సౌందర్యవతి చెలికత్తెలతో ఆటపాటలాడుతూ కనిపించింది. ఆమెను చూసి ఆమె దివ్య సౌందర్యానికి ముగ్ధుడై ఆమె దగ్గరకు వెళ్లి ఆమెను వివాహమాడదలచానని చెప్పాడు. ఇందుకు తోటి చెలులందరూ ఆశ్చర్యపోయారు. ఒక సామాన్యమానవుడు రాకుమర్తెని వివాహమాడుట కుదరదని చెప్పి పద్మావతిని తోడ్కొని అంతఃపురమునకు వెళ్ళిపోయారు. శ్రీనివాసుడు ఆశ్రమమునకు వెళ్ళి వకుళమాతకు జరిగిన వృత్తాంతమంతయు చెప్పి త్రేతాయుగం నాటి వేదవతియే ఈ పద్మావతి అని చెప్పెను. ఆమెను వివాహమాడదలచానని తెలిపెను.

కొంతకాలమునకు వకుళాదేవియొక్క యత్నములు గమనించిన శుక మహర్షిని యొక్క ప్రయత్నము ఫలించి, పద్మావతీ శ్రీనివాసుల వివాహము నిశ్చయమయ్యెను.

ఆకాశరాజు, ధరణీదేవి దంపతుల ఆనందానికి అవధులు లేవు. ఈ ప్రపంచంలో ఎందరికి ఇంతటి భాగ్యం లభించగలదు? ఎన్ని కోట్ల జన్మల పుణ్యఫలమో కదా! సాక్షాత్తూ శ్రీమన్నారాయణుని అల్లునిగా పొందగలిగే భాగ్యం ఎంత మందికి కలుగుతుంది? మా జన్మ ధన్యమయింది. ఓ శ్రీమన్నారాయణా! ఇంతటి భాగ్యం అనుగ్రహించిన నీకివే మా నమస్కారములు. ఓ మహాలక్ష్మీ! ఈ ప్రపంచంలోని

సర్వ ఐశ్వర్యాలకూ నిలయమైన నిన్ను కుమార్తెగా పొందిన మేము ఎంతటి అదృష్టవంతులము తల్లీ! అని ఎంతో సంతోషపడ్డారు.

ఆకాశరాజు దంపతులు వారి గురువైన శుక మహర్షికి కబురు పంపించగా ఆ మహర్షి వెంటనే రాజప్రసాదానికి వచ్చాడు. మహర్షుల వారికి సకల సపర్యలూ గావించి జరిగిన విషయములన్నీ వివరంగా చెప్పారు. అప్పుడు శుక మహర్షి ఆ దంపతులతో ఇలా అన్నారు. 'ఓ రాజ దంపతులారా! దివ్య దృష్టితో నాకు అన్నీ విషయములూ తెలిసినవి. సాక్షాత్తూ శ్రీ లక్ష్మీనారాయణులనే కుమార్తె, అల్లుడుగా పొందిన మీ భాగ్యమెంతని వర్ణించగలను? ఎన్నో కోట్ల సంవత్సరాల తపస్సు చేతగానీ ఆ స్వామి దర్శనమే సాధ్యపడదే, అటువంటిది మీరు ఆ జగత్ కళ్యాణ చక్రవర్తినే అల్లునిగా పొందనున్నారు. ఆహా! ఎంతటి అదృష్టవంతులు! మీ పుణ్యం చేత ఈ దేశంలోని ప్రజలందరూ ఆ జగన్నాథుడు, జగన్మాతల కళ్యాణం దర్శించే భాగ్యం పొందబోవుచున్నారు. మీ దేశంలోని ప్రజలందరూ ఎంతో అదృష్టవంతులు' అని చెప్పాడు.

అప్పుడు ఆకాశరాజు దేవగురువైన బృహస్పతిని మనస్సులో ప్రార్థించగా ఆ మహర్షి వెంటనే ప్రత్యక్షమైనాడు. అప్పుడు బృహస్పతి, శుకమహర్షులు ఇరువురూ కుశల ప్రశ్నలు వేసుకుని శ్రీ లక్ష్మీనారాయణుల వివాహం గురించి తెలుసుకుని ఎంతో సంతోషించారు. అప్పుడు ఆకాశరాజు బృహస్పతితో 'ఓ మహర్షీ! మీరాక మాకెంతో సంతోషదాయకం. నన్ను అనుగ్రహించి శ్రీ పద్మావతీ, శ్రీనివాసుల వివాహ పత్రిక తమరు వ్రాయవలసినది' అని వేడుకున్నాడు.

అప్పుడు బృహస్పతులవారు ఆకాశరాజుతో 'రాజా! నీకు సాక్షాత్తూ శ్రీమన్నారాయణులవారే అల్లుడుగా లభ్యమగుట నీ పూర్వజన్మఫలము. నీ పుణ్యఫలము చేత సమస్త మానవకోటికీ, గరుడ, గంధర్వ, కిన్నెర, కింపురుషాదులకు శ్రీలక్ష్మీ శ్రీనివాసుల కళ్యాణము వీక్షించే భాగ్యము కలుగనున్నది. సమస్త లోకవాసులు



కళ్యాణ విశేషములనే తలచుకుంటున్నారు. వారందరి ఆనందమూ వర్ణనాతీతము. వివాహము ఎప్పుడెప్పుడా అని ఎంతో ఆత్రతతో ఎదురు చూచుచున్నారు. ఆ జగన్నాథుని కళ్యాణానికి ఏవిధంగా అలంకరించుకోవాలా అని ఇప్పుడే ఆలోచించడం మొదలుపెట్టారు. ఆ జగన్మూర్తుల కళ్యాణపత్రిక వ్రాసే అదృష్టం నాకు కలగటం నా భాగ్యం కాక ఇంకేమని చెప్పను. ఇదంతా ఆ దివ్యదంపతులు శ్రీలక్ష్మీనారాయణుల అనుగ్రహం తప్ప మరొకటి కాదు' అని తలచి లగ్నపత్రిక వ్రాయడానికి ఉపక్రమించాడు. 'శ్రీ లక్ష్మీ నారాయణులను ఒక్కసారి మనస్సులో ప్రార్థించి ఇలా మొదలుపెట్టాడు. 'ఓ శేషాచలవాసుడైన శ్రీనివాసా! ఆకాశరాజు అనబడే నేను నా కుమార్తె పద్మావతిని తమకు ఇచ్చి వివాహము జరిపించడానికి ఎంతో సంతోషంతో నిశ్చయించుకున్నాను. అందులకు ఈ వైశాఖ శుద్ధ దశమీ శుక్రవారము దివ్యముహూర్తముగా పెద్దలు నిర్ణయించినారు. కావున తాము బంధుమిత్ర సపరివార సమేతముగా వచ్చి నాచే నొసంగబడు కన్యాదానమును స్వీకరించి మమ్ములను కృతార్థులను చేయవలసింది' అని వ్రాసాడు.

లగ్నపత్రికను బృహస్పతులవారు అక్కడ వున్న వారందరికీ చదివి వినిపించారు. లగ్నపత్రిక వ్రాయడం పూర్తవగానే ప్రకృతి పులకించింది అనడానికి సంకేతంగా చల్లని చిరుజల్లు కురిసింది. అప్పుడు ఆకాశరాజు తమ గురువైన శుకమహర్షికి ఈ లగ్నపత్రికను ఇచ్చి శేషాచలము వెళ్ళి శ్రీనివాసునికి అంద చేయవలసినదిగా ప్రార్థించాడు. అప్పుడా శుక మహర్షి 'ఓ రాజా! ఇంతకు మించిన అదృష్టమేమున్నది! తప్పక ఆ శ్రీనివాసుని దర్శించి ఈ లగ్నపత్రికను వారికి అందించగలవాడను' అని లగ్నపత్రికను కనులకు అద్దుకుని తక్షణమే శేషాచలానికి బయలుదేరి వెళ్ళాడు.

వకుళాదేవి ఆశ్రమానికి వచ్చిన శుకమహర్షికి ఎన్నో మర్యాదలు గావించబడ్డాయి. కాసేపు విశ్రమించిన తరువాత శుకమహర్షి తాను తీసుకువచ్చిన లగ్నపత్రికను ఒక్కసారి కనులకు అద్దుకుని శ్రీనివాసునికి అందించాడు. శ్రీనివాసుడు లగ్నపత్రికలోని విశేషములన్నీ చదివి ఎంతో ఆనందించి తన ప్రత్యుత్తరాన్ని ఈవిధంగా

రాసి శుకునికి అందించాడు. 'ఓ మహారాజా! నీవు రాసిన లేఖను అందుకుంటిని. నీ కుమార్తె పద్మావతిని నా భార్యగా స్వీకరించుట నాకెంతో సంతోషదాయకము. మేమందరము బహుదానందపడితిమి. నేను బంధుమిత్రులతో కూడి వచ్చి నీ కుమార్తె పద్మావతిని తప్పక ఆనందముతో స్వీకరించెదనని మనవి చేసుకుంటున్నాను' అని ఈ విధంగా రాసాడు. ఆ లేఖను తీసుకుని శ్రీనివాసుని వద్ద శెలవు తీసుకుని శుకమహర్షి ఆకాశరాజు వద్దకు తిరిగి వెళ్ళాడు.

ఆరోజు వైశాఖ శుద్ధ దశమి. సూర్యభగవానుడు ఉదయాన్నే ఎంతో ఆనందంగా ఉన్నాడు. ఆరోజే పద్మావతీ, శ్రీనివాసుల కళ్యాణం. ప్రకృతి అంతా పులకరించి పోతున్నది. సరస్సులలోని కమలాలు ఎంతో ముచ్చటగా విచ్చుకున్నవి. పక్షులు కలకలరావాలు చేస్తూ చెవులకు ఇంపు కలిగిస్తున్నాయి. నారాయణపురం అంతా హడావిడిగా ఉన్నది. దేవతలందరూ ఎంతో అద్భుతమైన వస్త్రాలను ధరిస్తున్నారు. ఆనాటి శ్రీలక్ష్మీనారాయణుల వివాహానికి అందరూ అనేక ఆభరణాలను ధరించి తయారవుతున్నారు. సుమంగళీమణులు ఎంతో అందమైన వస్త్రాలను ధరించి, పుష్పాలతో కురులను అలంకరించుకుని, రకరకాల దివ్య ఆభరణాలతో ముస్తాబవుతున్నారు.

ఆకాశరాజు, ధరణీదేవి దంపతులు వరపూజకు కావలసిన వస్తువులన్నీ సిద్ధము చేసుకుని నూతన వస్త్రాభరణములు, రంగు రంగుల పూల హారాలు, తాంబూలములు, ఎన్నో దివ్య కానుకలను తీసుకుని శ్రీనివాసుని విడిది గృహానికి బయలు దేరారు. వారితో పాటే శుక, బృహస్పతి మహర్షులు కూడా బయలుదేరారు. ఆకాశరాజు వెనుక సమస్త బంధు జనము వచ్చింది. వీరందరు కలసి మేళతాళాలతో శ్రీనివాసుని విడిది గృహానికి వచ్చారు. అక్కడ అప్పటికే చతుర్ముఖ బ్రహ్మ, పరమేశ్వరుడు, అష్ట దిక్పాలకులు, నవగ్రహదేవతలూ, మొదలైన దేవతలందరూ వచ్చి ఉన్నారు. అక్కడ ముని గణములోనున్న వశిష్టులవారు ఆకాశరాజుతో వరపూజ గావించవలసిందిగా చెప్పారు.



అప్పుడు ఆకాశరాజు శ్రీనివాసునికి నమస్కరించి 'ఓ శ్రీనివాసా! శ్రీమన్నారాయణా! నిన్ను అల్లునిగా పొందుతున్న నా భాగ్యము ఎంతని చెప్పుదును? ఎవరి నామస్మరణచే కోటి జన్మల మహాపాపములన్నీ నశించునో, ఎవరి నామస్మరణచే మనస్సు శరీరమూ శుద్ధి చెందునో, ఎవరి నామస్మరణ వలన కోటి యాగ ఫలం లభించునో, ఎవరి నామస్మరణ వలన సమస్త దేవగణమూ వారి వారి శక్తులు పొందుతున్నారో, ఎవరి దర్శన భాగ్యమై సమస్త మునిగణమూ కోట్లాది సంవత్సరాలుగా తపస్సు చేస్తున్నారో అటువంటి పరబ్రహ్మమూర్తివైన నీవు నాకు అల్లునిగా లభ్యమగుట నా అదృష్టమెంతటిదని చెప్పుదును? నీ పాదపద్మములను ఒక్కసారి మనస్సులో తలిస్తే చాలు సర్వపాపములూ తొలగిపోవును. సర్వభాగ్యాలూ కలుగును. సాక్షాత్తూ బ్రహ్మదేవుడే కడిగిన నీ పాదాలను కడిగే అదృష్టం నాకు కలిగినందుకు నాకెంతో సంతోషముగా యున్నది. కన్యాదాతలందరూ తమ కుమార్తెకు భర్తగా వచ్చే యువకుడు శ్రీమన్నారాయణుని గుణగణాలను, సౌందర్యాన్ని, తేజస్సును కలిగి ఉండాలని తలుస్తారు. అటువంటిది సాక్షాత్తూ నీవే నాకు అల్లునిగా లభించటంతో ఏ కన్యాదాతకూ కలగని అదృష్టం నాకు కలిగింది. అని ఆనందభాష్పాలు కంటరాగా శ్రీనివాసుని పాద పద్మములను కడిగి, చందన కుంకుమ పుష్పాక్షతలతో పూజించాడు. సుమంగళీమణులు మంగళ హారతీపాటలు పాడుతూ శ్రీనివాసునికి హారతి పట్టారు. ఈ వేడుకనంతా చూస్తున్న వారందరి ఆనందం చెప్పనలవి కానిది.

ఇక పెండ్లికుమార్తె తన మందిరంలో ఎలా ఉన్నదో చూద్దాము. సాక్షాత్తూ సరస్వతీదేవి, గౌరీదేవి పద్మావతిని అలంకరిస్తున్నారు. అద్భుతమైన బంగారు సరిగంచు పట్టుచీర కట్టి, బంగారు కుచ్చులతో మల్లెమొగ్గలు జడను వేసి, పాపటి బొట్టు, చెంపన ముత్యాల సరాలతో అలంకరించారు. సరస్వతీదేవి కాళ్ళకు పారాణి రాయగా, గౌరీదేవి పద్మావతికి బుగ్గన చుక్కను పెట్టింది. ఇంద్రుని భార్య శచీదేవి పద్మావతికి ఎంతో అందమైన, మెరిసిపోతున్న ఆభరణాలను అలంకరింపజేసింది. అప్సరసలు వచ్చి పద్మావతికి చేతులకు కాళ్ళకు గోరింటాకు పెట్టారు.

ఆహా! ఆ తల్లి సౌందర్యం ఎంతని వర్ణించగలం? శ్రీనివాసుడే మదిలో దోబూచులాడుతుండగా, మధుర మధుర ఆలోచనలతో ఆనందిస్తూ, మళ్ళీ ఇంతలోనే ఓహో! ఇక్కడ ఇంతమంది ఉన్నారు కదా! అని సిగ్గుపడి ముడుచుకుపోతూ ఉన్న శ్రీమహాలక్ష్మిని వర్ణించటం ఎవరితరం? ఆ సృష్టిలోని సౌందర్యమంతా ఆమెదే కదా! ఇంత చక్కటి బంగారు ఆభరణాలు ధరించింది గానీ ఈ సృష్టిలోని బంగారమంతా ఈమె స్వరూపమే కదా ఇన్ని రకాల పుష్పాలను చక్కగా తురుముకున్నది గానీ ఈ పుష్పాలలోని అందమంతా ఈ లతాంగిదే కదా! ఈ సృష్టిలోని ఐశ్వర్యమంతా ఈ తల్లి స్వరూపమే కదా! ఆహా! ఈతల్లిని జగన్మాతను పెండ్లికూతురుగా చూసి అక్కడ ఉన్నవారంతా మురిసిపోతున్నారు.

శ్రీ పద్మావతీ శ్రీనివాసుల వివాహం అత్యంత వైభవంగా, కన్నుల పండువగా అయిదురోజులు జరిగినది. సమస్త విశ్వమునకు ఆ అయిదు రోజులు కళ్యాణశోభయే. సాక్షాత్తూ శ్రీమన్నారాయణులవారినే అల్లుడిగా పొందిన మహారాజు ఆనందమునకు అంతు లేకుండెను. ఆ రాజదంపతులు కుమార్తె పద్మావతిని సారెతోడ అత్తవారింటికి పంపినారు. వివాహమయిన తరువాత ఆరునెలలు కొండనెక్కకూడదన్న నియమంచేత మార్గమధ్యంలో శ్రీనివాసుడు, పద్మావతి దంపతులు అగస్త్యముని ఆశ్రమమునకు జేరెను. ఆరు నెలలపాటు అక్కడ నివసించిన తరువాత వారిద్దరు శేషాచలమునకు బయలుదేరిరి. బంధుమిత్ర సపరివారముగా శేషాచలము చేరిన తరువాత దేవతలందరూ పుష్పములు చల్లుతుండగా శ్రీనివాసుడు హృదయలక్ష్మీ సమేతుడై ఆనందనిలయంలో ప్రవేశించెను. పద్మావతి శ్రీనివాసుని హృదయమున వ్యూహలక్ష్మియై అలంకరించినది. ఆకాశమునుండి దేవతలు పూలవాన కురిపించిరి. శ్రీ పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణ విశేషములు విన్నవారి, చూసినవారి జన్మ ధన్యము. ఓ లక్ష్మీనారాయణులారా! మీకివే నా నమస్కారములు. ఓ పద్మావతీ శ్రీనివాసులారా మీకివే నా ప్రణామములు. ఓ జగన్నాథా, జగన్మాతలారా! మీకివే నా నమస్కారములు.



శ్లో॥ సర్వ మంగళ మాంగళ్యే, శివే సర్వార్థ సాధికే ।

శరణ్యే త్ర్యంబకే దేవి, నారాయణి నమోస్తుతే ॥

నారాయణి సర్వమంగళ స్వరూపిణి, ఆమెయే వైష్ణవి, శక్తి. ఆమె సర్వలోక సంరక్షణి, ఆమెయే సర్వకళ్యాణదాయని. బ్రహ్మ సకల చరాచర సృష్టికారకుడు. శ్రీమన్నారాయణుడు స్థితికారకుడు, పరమేశ్వరుడు లయకారకుడు, శ్రీమహాలక్ష్మియే శ్రీమన్నారాయణుని యందున్న స్థితికారకశక్తి. ఆ జగన్మాత ధర్మమును ఆచరించే వారి గృహములందు లక్ష్మీ స్వరూపిణిగా, సత్పురుషులయందు శ్రద్ధారూపిణిగా ప్రకాశిస్తూ వుంటుంది. లోకములోని సర్వశక్తులు ఆ నారాయణి స్వరూపాలే. ఓ జగన్మాతా! నీకివే మా నమస్కారములు. ఓ జగజ్జననీ! నీకివే మా ప్రణామములు. ఓ విష్ణుప్రియా! నీకివే మా నమస్కారములు.

# ఆరవ అధ్యాయము

మాతస్సమస్త జగతాం మధుకైటభారేః
వక్షో విహారిణి మనోహర దివ్యమూర్తే
శ్రీ స్వామిని శ్రిత జన ప్రియదానశీలే
శ్రీ వేంకటేశ దయితే తవ సుప్రభాతమ్

ఓ జగన్మాతా! నీవు సమస్త జగాలను కన్న తల్లివి. మధుకైటభులు అనే రాక్షసులకు శత్రువైన శ్రీమన్నారాయణులవారి వక్షస్థలంలో ఎంతోదివ్యంగా నివసిస్తున్న కోమలాంగివి. నీవు అత్యంత మనోహర మంగళకర రూపంతో ప్రకాశిస్తూ, నిన్ను ఆశ్రయించినవారికి సకల శుభాలను అనుగ్రహిస్తున్నావు. ఓ జగన్మాతా! ఓ శ్రీమన్నారాయణా! మీకివే నా నమస్కారములు. ప్రతినిత్యమూ నీకు శుభోదయము అగు గాక.



పూర్వకాలంలో అనంతాచార్యులు అనే భక్తుడుండేవాడు. ఇతడు శ్రీమద్రామానుజాచార్యులవారి ప్రియ శిష్యుడు. గురువు శ్రీరామానుజాచార్యులవారి ఆదేశానుసారం అనంతాచార్యులు భార్యతో సహా తిరుమల చేరి శ్రీనివాసుని సేవిస్తూ కాలం గడపసాగారు. రోజూ తిరుమల కొండలన్నీ తిరిగి, ఎన్నో అందమైన పూలను సేకరించి ఆనందనిలయంలో స్వామిని ఎంతో అద్భుతంగా అలంకరించేవాడు. పూల అలంకారంలో దివ్యంగా దర్శనమిస్తున్న స్వామిని చూసి మురిసిపోయేవాడు అనంతాచార్యులు.

రోజూ అడవిలో చాలా దూరం వెళ్ళి పూలు కోసుకుని వస్తున్న అనంతాచార్యులవారికి ఒక ఆలోచన వచ్చింది. తానే స్వామి వారి పుష్పాలంకరణ కోసం ఎందుకు ఒక ఉద్యానవనాన్ని తయారు చేయకూడదని తలచాడు. చక్క చక్కగా రకరకాల సువాసనలతో వుండే పూల మొక్కలను పెంచి, వాటిని స్వామికి సమర్పించాలని తలచాడు. ఆ ఆలోచన రాగానే స్వామిని అందమైన పుష్పాలంకరణలో ఊహించుకుని మురిసిపోయాడు. ఈ పనిలో తానూ, తన భార్యా తప్ప మరెవ్వరి సహాయం తీసుకోకూడదని నిశ్చయించుకున్నాడు. ఆ తోటకు కావలసిన నీటికోసం ఒక చెరువును తవ్వటం ప్రారంభించాడు. ప్రతిరోజూ భార్యా భర్తలిద్దరూ ఉదయం స్వామివారి నివేదన అయిన తరువాత మధ్యాహ్నం వేళలో ఆ చెరువు తవ్వే పనిలో నిమగ్నమయ్యేవారు. నిప్పులు చిమ్మే ఎండను సైతం లెక్క చెయ్యకుండా గడ్డపారతో మట్టిని తవ్వి గంపలో ఎత్తి తన భార్య తలపై పెట్టేవాడు. ఆమె ఆ మట్టిని తీసుకువెళ్ళి దూరంగా విసిరివేసేది. ఆ దంపతులిద్దరూ ఇదేపనిలో నిమగ్నమయ్యారు. భార్య నిండు చూలాలు కావటంచేత గంపను నెత్తిమీద పెట్టుకుని వెళ్ళి దూరంగా పారవేసి తిరిగి రావటం, మళ్ళీ వెళ్ళటం చాలా కష్టంగా వుండేది. కానీ అనంతాచార్యులవారు మాత్రం వేరే ఎవ్వరి సహాయం తీసుకోకూడదని ధృఢ సంకల్పంతో వుండటం చేత భార్యకు ఈ శ్రమ తప్పలేదు. ఆశ్రిత జన వత్సలుడైన శ్రీనివాసుడు ఇదంతా గమనిస్తున్నాడు. ఆ దంపతులకు ఎలాగైనా సహాయ పడాలని తలచాడు.

ఆ మరునాడు ఆచార్యులవారి వద్దకు చిన్న బాలుని రూపంలో వచ్చి తాతా! ఈ మండుటెండలో మీరెంతో కష్టపడుతున్నారు. నన్ను కూడా సహాయం చెయ్యనివ్వండి అని అన్నాడు. కానీ అనంతాచార్యులవారు అందుకు ఏమాత్రం ఒప్పుకోలేదు. కానీ బాలుని రూపంలోని శ్రీనివాసుడు మాత్రం పట్టు విడవకుండా ప్రతిరోజూ ఆ దంపతులు మట్టి తవ్వే వేళలో వచ్చి నుంచునేవాడు. ఆచార్యులవారు ఆ బాలుని ఏమాత్రం దగ్గరకు రానిచ్చేవారు కాదు. ఆచార్యులవారిది అదే పట్టుదల. నిండు చూలాలైన భార్య మట్టి గంపలను ఎత్తుకుని, ఆయాసపడుతూ అంతదూరంలో పారవేయడం, మళ్ళీ తిరిగి గంపనెత్తుకోవటం ఇవేమీ గమనించే స్థితిలో లేడు. అతని ధ్యాస అంతా ఎంత త్వరగా ఈ చెరువు పూర్తవుతుందా, ఎంత త్వరగా పూలమొక్కలు వస్తాయా, ఎంత త్వరగా ఆ పూలతో ఆ స్వామిని అలంకరించటమా... అనే తపన తప్ప... తన శ్రమ గానీ, తమ భార్య శ్రమ గానీ ఏమాత్రం తెలియటం లేదు. భక్తవత్సలుడైన శ్రీనివాసునికి ఈ దంపతులను చూస్తుంటే ముచ్చట కలిగింది. వారి భక్తి పట్ల ఎంతో సంతోషం కలిగింది. కానీ వారి శ్రమను చూసి బాధపడ్డాడు. ఇక లాభం లేదనుకుని నెమ్మదిగా వెళ్లి ఆ మహాఇల్లాలి వద్ద నుంచి గంపను తీసుకున్నాడు. ఆమెను కాసేపు పక్కన వుండమని చెప్పి తాను మట్టిగంపలను ఎత్తి పారవేసే పనిలో పడ్డాడు. గడ్డపారతో మట్టిని తవ్వే పనిలో వున్న అనంతాచార్యులవారు ఇది గమనించలేదు. తలపైకెత్తి కూడా చూడలేదు. ఇలా జరుగుతుండగా కాసేపటికి ఆచార్యులవారికి అనుమానం వచ్చింది. తన భార్య రోజూ కంటే ఈ రోజు ఇంత త్వరగా ఎట్లా రాగలుగుతున్నది, ఇంత వేగంగా గంపను ఎలా ఖాళీ చేసి వస్తున్నది అని సంశయం కలిగింది.

ఆ ఆలోచన రాగానే ఆచార్యులవారు ఒక్కసారి తలపైకెత్తి చూశాడు. వెంటనే జరుగుతున్నది అర్థమైంది. ఇంతవరకూ ఈ బాలుడు ఈ గంప మోస్తున్నాడన్నమాట, అంతే! ఆచార్యులవారికి ఎంతో కోపం వచ్చింది. ఎంత వద్దని చెపుతున్నా, వినకుండా భార్యనుండి గంపను తీసుకున్నందుకు ఆ బాలునిపై విపరీతమైన కోపం వచ్చింది. ఒక్కసారి గడ్డపార పైకెత్తి ఎందుకిలా చేశావని కోపంగా అన్నాడు. ఆ బాలుడు



చిరునవ్వుతో ఒక్కసారిగా పరుగు లంకించుకున్నాడు. సమాధానం కూడా చెప్పకుండా అట్లా ఆ బాలుడు వెళ్ళిపోవటం ఆచార్యులవారికి మరింత కోపం తెప్పించింది. ఆవేశంతో ఊగిపోతూ ఆచార్యులవారు గడ్డపారతో ఆ బాలుని వెంటబడ్డాడు. కనబడినట్టే కనబడి ఇట్టే మాయమవుతున్నాడు ఆ బాలుడు. ఆచార్యులవారికి కోపం మరింత ఎక్కువై గడ్డపారను ఆ బాలునిపైకి విసిరాడు. ఆ విసురుకి గడ్డపార బాలుని గడ్డానికి తగిలి రక్తం కారింది. మళ్ళీ మాయమైనాడు ఆ బాలుడు. ఆ బాలునికి దెబ్బ తగలడంతో కొంచెం శంకించిన ఆచార్యులవారు మళ్ళీ కనబడకుండా పోతాడా అనుకుని వెనుతిరిగారు.

ఆ రోజు సాయంకాలం ఆలయంలో ప్రవేశించిన అనంతాచార్యులవారికి ఆలయంలో అర్చకులు ఏదో చర్చించుకోవడం కనిపించింది. అందరి ముఖాలలో ఆందోళన నిండి ఉండడం గమనించారు. అందుకు కారణమేమని ఒక అర్చకులవారిని అడుగగా ఆనందనిలయంలోనికి తీసుకునివెళ్ళి స్వామివారి విగ్రహాన్ని చూపించారు. అంతే! అక్కడ దృశ్యం చూసిన ఆచార్యులవారినోట మాట రాలేదు. శ్రీనివాసుని దివ్యమంగళ విగ్రహం చుబుకంపై గాయం! ధారగా కారుతున్న రక్తం! ఆ దృశ్యం చూసిన అనంతాచార్యులవారికి జరిగినదేమిటో అర్థమైంది. స్వామీ! ఎంత అపరాధం చేసాను? వచ్చింది నీవని తెలియక ఎంతటి అపరాధం చేశాను! తండ్రీ! ఆపద్బాంధవా! నన్ను క్షమించు తండ్రీ! అని స్వామివారిని అర్థించాడు. జరిగినదంతా తెలుసుకుని అక్కడ ఉన్న ఆచార్య పురుషులందరూ ఆశ్చర్యపోయారు. ఇంతలో శ్రీనివాసుడు ఒక ఆచార్యుని ద్వారా ఇలా పలికారు. ఓయీ! అనంతాచార్యా! ఇదంతా నేనాడిన నాటకమే. నీ భక్తి తత్పరతను లోకానికి చాటాలనే ఇలా చేశాను. నేను చేసిన లీలా విశేషమే ఇది. నా చుబుకంపై ఈ గాయానికి గుర్తుగా మాయని మచ్చ ఏర్పడుతుంది. ఆ చుక్కపై ఈ రోజునుంచి పచ్చకర్పూరపు చుక్కను అలంకరించుకుని భక్తులందరినీ ఆనందింపచేస్తూ ఉంటాను. అని అన్నారు శ్రీస్వామివారు. అనంతాచార్యులవారి జీవితం ధన్యమైంది.

శ్రీ లక్ష్మీనారాయణులకు ఆ పూలతోట ఎంతో ప్రాణప్రదమైనది. ఎంతో అద్భుతమైన పూలమొక్కలతో, తీగలతో రకరకాలైన దివ్య పుష్పాలతో ప్రకృతి సౌందర్యం మొత్తానికి అద్దం పట్టేలా ఉండే ఈ తోటలో విహరించటం శ్రీ మహాలక్ష్మికి అత్యంత ప్రీతికరం. ప్రతిరోజు రాత్రివేళల్లో ఆ జగన్మాత తన నాథుడు తోడు రాగా ఈ వనంలో విహరిస్తూ ఆటపాడలాడుతూ మైమరచిపోయేది. అనంతాచార్యులు ఎంతో ప్రేమతో ఎన్నో అందమైన పూలమొక్కలను ఎక్కడెక్కడినుండో తీసుకునివచ్చి పెంచసాగాడు. రాత్రి వేళల్లో జగన్మాత ప్రతీ పూలమొక్క చెంత నిలుచుని ఆ పుష్పాల అందాన్ని చూసి మురిసిపోయేది. అనంతాచార్యులు ప్రతిరోజు ఆ పువ్వులను కోసుకుని వెళ్లి ఆనందనిలయంలో స్వామికి సమర్పించేవాడు. అర్చకులు ఈ పూలతో శ్రీమన్నారాయణులవారిని, స్వామి వారి హృదయలక్ష్మిని ఎంతో దివ్యంగా అలంకరించేవారు. ఈ పుష్పాలంకరణలో శ్రీ స్వామి అత్యంత రమణీయంగా భక్తులకు దర్శనం ఇచ్చేవాడు.

జగన్మాత అనంతాచార్యుల పుష్ప కైంకర్యానికి ఎంతో సంతోషపడి, అతడిని కనికరించాలని తలచింది. శ్రీమన్నారాయణులవారితో స్వామీ అనంతాచార్యులు మనకెంతో ప్రియభక్తుడు. అతనిపై దివ్యానుగ్రహం కురిపించటం మన ధర్మం అని అన్నది. అప్పుడు శ్రీమన్నారాయణుడు జగన్మాతతో ఓ ప్రియసఖీ! నీకు నీ బిడ్డలంటే అంతటి అనురాగం, ఆప్యాయత. అతనిని తప్పక కరుణించి అనుగ్రహిద్దాం అని అన్నాడు.

రోజూలాగే ఆరోజు రాత్రి కూడా మహాలక్ష్మీ, శ్రీనివాసుడు ఉద్యానవనం అంతా విహరించి ఒకచోట అద్భుతమైన గులాబీ పూలమొక్కలు కనపడగా వాటి సౌందర్యానికి ముగ్ధురాలై నిలుచున్నది. అప్పుడు శ్రీనివాసుడు రెండు గులాబీ పూలను తెంపి తన ప్రియసఖి శ్రీ మహాలక్ష్మీ సిగను అలంకరించాడు. జగన్మాత పులకరించిపోయింది. కొంచెం ముందుకు వెళ్ళిన తరువాత ఆమెకు అద్భుతమైన మల్లెతీగ కనపడింది. అందుండి గుప్పెడు మల్లెలు త్రెంపుకుని శ్రీమన్నారాయణునిపై విసిరింది.



శ్రీనివాసుడు కూడా కొన్ని పూలను తెంపి ఆమెపై వేశాడు. ఆవిధంగా వారిద్దరూ ఆ రాత్రి ఉద్యానవనమంతా విహరించి ఎంతో ఆనందపరవశులయ్యారు.

ఉదయం పూలు కోసుకొనడానికి వచ్చిన అనంతాచార్యులవారికి తోటంతా నలిగిన పూలతో చిందరవందరగా వుంది. ఎవరో దొంగలు రాత్రి ప్రవేశించి తోటనంతా పాడు చేశారని తలచాడు. అక్కడక్కడా కొన్ని పూలను కోసుకుని ఆనందనిలయంలో స్వామికి సమర్పించాడు. ఆరోజు రాత్రి శ్రీమన్నారాయణుడు, శ్రీ మహాలక్ష్మి తిరిగి తోటకు వచ్చారు. ఆ రోజు తోటలో సంపెంగలు, సన్నజాజులు, ఇంకా అనేక దివ్యమైన పూలు ఎంతో అద్భుతంగా కనబడ్డాయి. ఆ దంపతులిద్దరూ తోటంతా తిరుగుతూ ఆడుతూ, పాడుతూ గడిపారు. శ్రీనివాసుడు కొన్ని అందమైన పుష్పాలను త్రుంచి ఆ జగన్మాత సిగను అలంకరించి మురిసిపోయాడు. ఆ తల్లి ఆనందానికి అవధులు లేవు. ఇంతలో తెల్లవారటంతో వారిరువురు తిరిగి ఆనందనిలయం చేరారు.

ఉదయాన్నే తోటలో అడుగుపెట్టిన అనంతాచార్యుల వారి కోపానికి అవధులు లేవు. తోటంతా చిందరవందరగా త్రుంచివేసిన పూలతో వుండటం చూసి ఈ రోజు కూడా ఆ దొంగలు వచ్చినారని తలచాడు. తనకత్యంత ప్రీతిపాత్రులైన శ్రీలక్ష్మీ నారాయణుల కైంకర్యానికై పెంచుతున్న ఈ పూలతోటను ఇట్లా పాడు చేసినవారిని ఎలాగైనా పట్టుకొనవలసిందే అని తలచాడు. ఆ రాత్రి తోటలో ఒకమూల పడుకుని వున్నాడు. రాత్రంతా గడిచింది. చప్పుడు లేదు. హమ్మయ్యా! తాను కాపలా కాస్తున్నాడని గ్రహించి, దొంగలు వచ్చినట్టులేరు అని తలచాడు. ఇంతలో తెల్లవారింది. తోటంతా నిన్నటిమాదిరిగానే తిరిగి చిందరవందరగా వున్నది. పూలన్నీ ఎక్కడ పడితే అక్కడ విసిరివేయబడి వున్నాయి. ఈ దొంగలు ఏ మాత్రము శబ్దం చేయకుండా వచ్చినట్టు వున్నారు అని తలచాడు. ప్రతిరోజు వారిని పట్టుకునేవరకు కాపలా వుండవలసిందేనని తలచాడు. ఆ విధంగా ఎనిమిదిరోజులు గడిచాయి. కానీ ఆ చోరులు అతడికి దొరకలేదు. ఆ చోరులు దొరికేలా తనను అనుగ్రహించమని ఆనందనిలయంలో శ్రీ స్వామినే శరణువేడాడు.

దయామయురాలైన జగన్మాత శ్రీమన్నారాయణునితో ఈనాడు ఆచార్యులవారిని ఎలాగైనా కరుణించుదామని అన్నది. భక్తవత్సలుడైన శ్రీనివాసుడు అలాగే అన్నాడు. ఆనాటి రాత్రి అనంతాచార్యులవారు కనులలో వత్తులు వేసుకుని మరీ ఆ చోరులకోసం ఎదురు చూస్తున్నారు. ఈరోజు ఎలాగైనా వారిని పట్టుకొనవలసిందేనని ధృఢ సంకల్పంతో వున్నాడు. ఇంతలో ఆచార్యులవారికి రెండు స్త్రీ, పురుష ఆకారాలు ఆ పూలమొక్కల మధ్య తిరుగాడుతూ కనిపించాయి. సందేహం లేదు, రోజూ నా పూలమొక్కలను పాడు చేస్తున్నది వీరేనని తలచాడు. వారిద్దరూ ఎంతో దివ్య తేజస్సుతో కనపడ్డారు. పురుషుడు అద్భుత తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. ఆ స్త్రీ అద్భుత సౌందర్యంతో దివ్య ఆభరణాలతో విరాజిల్లుతున్నది. వారిని చూసిన అనంతాచార్యులు ఒక్క క్షణం మైమరచిపోయాడు. ఇంతలో అతనికి కర్తవ్యం గుర్తుకు వచ్చింది. నెమ్మదిగా వెనుకగా వెళ్ళి వారిద్దరిని గట్టిగా బంధించాడు. ఇంక ఎక్కడికి పోతారు అని అన్నాడు. ఆ దంపతులు పారిపోవటానికి శతవిధాల ప్రయత్నించారు. కానీ సాధ్యపడలేదు. ఆ జగన్నాటక సూత్రధారి, ఆ జగన్మాత తన భక్తునితో నాటకాలాడుతున్నారు. అతని బంధం ఎంతో గట్టిదని, అతడికి తోచేలా ముచ్చటపడుతున్నారు. మరి భగవంతునికి, భక్తునికి గల బంధం అంతటిదే కదా.

ఆచార్యులవారు దొంగలు దొరికారనే సంతోషంలో కొంచెం ఏమరపాటుగా వుండగా ఆ పురుషుడు ఒక్క ఉదుటున బంధనం తెంచుకుని పరిగెత్తి మాయమైనాడు. అది గ్రహించిన ఆచార్యులవారికి తీవ్ర కోపం కలిగింది. ఈమెకూడా భర్త వెనుకే పరిగెడుతుందేమోనని ఆమెను గట్టిగా పట్టుకున్నాడు. భార్యను వదిలి ఇలా వెళ్ళిపోతాడా, తిరిగి ఉదయం భార్యకోసం రాకుండా పోతాడా అని తలచాడు. ఆమెను గట్టిగా పట్టుకుని ముందుకు నడిపించి, ఆ తోటలోని ఒక సంపెంగ మానుకు తీగలతో బంధించాడు. అప్పుడు ఆమె తనను విడిచిపెట్టమని అడిగింది. ఉదయం చూద్దాంలే అనుకుంటూ వెళ్ళి కునుకు తీశాడు.

ఇంతలో తెల్లవారింది. ఆనంద నిలయంలో తలుపులు తీసిన అర్చకస్వాములు నిశ్చేష్టులయ్యారు. వారినోట మాట రాలేదు. శ్రీనివాసుని వక్షస్థలంపై వుండవలసిన



జగన్మాత బంగారు ప్రతిమ కానరాక ఆందోళన చెందారు. ఏమిటీ వైపరీత్యం, ఇంతటి విపరీతబుద్ధి ఎవరికి పుట్టింది అని తలచారు. అప్పుడు శ్రీమన్నారాయణుడు ఆకాశవాణి రూపంలో ఇలా పలికాడు. మీరేమీ చింతించవలదు. నా ప్రియసఖి అనంతాచార్యుల వారి తోటలో బంధింపబడి వున్నది. మీరందరూ వెళ్లి ఆమెను సగౌరవంగా తోడ్కొని రమ్మని పలికారు.

ఆ వెంటనే అర్చకులందరూ పరుగు పరుగున తోటకు వెళ్ళగా అక్కడ సంపెంగ మానుకు బంధింపబడి వున్న శ్రీమహాలక్ష్మి బంగారు ప్రతిమ కనిపించింది. జరిగినది గ్రహించిన అనంతాచార్యులు తనకేమీ తెలియదని ఆ అర్చకులతో మొర పెట్టుకున్నాడు. అప్పుడు అర్చకులందరూ అనంతాచార్యులతో సహా అలిమేలుమంగను పలువిధాల స్తుతిస్తూ ఒక పూల గంపలో పెట్టుకుని ఆలయానికి తీసుకువచ్చారు. ఆనంద నిలయంలో ప్రవేశించగానే శ్రీనివాసుడు ఆకాశవాణి రూపంలో ఇలా పలికాడు. మామా! అనంతాచార్యా నీ కూతురిని నాకు పూలబుట్టలో తెచ్చి ఇచ్చిన నీవు నాకు కన్యాదాతవైన మామగారివి. నీ పుష్పకైంకర్యానికి మేమిద్దరం ఎంతో ఆనందపడ్డాము. ఇదంతా మా వేడుకే అని అన్నాడు. అప్పుడు ఆ పూలగంపలోని అమ్మవారు, క్షీర సముద్ర రాజ తనయ తిరిగి యథాప్రకారంగా శ్రీవారి వక్షస్థలాన్ని అలంకరించింది. అనంతాచార్యులవారి జన్మ ధన్యమైనది. జగన్మాత శ్రీ మహాలక్ష్మికి తన భక్తులంటే అంతటి అనురాగం, ఆప్యాయత.

గృహాలలో గృహలక్ష్మిగాను, గోవులలో కామధేనువుగాను, యజ్ఞంలో దక్షిణాదేవిగాను, చంద్రునిలో శోభాలక్ష్మిగాను, పాతాళంలో నాగలక్ష్మిగాను, సూర్యునిలో తేజోలక్ష్మిగాను, పృథ్విలో మహాలక్ష్మిగాను ప్రకాశిస్తున్న ఆ తల్లి శ్రీమన్నారాయణుని హృదయలక్ష్మిగా భక్తులందరిని తరింపచేస్తున్నది. తిరుమలలో ఆనందనిలయంలో ప్రతీ శుక్రవారం శ్రీనివాసునికి జరిగే అభిషేకం ఆ తల్లి అభిషేకమే. ఓ జగన్మాతా! నీకివే మా నమస్కారములు. ఓ జగజ్జననీ! నీకివే మా ప్రణామములు. ఓ విష్ణుప్రియా! నీకివే మా నమస్కారములు.

# ఏడవ అధ్యాయము

శ్రీ మహాలక్ష్మి అష్టలక్ష్మీ స్వరూపంతో తన భక్తులను అనుగ్రహిస్తుంది. ఆ తల్లి ఆదిలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, గజలక్ష్మి, సంతానలక్ష్మి, విజయలక్ష్మి, విద్యాలక్ష్మి, ధనలక్ష్మి అనే అష్ట రూపాలతో తనను కొలిచినవారిని రక్షిస్తూ వుంటుంది. ధవళ వస్త్రధారియై కమలములను చేత ధరించి, ఎంతో సుప్రసన్నంగా, దివ్య సుందర వదనంతో మనలనందరిని అలరించే శ్రీమహాలక్ష్మి తొలి పూర్ణాంశ అవతారం ఆదిలక్ష్మి, తనను నమ్మినవారిని జీవితాంతం అనుగ్రహించి, వారి సుఖ సంతోషాలను చూసే మంగళ ప్రదాయిని ఆదిలక్ష్మి.

అన్నం పరబ్రహ్మ స్వరూపం, అన్నం లేనిదే ఏ జీవి బ్రతకలేదు. ధాన్యలక్ష్మిరూపంలో శ్రీ మహాలక్ష్మి జనులందరికి పాడిపంటలను అభివృద్ధి చేసి వారి సుఖ సంతోషాలకు మూలమై నిలుస్తుంది. ప్రతి మానవుడు జీవితంలో ప్రతీ నిత్యం అనేక సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది. వీటన్నిటిని ఎదుర్కొనే శక్తినిచ్చే



ధైర్యలక్ష్మి స్వరూపంలో శ్రీ మహాలక్ష్మి వారికి ఎంతో మనోధైర్యాన్ని ప్రసాదిస్తుంది. గజం ఐశ్వర్యానికి ప్రతీక. శ్రీ మహాలక్ష్మి వాహనం గజం. అష్టలక్ష్ములలో మూడవ అంశయైన గజలక్ష్మి స్వరూపంలో శ్రీ మహాలక్ష్మి తనను నమ్మినవారికి ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తుంది. లోకములందు సృజన సాగడానికి శ్రీలక్ష్మీ నారాయణుల అనుగ్రహం ఎంతో అవశ్యం. తనను నిత్యం కొలిచేవారికి సత్సంతానాన్ని అనుగ్రహించే అమృతమూర్తి సంతానలక్ష్మి స్వరూపమైన శ్రీ మహాలక్ష్మియే. విజయలక్ష్మి అంశలో శ్రీ మహాలక్ష్మి తన భక్తులు చేసే అన్ని కార్యాలలోను విజయం చేకూరేలా అనుగ్రహిస్తుంది.

మానవునికి విద్యా, విజ్ఞానం ఎంతో అవసరం. సద్బుద్ధులు కలగడానికి, జ్ఞాన సముపార్జనకు విద్యాశక్తి ఎంతో ముఖ్యమైనది. ఆ విద్యాశక్తిని అనుగ్రహించే విద్యాలక్ష్మి స్వరూపంతో శ్రీ మహాలక్ష్మి భక్తులను అనుగ్రహిస్తుంది. ధనం అంటే ఐశ్వర్యం. ధనలక్ష్మిగా ప్రతి ఇంట కొలువై తనను అర్చించేవారికి సర్వ సౌభాగ్యాలను, సర్వ ఐశ్వర్యాలను ప్రసాదించే అమృతమూర్తి శ్రీ మహాలక్ష్మి.

పచ్చని తోరణాలు, ఎంతో అందమైన ముగ్గులు, మంగళవాయిద్యాలు, దీపం, దైవం, వున్నచోట్ల మహాలక్ష్మి ఎంతో ఆనందంగా నివసిస్తుంది. పరధనం, పరస్త్రీని, పరుల సొత్తును తృణంగా భావించే వారింట ఆ జగన్మాత నివసిస్తుంది. జీవనదులను, నిండు సరస్సులను, గోవు తోకయును, గోధూళియందును, బిల్వం, తులసి, అశ్వత్థం, మరువం, చంపకం, పారిజాతం, పద్మం, మల్లె, మామిడి, పత్ర పుష్పాదులు శ్రీ మహాలక్ష్మి నివసించు స్థానములు.

అతిథులను ఆదరించేవారు, తల్లిదండ్రులను సేవించేవారు, దానం, ధర్మం, కలవారును, వినయ విధేయతలు కలవారును, సత్యశీలురైన విద్వాంసులు కల గృహములందు శ్రీ మహాలక్ష్మి నివసిస్తుంది. పసుపు, పారాణి, గంధం, కుంకుమ, కాటుకలచే అందమైన ఆభరణాలచే అలరారు ముత్తైదువులు శ్రీ మహాలక్ష్మి స్వరూపులు.

అనాచారులు, అన్నం వృధా చేయువారు, సూర్యోదయ, సూర్యాస్తమయ

సమయంలో నిద్రించేవారు, ఎడమచేతితో ఇచ్చి పుచ్చుకునేవారు, మడి ఆచారం లేనివారు, స్త్రీ సంతాన ఆస్తిని అపహరించువారు, అతిథులను సంతృప్తి పరచనివారును, గురుపత్నిని, అన్నభార్యను, సవతి తల్లిని తల్లిగా భావించనివారు ఇటువంటివారు వున్న గృహములయందు శ్రీ మహాలక్ష్మి ఎటువంటి పరిస్థితులలోను నివసించదు. పరస్త్రీ వ్యామోహం, వ్యభిచారం, చౌర్యం, సోమరితనం, పెద్దలను ధిక్కరించువారును ఉన్నచోట ఆ మహాలక్ష్మి నివసించదు.

ఎవరైతే తమ ఇంటిని పరిశుభ్రంగా వుంచుకుంటూ నిత్యం దీపం వెలిగిస్తూ దేవతారాధన చేస్తూ, సత్యం పలుకుతూ ధర్మబద్ధ జీవితం కొనసాగిస్తూ, ఇంటికి వచ్చిన అతిథిని సాక్షాత్తూ శ్రీమన్నారాయణునిగా భావిస్తూ, వారికి సకల మర్యాదలు చేసే వారింట శ్రీ మహాలక్ష్మి ఆనందంగా నివసిస్తుంది.

ఇప్పటివరకు ఆరు మన్వంతరాలు పూర్తయి ప్రస్తుతం ఏడవ మన్వంతరంలో వైవస్వతుని పాలన జరుగుతున్నది. స్వాయంభువ, స్వారోచిష, ఉత్తమ, తామస, రైవత, చాక్షువ, మనువుల తరువాత వైవస్వతుని పాలనలో ఇది నాలుగవ యుగం. ఈ ఏడు మన్వంతరాలలోను శ్రీ మహాలక్ష్మి అనేక రూపాలలో ప్రకాశించింది.

తొలి మనువైన స్వాయంభువ మనువు కాలంలో శ్రీ మహాలక్ష్మి భృగు మహర్షి పుత్రికగా జన్మించింది. ద్వితీయ మనువు స్వారోచిషుని కాలంలో శ్రీ మహాలక్ష్మి అగ్నితత్వంగా భాసించింది. అగ్ని నుండి ఆవిర్భవించిన అద్వితీయ తేజోశక్తిగా నిలచింది. సాక్షాత్తూ ఆ శ్రీమహాలక్ష్మియే అగ్ని తత్వంతో ప్రకాశిస్తున్నందువలన అగ్నిని అర్చించినవారికి ఆ శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం లభిస్తుంది. అందుకనే ప్రతీ శుభకార్యాదులలోను అగ్ని ఆరాధన అనాదికాలం నుండి వస్తున్నది. ఎంతటి వస్తువుకైనా, పదార్థానికైనా ఉన్న మాలిన్యం, అశౌచం, అపవిత్రం తొలగించే శక్తి అగ్నికి వున్నది. అగ్ని దేవుని ఆరాధించి, ప్రజలు అగ్ని అనుగ్రహానికి పాత్రులైతే సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా లభించి, దేశం సస్యశ్యామలంగా వుంటుంది. ఆ ధన ధాన్యాలకు శ్రీ మహాలక్ష్మియే ప్రతిరూపం. ఋగ్వేదంలోని శ్రీ



సూక్తం శ్రీ మహాలక్ష్మియొక్క అగ్నితత్వాన్ని తెలుపుతుంది. ఆవిధంగా ద్వితీయ మనువు స్వారోచిషుని కాలంలో అగ్ని ఉద్భవ పద్మముఖిగా శ్రీ మహాలక్ష్మి భాసిల్లింది.

సప్త మనువులలో మూడవ వాడైన ఉత్తమ మనువు పాలనలో శ్రీ మహాలక్ష్మి జలతత్వం పొంది నీటినుండి ఉద్భవించింది. ఈ విశ్వం మొత్తం ప్రళయానంతరం జలమయం అవుతుంది. అందుండే తిరిగి సృష్టి ప్రారంభమౌతుంది. నీటికే నారము అని పేరున్నది. నీటినందు ఆశ్రయం కలిగిన శ్రీ మహా విష్ణువు నారాయణుడు అయ్యాడు. సర్వశక్తులను తన శక్తిలో ఇముడ్చుకున్న జలం సాక్షాత్తూ శ్రీ మహాలక్ష్మి స్వరూపం.

నాలుగవ వాడైన తామస మనువు ఈ ప్రపంచాన్ని పరిపాలించిన సమయంలో శ్రీ మహాలక్ష్మి భూతత్వంతో భూదేవిగా జన్మించింది. అటు తరువాత రైవత మన్వంతర కాలంలో బిల్వ వృక్ష స్వరూపిణిగా ఆవిర్భవించిందని వేదం చెబుతున్నది. ఆ బిల్వ వృక్ష ఫలములు భక్తులలోని అశుభ, అపరాధ ఛాయలన్నింటిని నిర్మూలించగలవని తద్వారా, లక్ష్మీ కళ కలగాలని శ్రీ సూక్తం నిర్వచిస్తున్నది. పూవులు లేకుండా ఫలములనందించే అద్భుతశక్తి బిల్వవృక్షానికి కలదు. బిల్వవృక్షం (మారేడు) వున్నచోట శ్రీ మహాలక్ష్మి నివసిస్తుంది. బిల్వవృక్షాన్ని ఆరాధించినవారికి సకల శుభాలు కలుగుతాయి.

సప్త మనువులలో ఆరవ వాడైన చాక్షువ మనువు కాలంలో శ్రీ మహాలక్ష్మి కమలరూపిణిగా కమలమునందు ఆవిర్భవించింది. ఎటువంటి మానవ ప్రయత్నం లేకుండా ఉద్భవించి, మానవాళికి ఉపయోగపడేది కమలం. ఇహలోకంలో ఏ ప్రభావం పొందకుండా అత్యంత మనోహరంగా వుంటూ పరంలోని ఏకైక పరబ్రహ్మమూర్తితో అనుసంధానమై వుంటుంది కనుక పద్మం దేవతలందరికీ ఉచితాసనమైంది. అందునా శ్రీ మహాలక్ష్మికి అత్యంత ప్రీతికరమైనది. ఆ తల్లి చాక్షువ మన్వంతరంలో పద్మంలోనే ఉద్భవించింది.

పద్మప్రియాం పద్మహస్తాం పద్మాక్షీం
పద్మ సుందరీం
పద్మోద్భవాం పద్మముఖీం పద్మనాభ
ప్రియాం రమాం
పద్మ మాలాధరాం దేవీం పద్మినీం
పద్మగంధినీం

శ్రీ మహాలక్ష్మి పద్మములు వంటి కనులు, ముఖము కలదై పద్మమునందు గల సుగంధ పరిమళాలతో, పద్మమునందు ప్రీతి కలిగి పద్మమునందు నుంచే ఆవిర్భవించి, భక్తులను అనుగ్రహిస్తున్నది. ఇక ప్రస్తుత వైవస్వత మన్వంతరంలో పాల సముద్రం నుంచి చంద్ర సహోదరిగా ఆవిర్భవించి తనను నమ్మి కొలిచినవారందరికి సర్వ సౌభాగ్యాలను ప్రసాదిస్తున్నది.

శ్రీ లక్ష్మీనారాయణుల అన్యోన్యత మహోన్నతమైనది. 'ఓం'కారంలో 'అ' కారం విష్ణు స్వరూపం. 'ఉ'కారం శ్రీ మహాలక్ష్మీ స్వరూపం. 'మ' కారం జీవస్వరూపం, ఈ ప్రకృతి మొత్తాన్ని చైతన్యపరుస్తున్నది ఆ శ్రీ మహాలక్ష్మియే. ఎక్కడ ఆ జగన్మాత ఉంటుందో అక్కడ సత్యవాక్కు, పాప విముక్తి, రాజపూజ్యత ఉంటుంది. సత్యం, సలక్షణం, మృదుభాషిత్వం, శౌర్యం, వీరత్వం, సాహసం, అశ్వాలు, గజాలు, తెల్లపావురాలు, కపిలధేను వత్సములు, దైవ నివేదితమైన అన్నం, ఆచార్యుని, తల్లితండ్రుల పాదాలును, అన్ని మంగళకర, సౌందర్యయుక్తములును, స్త్రీ కన్నీరు కార్చని ఇల్లు, ఇవన్నియు శ్రీ మహాలక్ష్మియొక్క నివాస స్థలములు. పచ్చని తోరణాలు, ఎంతో అందమైన ముగ్గులు, మంగళవాయిద్యాలు ఉన్నచోట శ్రీ మహాలక్ష్మి అలరారుతూ ఉంటుంది.

ఈ సృష్టిలో మంగళ కరమైన, శుభకరమైన సమస్త వస్తువులయందును ప్రకాశిస్తూ మమ్ములను అందరినీ అనుగ్రహిస్తున్న ఓ జగన్మాత! నీకివే మా నమస్కారములు. ఓ జగజ్జననీ! నీకివే ప్రణామములు. ఓ విష్ణుప్రియా! నీకివే మా నమస్కారములు.

శ్రీ మహాలక్ష్మి మాహాత్మ్యము

శ్లో॥ లక్ష్మీం క్షీర సముద్రరాజ తనయాం శ్రీరఙ్గ ధామేశ్వరీం
దాసీభూత సమస్త దేవవనితాం లోకైక దీపాంకురామ్ ।
శ్రీమన్మన్ద కటాక్ష లబ్ధ విభవ బ్రహ్మేంద్ర గంగాధరాం
త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజాం వన్దే ముకుంద ప్రియాం ।

ఓ జగన్మాతా! నీవు సముద్రరాజకన్యవు. సర్వలోకములకు మంగళ ప్రదాయినివి, శ్రీమన్నారాయణుని ప్రియసఖివి, నిన్ను నమ్మి కొలిచేవారికి సర్వసౌభాగ్యాలూ అనుగ్రహించే అమృతమూర్తివి. నీవు వున్న ఇంటియందు సర్వ ఐశ్వర్యములు కలుగుతాయి. దేనికీ లోటు వుండదు. అందరూ సుఖసంతోషాలతో ఉంటాయి. ఈ సృష్టిలో అత్యంత మనోహరమైన, మంగళకరమైన, శుభకరమైన వస్తువులన్నిటియందును దివ్య తేజస్సుతో ప్రకాశిస్తూ మమ్ములనందరిని అనుగ్రహిస్తున్న ఓ జగన్మాతా! నీకివే మా నమస్కారములు. ఓ జగజ్జననీ! నీకివే మా ప్రణామములు. ఓ విష్ణుప్రియా! నీకివే మా నమస్కారములు.

"యా దేవీ సర్వభూతేషు లక్ష్మీ రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః"

" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "

శ్రీ లక్ష్మీ శ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు !
సమస్త సన్మంగళాని భవంతు
లోకా సమస్తా సుఖినోభవంతు
ఓం శాంతి శాంతి శాంతి

## శ్రీ మహాలక్ష్మీ అష్టోత్తర శతనామావళి

ప్రతి నామమునకు ముందు ‘ఓం’ అనియు చివర ‘నమః’ అనియు పూజించవలెను.

ప్రకృత్యై
వికృత్యై
విద్యాయై
సర్వభూతహితప్రదాయై
శ్రద్ధాయై
విభూత్యై
సురభ్యై
పరమాత్మికాయై
వాచ్యై
పద్మాలయాయై
పద్మాయై
శుచ్యై
స్వాహాయై
స్వధాయై
సుధాయై
ధన్యాయై
హిరణ్మయై
లక్ష్మ్యై
నిత్యపుష్టాయై
విభావర్యై
ఆదిత్యై
దిత్యై
దీప్తాయై
వసుధాయై
వసుధారిణ్యై
కమలాయై
కాంతాయై
కామాక్ష్యై
క్రోధసంభవాయై
అనుగ్రహప్రదాయై
బుద్ధ్యై
అనఘాయై
హరివల్లభాయై
అశోకాయై
అమృతాయై
దీప్తాయై
లోకశోక వినాశిన్యై
ధర్మనిలయాయై
కరుణాయై
లోకమాత్రే
పద్మప్రియాయై
పద్మహస్తాయై
పద్మాక్ష్యై
పద్మసుందర్యై
పద్మోద్భవాయై
పద్మముఖ్యై
పద్మనాభప్రియాయై
రమాయై
పద్మమాలాధరాయై
దేవ్యై
పద్మినై
పద్మగంధిన్యై
పుణ్యగంధాయై
సుప్రసన్నాయై
ప్రసాదాభిముఖ్యై
ప్రభాయై
చంద్రవదనాయై
చంద్రాయై
చంద్రసహోదర్యై
చతుర్భుజాయై
చంద్రరూపాయై
ఇందిరాయై
ఇందు శీతలాయై
ఆహ్లోదజనన్యై
పుష్ట్యై
శివాయై
శివకర్యై
సత్యై
విమలాయై
విశ్వజనన్యై
తుష్ట్యై
దారిద్ర్య నాశిన్యై
ప్రీతిపుష్కరిణ్యై
శాంతాయై
శుక్లమాల్యాంబరాయై
శ్రియై
భాస్కర్యై
బిల్వనిలయాయై
వరారోహాయై
యశస్విన్యై
వసుంధరాయై
ఉదారాంగాయై
హరిణ్యై
హేమమాలిన్యై
ధనధాన్యకర్యై
సిద్ధ్యై
స్త్రైణ సౌమ్యాయై
శుభప్రదాయై
నృపవేశ్మగతానందాయై
వరలక్ష్మ్యై
వసుప్రదాయై
శుభాయై
హిరణ్యప్రాకారాయై
సముద్రతనయాయై
జయాయై
మంగళాదేవ్యై
విష్ణువక్షస్థలస్థితాయై
విష్ణు పత్న్యై
ప్రసన్నాక్ష్యై
నారాయణసమాశ్రితాయై
దారిద్ర్యధ్వంసిన్యై
దేవ్యై
సర్వోపద్రవవారిణ్యై
నవదుర్గాయై
మహాకాళ్యై
బ్రహ్మవిష్ణుశివాత్మికాయై
త్రికాలజ్ఞాన సంపన్నాయై
భువనేశ్వర్యై



## శ్రీ మహాలక్ష్మీ అష్టకమ్

(ఇంద్రకృతమ్)

నమస్తేస్తు మహామాయే శ్రీపీఠే సురపూజితే
శంఖచక్ర గదాహస్తే మహాలక్ష్మి నమోస్తుతే ॥ 1
నమస్తే గరుడారూఢే డోలాసుర భయంకరి
సర్వపాపహరేదేవి మహాలక్ష్మి నమోస్తుతే ॥ 2
సర్వజ్ఞే సర్వవరదే సర్వదుష్ట భయంకరి
సర్వదుఃఖహరే దేవి మహాలక్ష్మి నమోస్తుతే ॥ 3
సిద్ధిబుద్ధిప్రదేదేవి భుక్తిముక్తి ప్రదాయిని
మంత్రమూర్తే సదాదేవి మహాలక్ష్మి నమోస్తుతే ॥ 4
ఆద్యన్తరహితే దేవి ఆద్యశక్తి మహేశ్వరి
యోగజ్ఞే యోగసంభూతే మహాలక్ష్మి నమోస్తుతే ॥ 5
స్థూల సూక్ష్మే మహారౌద్రే మహాశక్తి మహోదరే
మహాపాపహరే దేవీ మహాలక్ష్మి నమోస్తుతే ॥ 6
పద్మాసన స్థితే దేవీ పరబ్రహ్మ స్వరూపిణి
పరమేశి జగన్మాతః మహాలక్ష్మి నమోస్తుతే ॥ 7
శ్వేతాంబరధరే దేవి నానాలంకార భూషితే
జగత్స్థితే జగన్మాతః మహాలక్ష్మి నమోస్తుతే ॥ 8
మహాలక్ష్మ్యష్టకం స్తోత్రం యః పఠేద్భక్తిమాన్నరః
సర్వసిద్ధిమవాప్నోతి రాజ్యం ప్రాప్నోతి సర్వదా ॥ 9
ఏకకాలే పఠేన్నిత్యం మహాపాపవినాశనం
ద్వికాలం యః పఠేన్నిత్యం ధనధాన్యసమన్వితః ॥ 10
త్రికాలం యః పఠేన్నిత్యం మహాశత్రువినాశనం
మహాలక్ష్మీర్భవేన్నిత్యం ప్రసన్నా వరదా శుభా ॥ 11

H H H

## శ్రీ లక్ష్మీనారాయణ అష్టోత్తర శతనామావళిః

ధ్యానమ్ : లక్ష్మీనారాయణౌ దివ్యదంపతీ జగతాం పతీ। చరణౌ శరణంయామి సర్వాభీష్ట ఫలప్రదౌ ॥

ప్రతి నామమునకు ముందు 'ఓం' అనియు చివర 'నమః' అనియు పూజించవలెను.

| | | |
|---|---|---|
| శ్రియై | నిత్యాయై | వేదవేద్యాయై |
| విష్ణవే | సత్యవ్రతాయ | అబ్ధిజామాత్రే |
| కమలాయై | గౌర్యై | సురూపాయై |
| శార్ఙ్గిణే | శౌరయే | అర్కేందులోచనాయ |
| లక్ష్మ్యై | కాంతాయై | పుణ్యాంగనాయై |
| వైకుంఠనాయకాయ | సురేశ్వరాయ | పుణ్యపాదాయ |
| ఇందిరాయై | నారాయణ్యై | పావన్యై |
| పుండరీకాక్షాయ | హృషీకేశాయ | పుణ్యకీర్తనాయ |
| రమాయై | పద్మహస్తాయై | విశ్వప్రియాయై |
| గరుడ వాహనాయ | త్రివిక్రమాయ | విశ్వనాథాయ |
| భార్గవ్యై | మాధవ్యై | వాగ్రూపిణే |
| శేషపర్యంకాయ | పద్మనాభాయ | వాసవానుజాయ |
| విశాలాక్ష్యై | స్వర్ణవర్ణాయై | సరస్వత్యై |
| జనార్దనాయ | నిరీశ్వరాయ | స్వర్ణగర్భాయ |
| స్వర్ణాంగ్యై | సత్యై | గాయత్ర్యై |
| వరదాయ | పీతాంబరాయ | గోపికా ప్రియాయ |
| దేవ్యై | శాంతాయై | యజ్ఞరూపాయై |
| హరయే | వనమాలినే | యజ్ఞభోక్త్రే |
| ఇందుముఖ్యై | క్షమాయై | భక్తభీష్టప్రదాయై |
| ప్రభవే | అనఘాయై | గురవే |
| సుందర్యై | జయప్రదాయై | స్తోత్ర ప్రియాయై |
| నరకధ్వంసినే | బలిధ్వంసినే | స్తోత్రకారాయ |
| లోకమాత్రే | వసుధాయై | సుకుమార్యై |
| మహాతపసే | పురుషోత్తమాయ | సువర్ణగాయ |
| భక్తప్రియాయై | రాజ్యప్రదాయై | మానిన్యై |
| దానవారయే | అఖిలాధారాయ | మందరధరాయ |
| అంబికాయై | మాయాయై | సావిత్ర్యై |
| మధుసూదనాయ | కంసవిదారణాయ | జన్మవర్జితాయ |
| వైష్ణవ్యై | మహేశ్వర్యై | మంత్రగోప్త్యై |
| దేవకీ పుత్రాయ | మహాదేవాయ | మహేష్వాసాయ |
| రుక్మిణ్యై | పరమాయై | యోగిన్యై |
| కేశిమర్దనాయ | పుణ్యవిగ్రహాయ | యోగివల్లభాయ |
| వరలక్ష్మ్యై | రమాయై | జయప్రదాయై |
| జగన్నాథాయ | ముకుందాయ | జయకరాయ |
| కీరవాణ్యై | సముఖ్యై | రక్షిత్రే |
| హలాయుధాయ | ముచికుంద వరప్రదాయ | సర్వరక్షకాయ |

శ్రీ లక్ష్మీ నారాయణ దివ్యదంపతిభ్యాం నమో నమః



## క్షీరాబ్ధి కన్యకకు .....

రాగం : మధ్యమావతి / కురింజి — రచన : అన్నమాచార్య

తాళం : ఖండచాపు

ప॥ క్షీరాబ్ధి కన్యకకు శ్రీ మహాలక్ష్మికిని
నీరజాలయకు నీరాజనం – నీరాజనం ॥ క్షీరా ॥

1. జలజాక్షి మోమునకు జక్కవ కుచంబులకు
నెలకొన్న కప్పురపు నీరాజనం
అలివేణి తురుమునకు హస్తకమలంబులకు
నిలువు మాణిక్యముల నీరాజనం ॥ క్షీరా ॥

2. చరణకిసలయములకు సకియరంభోరులకు
నిరతమగు ముత్యాల నీరాజనం
అరిది జఘనంబునకు అతివ నిజనాభికిని
నిరతి నానావర్ణ నీరాజనం ॥ క్షీరా ॥

3. పగటు శ్రీ వేంకటేసు పట్టపురాణియై
నెగడు సతికళలకును నీరాజనం
జగతి నలమేల్మంగా చక్కదనముల కెల్ల
నిగుడు నిజశోభనపు నీరాజనం ॥ క్షీరా ॥

H H H





శ్రియః కాంతాయ కళ్యాణనిధయే నిధయేర్థినామ్
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్




" ఓం విష్ణుపత్నీం! మహీం దేవీం! మాధవీం! మాధవప్రియామ్!
లక్ష్మీం! ప్రియ సఖీం! దేవీం! నమామ్యచ్యుత వల్లభామ్!"
(భూసూక్తం)